www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

గురువారం | 10-8-2017 | పేజీలు: 16 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 32 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం; తిథి: తదియ రా. 12.33 తదుపరి చవితి; నక్షత్రం: పూర్వాభాద్ర పూర్తి; వర్జ్యం: మ. 12.17-1.55; దుర్ముహూర్తం: ఉ. 10.14-11.05, మ. 3.18-4.09; అమృతఘడియలు: రా. 10.04-11.42; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.41 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

శ్రీరాం సాగర్‌కు పునరుజ్జీవం
16 లక్షల ఎకరాలకు పచ్చని పంటల వరం



నీటి పారుదల శాఖ
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము

తెలంగాణ వర ప్రదాయిని అయిన శ్రీరాం సాగర్ ప్రాజెక్టును గత పాలకులు వట్టిపోయేలా చేశారు. చివరి ఆయకట్టు దాకా నీరందిన చరిత్ర లేనే లేదు. పంట పండింది లేదు. కడుపు నిండింది లేదు. ప్రాజెక్టు ఉండీ లేని సమానమైంది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు దార్శనికతతో భవిష్యత్ అవసరాలు తీర్చే విధంగా శ్రీరాంసాగర్ కు తిరిగి పునరుజ్జీవనం ఇచ్చే సృజనాత్మక పథకానికి ఆకృతినిచ్చారు.



ఎస్.ఆర్.ఎస్.పి. పునరుజ్జీవ పథకం

పధాన గోదావరిలో ఎగువ రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి ఒక్క చుక్క నీరు రాకున్నా సరే.. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు, కాలువలు నిత్యం జలకళ ఉట్టిపడేలా రూ.2వేల కోట్లతో ఎస్.ఆర్.ఎస్.పి. పునరుజ్జీవం పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

ప్రాణహిత ద్వారా గోదావరికి వచ్చి చేరుతున్న నీటిని మేడిగడ్డ నుంచి తోడి రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి మళ్లిస్తారు. మేడిగడ్డ నుంచి గోదావరి నీటిని ఎల్లంపల్లి, ఎస్.ఆర్.ఎస్.పి. వరద కాలువ, మిడ్ మానేరు, లోయర్ మానేరుకు తరలిస్తారు.

వరదకాలువను జలాశయంగా మారుస్తారు. అన్ని కాలువల ప్రవాహ సామర్థ్యాన్ని పెంచుతారు. ఎస్.ఆర్.ఎస్.పి. కాలువల్లో నిరంతరం నీరు పారేలా, అన్ని చెరువులను నింపేలా పథకం.

గౌరవ ముఖ్యమంత్రి

శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు

గారి చేతుల మీదుగా లక్షలాది మంది రైతుల ఆనందోత్సాహాల నడుమ...

నేడే శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకం శంఖుస్థాపన

స్థలం: ఎస్.ఆర్.ఎస్.పి., పోచంపాడు గ్రామం, నిజామాబాద్ జిల్లా
తేది: 10 ఆగస్టు 2017, సమయం: ఉదయం 11 గంటలు,
బహిరంగ సభ: మధ్యాహ్నం 12 గంటలు


గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారితో నీటి పారుదల శాఖామాత్యులు, శ్రీ తన్నీరు హరీష్‌రావు గారు

గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతంలో ప్రతీ నీటి బొట్టును ఒడిసిపట్టి తెలంగాణ నేలను తడిపేలా ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను నిర్మిస్తున్నది. గత పాలకులు తెలంగాణను వంచిస్తూ లోపభూయిష్టంగా చేసిన డిజైన్లను మార్చి, తెలంగాణ అవసరాలకు తగినట్టు రీ డిజైన్ చేసిండు మన ముఖ్యమంత్రి కేసీఆర్.



తీరుతున్నది మన రైతుల నీటి కల - తెలంగాణ నేలంతా ఇక అపూర్వ జలకళ

ఏడు జిల్లాలకు వర ప్రదాయిని కాళేశ్వరం ఎత్తిపోతల పథకం: పాత కరీంనగర్, వరంగల్,మెదక్, నల్గొండ, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు... శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు జలాశయాల కింద ఉన్న మరో 18 లక్షల ఎకరాలను స్థిరీకరించడం... దారి పొడుగున ఉన్న వందలాది గ్రామాలకు, హైదరాబాద్ నగరానికి మంచినీరు అందించే బృహత్తర ప్రాజెక్టు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం. వచ్చే ఏడాది నుంచే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి పంట పొలాలకు గోదావరి నీరు అందుతుంది.

వలసలు ఆపే కల్పతరువు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు: మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పథకం.

శరవేగంగా పూర్తవుతున్న ఆన్ గోయింగ్ ప్రాజెక్టులు : పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయల్ సాగర్ ఎత్తిపోతల పథకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, శరవేగంగా పూర్తి చేయడం వల్ల 8లక్షల ఎకరాలకు సాగునీరు అందించే వెసులుబాటు కలిగింది.

నల్గొండ ఫ్లోరైడ్ బాధలు తీర్చి బతుకునిచ్చే డిండి ఎత్తిపోతలు: పాత నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలైన దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో 3.41 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు.

ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టు : పాత ఖమ్మం జిల్లాలో 3.87 లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టుకు, 6.44 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఉద్దేశించిన పథకం.

ఆదిలాబాద్ పొలాలకు ప్రాణం పోసే ప్రాణహిత ఎత్తిపోతల పథకం: ఆదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు ప్రాణహిత నది నుంచి సాగునీరు అందించే పథకం

తుపాకుల గూడెం బ్యారేజితో దేవాదులకు నిరంతర నీరు: గోదావరి నదిపై తుపాకుల గూడెం వద్ద బ్యారేజి నిర్మించడం వల్ల దేవాదుల ఎత్తిపోతల పథకం పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో 6.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

పాలేరు బతుకులు పండించే భక్త రామదాసు ఎత్తిపోతల పథకం : రికార్డు స్థాయిలో 11 నెలల్లోనే పూర్తయి కరువు పీడిత పాలేరు నియోజకవర్గంలో 59వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న పథకం.

మిషన్ కాకతీయతో మారిన పల్లె వాతావరణం: సమైక్య పాలనలో శిథిలమైన 46వేల చెరువులను పునరుద్ధరించే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా సాగుతున్నది. చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజలమట్టం పెరిగింది. పూడిక మట్టి పోసుకోవడంతో పొలాల్లో భూసారం పెరిగింది. చెరువుల్లో జలకళ ఉట్టి పడడంతో పల్లెల వాతావరణమే మారిపోయింది. చేపల పెంపకానికీ ఉపయోగపడింది. రెండు దశల్లో అమలు అయిన మిషన్ కాకతీయ ఫలితంగా గత ఖరీఫ్, రబీ పంట కాలంలో రికార్డు స్థాయిలో చెరువుల కింద 15 లక్షల ఎకరాలకు సాగు నీరు అందింది.

సాగునీటి రంగంలో మూడేళ్లలో సాధించిన మరిన్ని విజయాలు

• ఎస్.ఆర్.ఎస్.పి. స్టేజ్ 2 పనులు పూర్తి చేయడం ద్వారా 4 లక్షల ఎకరాలకు సాగునీరు • నాగార్జున సాగర్ లో లెవల్ కెనాల్ పనులు పూర్తి చేయడం ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీరు • ఉదయ సముద్రం పనులు పూర్తి చేయడంతో లక్ష ఎకరాలకు సాగునీరు • దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేయడం ద్వారా లక్షా 50 వేల ఎకరాలకు సాగునీరు • శ్రీపాద సాగర్-ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడం ద్వారా 1.78 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు • కడెం పథకం కింద 30వేల ఎకరాలు, మంథని ఎత్తిపోతల పథకం కింద 7వేల ఎకరాలు స్థిరీకరణ. • లోయర్ పెన్ గంగ ద్వారా 37వేల ఎకరాలకు, చనాఖా-కొరాట బ్యారేజి నిర్మాణం ద్వారా 13,500 ఎకరాలకు సాగునీరు • సింగూరు ప్రాజెక్టు కాల్వల నిర్మాణం ద్వారా 40వేల ఎకరాలకు సాగునీరు • మధ్య తరహా నీటి పారుదల ప్రాజెక్టులైన నీల్వాయి, ర్యాలి వాగు, గొల్లవాగు, పెద్ద వాగు, కొమురంభీమ్, మత్తడి వాగు, గడ్డెన్న-సుద్దవాగు, కిన్నెరసాని కెనాల్, పాలెం వాగు, నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేయడం ద్వారా దాదాపు లక్షా 50వేల ఎకరాలకు సాగునీరు అందే పరిస్థితులు ఏర్పడినాయి.

కోటికి పైగా ఎకరాలకు నిరంతరం సాగునీరు-ఇక ఏ రైతు కంట పొంగదు కన్నీరు

జారీ చేయువారు: కమీషనర్ సమాచార, పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం



నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మొక్క జొన్న చేనులో నిలిచిన నీరు



నల్లగొండ జిల్లా పానగల్ సమీపంలోని దండేపల్లి వద్ద పత్తిచేలో వర్షపునీరు

లోకం తీరు



మెట్ట పంటలకు వర్షాలు అనుకూలం



రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు మెట్ట పంటలకు ఎంతగానో అనుకూలం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గత నెల 18 నుంచి సరైన వర్షాలు పడలేదు. దీనివల్ల పత్తి, కంది చేలు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురవకపోతే రైతులు ఎంతగానో నష్టపోయేవారు. మరో రెండు మూడు రోజుల వరకు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ చెబుతోంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఎకరాకు 25కిలోల యూరియా, పది కిలోల పొటాష్‌ను ఉపయోగించాలి.

-డాక్టర్ శంకర్, శాస్త్రవేత్త; కృషి విజ్ఞానకేంద్రం, త్రిపురారం

మరో 4 రోజులు వర్షాలే

హైదరాబాద్, సిటీ, విశాఖపట్నం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రైతుల ఆనందం రెట్టింపయ్యే కబురు. రాష్ట్రవ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షాలు.. గురువారం కూడా కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ డైరెక్టర్ వైకె రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రెండ్రోజులుగా ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా రాష్ట్రవ్యాప్తంగా పంటలకు తక్షణం అవసరమయ్యే విధంగా వర్షాలు కురిశాయని ఆయన చెప్పారు. రెండ్రోజుల్లో తక్కువ వర్షం పడిన ప్రాంతాలు.. ఓ మోస్తరు వర్షంతో కవర్ అవుతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మూడు రోజులుగా ఉత్తరాది నుంచి దక్షిణాదికి నైరుతి రుతుపవన ద్రోణి కదలడంతో తెలంగాణలో బలహీనంగా ఉన్న రుతుపవనాల్లో చురుకుదనం వచ్చింది. ఈ నేపథ్యంలో గురువారం కూడా ఇదే స్థాయిలో వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ అంచనా వేసింది. అల్పపీడన ద్రోణి ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా మరో నాలుగురోజులు వర్షాలు కురుస్తాయని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా రెండు రోజుల పాటు విస్తారంగా, మరో రెండు రోజులు అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు.

వాన కురిసె.. చేను మెరిసె!

సంతోషంతో తడిసి ముద్దయిన రైతన్న.. రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులుగా వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

నేల చూపులు చూసిన పంటలు తలెత్తి నిలబడ్డాయి! జీవం కోల్పోయి వడలిన మొక్కలు వాన నీటితో మళ్లీ నవనవలాడుతున్నాయి! నిరాశ చివరి క్షణంలో ఉన్నప్పుడు మళ్లీ ఆశ మోసులెత్తింది! అన్నదాతను వరుణుడు కరుణించాడు. కొన ఊపిరితో ఉన్న పంటలకు జీవం పోశాడు. రెండు రోజులుగా పడుతున్న వర్షాలు ఎండిపోయే దశలో ఉన్న పత్తి, మొక్కజొన్న, వరి, చెరకు, పసుపు తదితర పంటలకు జీవాన్ని ఇచ్చాయి. రైతన్నలు ఊపిరి పీల్చుకున్నారు. పత్తి పంట మొలకెత్తే కాండం బలపడే దశలో ఉండగా.. పసుపు మూడు ఆకుల దశలో ఉంది. మొక్క జొన్న జల్లు దశలో; వరినార్లు నాట్ల దశలో ఉన్నాయి. ఈ పైర్లన్నిటికీ 20 రోజులుగా నీరందని పరిస్థితి. పంటలను కాపాడుకోవడానికి కొంత మంది రైతులు అయితే బకెట్లు, మగ్గులతోనూ నీళ్ల పోశారు. మరో వారం రోజుల్లో పంటలను ఇక వదులుకోవాల్సిందేనని ఆందోళన చెందుతున్న సమయంలో రెండు రోజులుగా పడుతున్న





వర్షాలు ప్రాణాలను నిలబెట్టాయి. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దాంతో రైతులు మళ్లీ పొలం పనుల్లో బిజీ బిజీ అయ్యారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో 8.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నిన్నటి వరకూ నీటి చుక్క కోసం పరితపించిన పంటలు భారీ వర్షంతో నీటమునిగాయి. నిర్మల్ జిల్లాలో రెండు గంటలపాటు కురిసిన భారీ వర్షం పంటలకు ఊరట ఇచ్చింది. మహబూబాబాద్‌తోపాటు కురవి, బయ్యారం, గార్ల మండలాల్లో భారీగా, మిగిలిన మండలాల్లో మోస్తరుగా వర్షాలు పడ్డాయి. మున్నేరు వాగు చెక్ డ్యాంపై నుంచి నీరు ప్రవహిస్తోంది. ఖరీఫ్ సీజన్లో డ్యాంపై నుంచి వరద నీరు ప్రవహించడం ఇదే మొదటిసారి. ఇక, ఖమ్మం నగరంలో అత్యధికంగా 10.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైతే, జిల్లా అంతటా భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగడంతో పత్తి పంటల్లోకి భారీగా నీరు చేరింది. పలు చెరువులు నిండి అలుగు పారాయి. ముఖ్యంగా తేలికపాటి నేలల్లోని మొక్కజొన్నకు ఈ వర్షాలు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూర్చాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న తల వెన్ను, గింజపోసుకోవడం తదితర దశల్లో ఉందని, ఈ సమయంలో వర్షాలు పడకపోతే దిగుబడిపై తీవ్రంగా ప్రభావం చూపించి ఉండేదని వివరించారు. తేలికపాటి భూముల్లో వేసిన పత్తి పంటకూ ఈ వర్షాలు ఊపిరిని అందించాయి. మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గిపోయి.. గాలిలో తేమ పెరిగి పోవడంతో ఈ వాతావరణం ఇప్పటి వరకు ఎద్దడిని ఎదుర్కొంటున్న పంటలకు అనుకూలంగా మారిందంటున్నారు. హైదరాబాద్‌తోపాటు భువనగిరి జిల్లాల్లో ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు మూసీ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. దాంతో, బీబీనగర్, భూదాన్ పోచంపల్లి, ఘట్‌కేసర్, హయత్ నగర్ మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని పిలాయిపల్లి కత్వా వద్ద బైక్‌పై బ్రిడ్జి దాటుతున్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు గల్లంతయ్యారు.

ఇండియన్ మెట్రోలజీ శాఖ వివరాల ప్రకారం గడిచిన 24గంటల్లో కురిసిన వర్షపాత వివరాలు....

ప్రాంతం, జిల్లా	వర్షపాతం సెం.మీ.లలో
ఖమ్మం అర్బన్	9.4
మెదక్	6.5
గోల్కొండ, హైదరాబాద్	5.7
వెంకటాపూర్, వరంగల్	4.2
సరూర్‌నగర్, రంగారెడ్డి	4.2
నాగార్జునసాగర్, నల్గొండ	3.8
జూలపల్లి, కరీంనగర్	3.5
సుల్తానాబాద్, కరీంనగర్	3.3
పాలకుర్తి, వరంగల్	3.1
మానుకోట, వరంగల్	3
పేరూర్, ఖమ్మం	3
సంగారెడ్డి, మెదక్	2.9
పరకాల, వరంగల్	2.9
మాగనూరు, పాలమూరు	2.7
మక్తల్, మహబూబ్‌నగర్	2.6
పిట్లాం, నిజామాబాద్	2.6
జగిత్యాల, కరీంనగర్	2.5
నాగరెడ్డిపేట, నిజామాబాద్	2.4
గోవిందరావు పేట, వరంగల్	2.3
మంథని, కరీంనగర్	2.2
భువనగిరి, నల్గొండ	2.2
వికారాబాద్, రంగారెడ్డి	2.1
ధర్మసాగర్, వరంగల్	2.1
భూపాలపల్లి, వరంగల్	2
చెన్నూరు, ఆదిలాబాద్	2

వరిగోస
జూలైలో వర్షాభావం.. తగ్గిన సాగు విస్తీర్ణం

అన్ని పంటలను మురిపించిన వాన.. వరికి మాత్రం కాస్త ఆలస్యంగా పలకరించిందా? ఈ వానతో పైర్లకు పెద్దగా ఉపయోగం లేకుండాపోయిందా? గణాంకాలు అవుననే చెబుతున్నాయి. జూలైలో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. అయినా కొందరు సాహసించి తుకాలుపోసినా.. అవి ఇప్పటికే ముదిరిపోయాయి. సాధారణంగా ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 9.34 లక్షల హెక్టార్ల మేర వరిసాగు కావాల్సి ఉంటుంది. వ్యవసాయశాఖ నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఇప్పటివరకు 4.66 లక్షల హెక్టార్ల మేరకు వరినాట్లు పడ్డాయి. నిరుటి తరహాలో ఈ నెల చివర్లోగానీ, సెప్టెంబరు మొదటి వారంలోగానీ భారీ వర్షాలు పడితే.. చెరువులు, ప్రధాన జలాశయాల కింది నాట్లు పడతాయన్న ఆశాభావాన్ని వ్యవసాయశాఖ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

పత్తి సమృద్ధి
43.89 లక్షల ఎకరాలకు సాగు

రాష్ట్రంలో పత్తి రికార్డు స్థాయిలో సాగవుతోంది. బుధవారంనాటి వ్యవసాయశాఖ నివేదిక ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా రైతులు 43.89 లక్షల ఎకరాల్లో పత్తి వేశారు. పప్పుధాన్యాలు, మొక్కజొన్న, సోయాబీన్ పంటల సాగు నిరుటి కంటే తగ్గించి వేశారు. బుధవారంనాటికి 2.37 లక్షల హెక్టార్ల కంది సహా.. 3.52 లక్షల హెక్టార్ల మేరకు రైతులు పప్పుధాన్యాల పంటలను సాగు చేశారు. మొక్కజొన్న పంటను 4.44 లక్షల హెక్టార్లలో, సోయాబీన్ 1.61 లక్షల హెక్టార్లలో సాగుచేశారు. ఖరీఫ్ సీజన్‌లో సాధారణంగా 43.24 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతాయన్నది వ్యవసాయశాఖ అంచనా. బుధవారంనాటి నివేదిక ప్రకారం ఇంతవరకు రాష్ట్రంలో 38.05 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు.

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	21.5	30.5
హైదరాబాద్	21.8	24.8
నిజామాబాద్	23.6	28.1
సంగారెడ్డి	24.0	30.0
వరంగల్	24.0	29.0
మహబూబ్‌నగర్	24.5	27.4



రాత్రివేళల్లో అబ్బాయిలను ఇళ్లకే పరిమితం చేయాలి

పగటిపూట తిరిగితే లేని ప్రమాదం రాత్రి వేళల్లో తిరిగితే అమ్మాయిలకు ఎందుకు వస్తుంది? అసలు రాత్రివేళలల్లో అబ్బాయిలను ఇంటికే పరిమితం చేయాలి. బయట తిరగవద్దని అబ్బాయిలకు చెప్పాలి.

- పంజాబ్ బీజేపీ ఎమ్మెల్యే కిరణ్ ఖేర్



బీజేపీ క్విట్ ఇండియా.. ఇదే మా 2019 నినాదం

కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశాన్ని విభజించాలని చూస్తోంది. మేం దాన్ని జరగనివ్వం. 'బీజేపీ క్విట్ ఇండియా'.. 2019లో మా నినాదం ఇదే. ఇందుకోసం అన్ని ప్రతిపక్ష పార్టీలతో కలిసి పనిచేస్తాం. బీజేపీపై ఐక్యంగా పోరాటం చేస్తాం. మతతత్వ, విద్వేష రాజకీయాలకు చరమ గీతం పాడాలని మేం అనుకుంటున్నాం.

- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ. 70.73	పాత ధర 61.69
కొత్త ధర రూ. 70.89	కొత్త ధర 61.72
పెరుగుదల 3 పైసలు	పెరుగుదల 3 పైసలు

యాంటీబయోటిక్స్ నిరోధకత కోసం కొత్త పరీక్ష!



లండన్: ఇన్ఫెక్షన్ల చికిత్స కోసం ఉపయోగించే యాంటిబయోటిక్స్ నిరోధకతకు కారణమయ్యేవాటిని గుర్తించేందుకు కొత్త పరీక్షను కనుగొన్నారు స్వీడన్‌లోని ఉప్సల యూనివర్సిటీ పరిశోధకులు. ముఖ్యంగా యూరినరీ ఇన్ఫెక్షన్, బ్లడ్ ఇన్ఫెక్షన్ల కోసం ఇచ్చే యాంటీబయోటిక్స్ నిరోధకతను కనుగొనడంలో ఈ పరీక్ష సమర్థంగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. యాంటీబయోటిక్స్ సమక్షంలో కూడా పెరుగుతున్న బాక్టీరియాను ఈ పరీక్ష ద్వారా 10 నుంచి 30 నిమిషాల్లో గుర్తించవచ్చని తెలిపారు.

రొమ్ము కేన్సర్ చికిత్సకు కొత్త ఔషధం!



హ్యూస్టన్: మహిళల్లో రొమ్ము కేన్సర్‌ను నిరోధించే కొత్త అణువును కనుగొన్నారు టెక్సాస్ యూనివర్సిటీ పరిశోధకులు. ఈ పరిశోధక బృందంలో భారత సంతతికి చెందిన గణేష్ రాజ్ కూడా ఉన్నారు. ఇప్పటివరకు రొమ్ము కేన్సర్ చికిత్సకు హార్మోన్ థెరపీ వంటి సాంప్రదాయ పద్ధతులను మాత్రమే ఉపయోగిస్తున్నారు. వాటికి కూడా లొంగని రొమ్ము కేన్సర్ కణాలను ఈ కొత్త అణువును కలిగిన 'ఈఆర్ఎక్స్-11' ద్వారా తొలగించవచ్చని గణేష్ తెలిపారు. ఈస్ట్రోజన్ గ్రాహక కేన్సర్ కణాలను ఈ అణువు టార్గెట్ చేస్తుందని చెప్పారు. ఈ ఔషధాన్ని ఎలుకలపై ప్రయోగించామని తెలిపారు.



ట్యాగులు తీస్తే బీమా ఖతం

- మానుకోట కలెక్టర్ ప్రీతిమీనా

సర్కారీ గొర్రెలను అమ్మకూడదని, కొనకూడదని మానుకోట కలెక్టర్ ప్రీతీ మీనా చెప్పారు. మహబూబాబాద్ కురవి మండలం బలపాలలో గొర్రెల చెవులకు వేసిన ట్యాగులను పరిశీలించారు. ట్యాగులు తీస్తే బీమా సదుపాయం వర్తించదని చెప్పారు.

- ఆంధ్రజ్యోతి, మహబూబాబాద్



చోటా భీమ్

- 4.5 కిలోల బరువుతో జన్మించిన బిడ్డ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బుధవారం 4.5కిలోల బరువు గల మగబిడ్డకు ఓ తల్లి జన్మనిచ్చింది. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా వేలేరుపాడుకు చెందిన వీరమల్లు మాధవికి నొప్పులు రావడంతో ఆమె భర్త అశ్వారావుపేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. సాధారణ పురుడు రావడం కష్టమవడంతో సిజేరియన్ చేశారు. *- అశ్వారావుపేట*

స్వాతంత్ర్య సమరయోధులకు రాష్ట్రపతి సన్మానం

- తెలంగాణకు చెందిన 9 మందికి దక్కిన గౌరవం

న్యూఢిల్లీ, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న సమరయోధులను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఘనంగా సన్మానించారు. క్విట్ ఇండియా 75వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రాష్ట్రపతి భవన్‌లో 'ఎట్ హోం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా పలువురు స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం చేశారు. ఈ వేడుకలో తెలంగాణలోని 9 మందికి గౌరవం దక్కింది. సన్మానం పొందిన వారిలో కరీంనగర్ జిల్లాకు చెందిన ఎర్రవెల్లి రంగారావు, పణగంటి రామానుజం, అంజిరీక రాజలింగయ్య, వరంగల్ జిల్లాల నుంచి బొంమినేని శ్రీనివాస్‌రెడ్డి, కొమురయ్య, కోడిపాక సక్కుబాయి, బలేరావు కృష్ణరావు, ఖమ్మం జిల్లా వేములపల్లి నారాయణ, జనగామ నుంచి మహాకల బాలపాపాయిరెడ్డి ఉన్నారు.



సన్మానం పొందిన తెలంగాణ ప్రాంత సమరయోధులు

'మర్రిగూడ'పై స్పందించిన కలెక్టర్

- నీటి నమూనాలు సేకరించాలని ఆదేశం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ: ఫ్లోరైడ్ ప్రాంతమైన మర్రిగూడ మండలంలో ఆర్వో, బోరు నీళ్లు, కృష్ణా నది నీటిని పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ గౌరవ్‌ఉప్పల్ ఆదేశించారు. 'వీడని ఫ్లోరోసిస్ శాపం' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. క్యాంపు కార్యాలయంలో జిల్లా ఫ్లోరైడ్ మానిటరింగ్ కమిటీతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉంటే వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. ఆహార ధాన్యాలు, కాయగూరలను సైతం హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు పంపించాలని సూచించారు.పోషకాహారం అందించే చర్యల్లో భాగంగా ప్రతి ఇంటికి కోడి పిల్లలను ఇవ్వాలని పేర్కొన్నారు.

వెంటాడి వేధించి.. బాలిక గొంతుకోసి..

చదువుల తల్లిని పొట్టనబెట్టుకున్న పోకిరీలు.. యూపీలో దారుణం..



లఖ్‌నవ్, ఆగస్టు 8: పెద్దచదువులు చదివి తల్లిదండ్రులకు మంచి పేరుతెచ్చిపెట్టాలనేది ఆ బాలిక (17) లక్ష్యం. ఆర్నెల్లుగా పోకిరీల వేధింపులు.. ఆమె బలీయమైన ఆకాంక్షను ఏమాత్రం తొక్కిపెట్టలేకపోయాయి. ఆ నలుగురు నిత్యం వెంటాడి వేధిస్తున్నా ఆమె మాత్రం స్కూల్‌కు వెళ్లడం మాత్రం మానేయలేదు. అయితే, తమ మాట వినడం లేదని ఆగ్రహించిన ఆ పోకిరీలు.. సైకిల్‌పై స్కూల్‌కు వెళుతున్న ఆమెను అడ్డగించి, పదునైన కత్తితో గొంతుకోసి కిరాతకంగా హత్యచేశారు.యూపీలోని బలియా జిల్లాలో జరిగిందీ ఘోరం. నలుగురు నిందితుల్లో ప్రిన్స్ తివారి (22) అనే వ్యక్తి గ్రామపెద్ద కుమారుడు కావడం గమనార్హం. తివారిని అరెస్టు చేసిన పోలీసులు.. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు. కూతురిని వేధిస్తున్న విషయాన్ని గ్రామపెద్దకు తెలిపినా పట్టించుకోలేదని హతురాలి తల్లి కన్నీటి పర్యంతమైంది. తమ కూతురు ఇంట్లో ఉంటే.. పోకిరీలు ఎదురుగా ఉన్న చేతిపంపు వద్ద కూర్చొని అసభ్యవ్యాఖ్యలు చేసేవారని.. స్కూలుకు వెళితే వెంటాడి వేధించేవారని వాపోయింది.



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం 10-8-2017



వాన కురిసె..
చేను మెరిసె!
సంతోషంలో తడిసి ముద్దయిన రైతన్న



పట్టెడన్నమైన పుడుతుందా..? కాడెడ్లకు పిడికెడు మేతైనా దక్కుతుందా?.. పంటలుంటాయా.. మొదటికే మోసం వస్తుందా? ఇరవై రోజులుగా ఉక్కిరిబిక్కిరై ఆకాశం వైపు ఆరాటంతో చూస్తున్న అన్నదాత వేదనలను విన్నదేమో.. మేఘాల తల్లి హృదయం కరిగి నీరై వర్షించింది! చిన్నారికి తల్లి కడుపునిండా పాలిచ్చినట్టు.. తలుపుతట్టిన వారి ఆకలిని తీర్చినట్టు తనివితీరా వాన కురిసింది.. చేను మెరిసింది.. రైతన్న మనసు మురిసింది!! వాడువట్టిన మెట్ట పంట కొత్త ఊపిరి పీల్చుకుంది. నిన్నటిదాకా వేసవి మాదిరి ఎండలతో సెగలు గక్కుతున్న.. చిటపట చినుకులకు భూమితల్లి చల్లబారింది! తడిసిన మట్టివాసనలు రైతుకు, పంటకు ఢోకా లేదని సందేశం ఇచ్చాయి. మోడువారిన 'హరిత' మొక్కలకూ ప్రాణం లేచొచ్చింది. తొలకరిలో తొంగిచూసి మొహం చాటేసిన వర్షం.. మరోసారి తెలంగాణ నేలతల్లిని పరవశింపజేసింది. జల్లుల సవ్వడులు రాష్ట్రమంతటా గలగలా వినిపించాయి.

2

నేడూ వాన
హిమాలయాలను దాటి వచ్చిన ద్రోణి

చురుగ్గా రుతుపవనాలు

మరో 4 రోజుల పాటు వర్షాలు

మెట్ట పంటలకు కొత్త ఊపిరి

గోదారి రివర్స్
దిగువ నుంచి ఎగువకు ప్రవహించేలా కొత్త నడక
కేసీఆర్ భగీరథ యత్నం.. ఎత్తిపోతలకు నేడే శ్రీకారం
శ్రీరాంసాగర్‌కు పునరుజ్జీవం.. 53 ఏళ్లకు సర్కారు దృష్టి



శ్రీరాంసాగర్ రిజర్వాయర్; సీఎం బహిరంగ సభకు స్వాగత ఏర్పాట్లు; సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న వేణుగోపాలాచారి

ఎఫ్ఎఫ్‌సీపై మూడు లిఫ్టులకు నేడు శంకుస్థాపన

బుధవారమే పోచంపాడ్ చేరుకున్న ముఖ్యమంత్రి

ఎగువ నుంచి దిగువకు.. దిగువ నుంచి ఎగువకు

ద్విముఖ గోదావరి.. తెలంగాణలో కొత్త నడకలు

14 లక్షల ఎకరాల్లో 2 పంటలకూ నీళ్లు

పునరుజ్జీవన సభకు భారీ ఎత్తున ఏర్పాట్లు

కాల్వలకూ పునరుజ్జీవం
నవీకరణకు 863 కోట్లు విడుదల

నీరు పల్లమెరుగు అని సామెత.. దీన్నిక నీరు మెరకనూ ఎరుగు అని మార్చుకోవాలేమో! మహారాష్ట్ర నుంచి దిగువన తెలంగాణకు దిగి వచ్చే గోదావరి నది కొత్త నడకలు నేర్వనుంది. మేడిగడ్డ నుంచి ఎగువన శ్రీరాంసాగర్‌కు ఎక్కి రానుంది. నదిలో సహజ ప్రవాహం తగ్గిపోవడంతో తరచూ వట్టిబోతున్న ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్‌కు పూర్వ వైభవం తేనుంది.

హైదరాబాద్/నిజామాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు మళ్లీ జలకళ సంతరించుకోనుంది. సాధారణంగా పైన భారీ వర్షాలు కురిసినప్పుడు ఎగువ నుంచి దిగువకు గోదావరి నీళ్లు వచ్చి శ్రీరాంసాగర్ నిండుతుంది. అయితే వర్షాభావం, మహారాష్ట్ర కట్టిన ప్రాజెక్టుల వల్ల ఎగువ నుంచి నీటిచుక్క రానప్పుడు... దిగువన పారే ఉపనదుల జలాలు ఇక ఎగువకు వెల్లువెత్తనున్నాయి. ఎత్తిపోతల పథకాలతో తెలంగాణ ప్రాజెక్టుల్ని రీడిజైన్ చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ గోదావరికి ద్విముఖ గమనం నేర్పే సాహసం చేస్తున్నారు. ఇది సాకారమైతే... కొన్నేళ్లుగా పడావు పడిన భూములు రాబోయే రోజుల్లో కొత్త శోభను

మిగతా 11వ పేజీలో...

డయాగ్నస్టిక్ సెంటర్లలోనూ
సీటీ స్కాన్, ఎమ్మార్ఐ
ఉద్యోగులకు వెసులుబాటు

త్వరలో మరిన్ని వెల్‌నెస్ సెంటర్లు

6

మా ఓటు బ్యాంకు
పెరిగింది
తాజా సర్వేలో వెల్లడయింది

ప్రస్తుతం 7-8 శాతం పెరుగుదల

2019లో కాంగ్రెస్ విజయం తథ్యం

ఉత్తమ్ కుమార్‌రెడ్డి వ్యాఖ్యలు

6

కేసీఆర్ సింహంలాంటోడు
హరీశ్‌కన్నా, నాకన్నా ఆరోగ్యంగా ఉన్నారు
మరో పదేళ్లపాటు ఆయనే సీఎం: కేటీఆర్

ప్రతిపక్షాలన్నీ కలిసినా మమ్మల్ని ఓడించలేవు

నేరెళ్ల ఘటనలో దళిత కోణం లేదు!

పోలీసులదే తప్పని తేలితే బాధ్యులపై చర్యలు

నా కొడుకుపైనా విమర్శలు బాధాకరం

రాజకీయాల్లోకి ఎందుకొచ్చానని బాధపడ్డాను

ట్రాక్టర్ల స్టాక్‌యార్డ్ వ్యాపారం ఉన్నది నిజమే

కానీ ప్రస్తుతం కార్యకలాపాలు జరగడం లేదు

హరీశ్‌బావతో విభేదాలు లేనే లేవు: మంత్రి



హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కేసీఆర్ సింహంలాంటోడని, ఆయన మరో పదేళ్లు సీఎంగా ఉంటారని మంత్రి కె.తారకరామారావు అన్నారు. హరీశ్‌కన్నా, తన కన్నా కూడా కేసీఆర్ ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. ప్రతిపక్షాలు తన కొడుకుపై కూడా విమర్శలు చేస్తున్నాయని, ఇలాంటివి చూస్తుంటే ఒక్కోసారి రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానన్న బాధ

మిగతా 6వ పేజీలో...

పటేల్ విజయం

రాజ్యసభ ఎన్నిక ఇంత ఉత్కంఠగా ఎప్పుడూ లేదు. ఈ తరహా వాతావరణం దేశం అరుదుగా చూసి ఉంటుంది. కేవలం ఒక స్థానం కోసం ఎన్నో కుట్రలు, వెన్నుపోట్లను ప్రజలు చూశారు. ఇది కేవలం ఒక సీటుకోసం రెండు రాజకీయపక్షాల మధ్య జరిగిన పోటీ కాదు. ఇద్దరు వ్యక్తుల మధ్య వ్యక్తిగత వైరం. రెండు రాజకీయపక్షాల పరువుప్రతిష్ఠలతో ముడిపడిన యుద్ధం. బీజేపీ అధ్యక్షుడిగా మూడేళ్లకాలాన్ని ముగించుకున్న నాడే అమిత్‌షా రాజ్యసభ సభ్యుడయ్యారు. ఆ సంతోషం కంటే అహ్మద్‌పటేల్ విజయం ఆయనను ఎక్కువ బాధించి వుంటుంది. ఈ మహత్తర ఘట్టాన్ని దీర్ఘకాలంగా చూస్తున్న ప్రజలకు ఈ ఎన్నికలో అంతిమ ఫలితమూ ఒక్కటే. నిస్సిగ్గుగా, కేంద్రమెల్లగా వ్యవహరిస్తుందని అనుకుంటున్న ఎన్నికల సంఘం ఇంతటి ఉద్రిక్తమైన వాతావరణంలోనూ, ఇంతటి ఒత్తిడిలోనూ నిటారుగా నిలబడి నిబంధనలను అనుసరించి వ్యవహరించడం. రాజకీయపక్షాలు ప్రజాస్వామ్యాన్ని ఇంతగా దిగజార్చేసిన స్థితిలోనూ ఎన్నికల సంఘం నిర్వహించిన పాత్ర ప్రశంసించదగ్గది.

ఈ ఎన్నిక కాంగ్రెస్‌కు కచ్చితంగా కొత్త ఊపిరినిచ్చింది. అమిత్‌షా దూకుడుకు కళ్లెం వేస్తుందన్న ఆశలు కూడా విపక్షాల్లో కల్పించింది. విపక్ష నాయకులందరూ కట్టకట్టుకొని అహ్మద్‌పటేల్‌ను అభినందనలు తెలియచేయడం చూసినప్పుడు, ఈ ఎన్నిక వారికి ఎంత ఆక్సిజన్ అందించిందో అర్థం చేసుకోవచ్చు. కానీ, ఈ విజయం తన సంస్థాగత బలం వల్లనో, ఎత్తులకు పై ఎత్తులు వేసినందువల్లనో కాక, కేవలం సాంకేతిక కారణాలవల్లే తనకు దక్కిందని కాంగ్రెస్‌కు కూడా తెలుసు. ఎనిమిది మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలలో ఇద్దరు చేసిన పొరపాటు ఆ పార్టీని గట్టెక్కించింది. తమ బ్యాలెట్ పత్రాన్ని పార్టీ ఏజెంటుకు తప్ప మరెవ్వరికీ చూపించకూడదన్న జ్ఞానం వారికి లేకపోయింది. ఎమ్మెల్యేలలో తిరుగుబాటుతనాన్ని రేకెత్తించిన పార్టీకి ఈ ముక్క చెప్పాలన్న ఆలోచన రాలేదు. మీ రుణం తీర్చుకున్నాం చూడండి అంటూ అమిత్‌షాకు వారు సాక్ష్యం చూపించడంతో అంతవరకూ వేసిన ఎత్తులు, జిత్తులు చివరలో కొరగాకుండా పోయాయి. ఆశలు వదిలేసిన కాంగ్రెస్‌కు ఈ తప్పిదం ఎక్కడ లేని ఊపిరినిచ్చింది. గుజరాత్‌లో రిటర్నింగ్ అధికారి ఉద్దేశపూర్వకంగానో, అవగాహనలేకనో అధికారపక్షం వైపే నిలిచారు. కానీ, వ్యవహారం ఢిల్లీకి చేరడంతో కథ కాంగ్రెస్ పక్షాన సుఖాంతమైంది. ఈ దశలో సుమారు 8 గంటలపాటు ఎన్నికలసంఘం ఎంత ఒత్తిడిని ఎదుర్కొన్నదో అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్ యోధానుయోధులు, బీజేపీ మహా మంత్రులు దానిచుట్టూ మోహరించి, ఒకటికి రెండు సార్లు భేటీలు వేసి తమ పక్షాన నిర్ణయం వెలువరించాలంటూ తీవ్రంగా వాదించారు. రిటర్నింగ్ అధికారి నిర్ణయమే అంతిమం అంటూ బీజేపీ సాక్ష్యాలు చూపించింది. ఇటువంటి సందర్భాల్లో ఎన్నికల సంఘం కర్తవ్యం ఏమిటో కాంగ్రెస్ విప్పిచెప్పింది. వీడియోలు, నిబంధనలు తరచిచూసిన తరువాత ఏమాత్రం ఒత్తిళ్లకు లొంగకుండా నిబంధనలకు అనుగుణంగానే ఎన్నికల సంఘం నిర్ణయం చేయడం కాంగ్రెస్ పోతున్న ప్రాణాన్ని కాపాడింది. ఇంతటి ఉద్రిక్తవాతావరణంలో, అధికారపక్షం నుంచి తీవ్రమైన ఒత్తిడి వున్న స్థితిలోనూ ఎన్నికల సంఘం ఎవరికీ వెరవకుండా ఈ నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యంతో పాటు సంతోషాన్నీ కూడా కలుగచేస్తుంది.

అహ్మద్‌పటేల్ విజయం అనూహ్యమైనదే కావచ్చును కానీ, ఆ పార్టీకి వ్యతిరేకంగా బీజేపీ ఎటువంటి కుట్రలూ చేయని పక్షంలో అది సునాయాసంగా దక్కవలసినదే. పటేల్ రాకను అడ్డగించడానికి నెలన్నరగా గుజరాత్‌లో బీజేపీ పన్నిన వ్యూహాలు సమీపగతంలో ఎన్నడూ చూడనివి. రెండు రాజకీయపక్షాల మధ్య ఒక సీటుకోసం జరుగుతున్న పోరాటంగా కాక, వ్యక్తిగత ద్వేషంతో బీజేపీ ఈ ఎన్నికను అమిత్‌షా అద్దుకొనే ప్రయత్నం చేసినట్టు కనిపించింది. సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో తనను జైలుకు పంపడంలో పటేల్ పాత్ర ఉన్నదని అమిత్‌షా విశ్వసిస్తున్నట్టు కథనాలు కూడా వచ్చాయి. తమ మధ్య వ్యక్తిగత ద్వేషాలున్నాయని పటేల్ కూడా ప్రకటించారు. వారిద్దరి మధ్య ఎన్ని గొడవలున్నా దేశానికి వచ్చే నష్టమేమీ లేదు కానీ, కక్షలు తీర్చుకోవడానికి ప్రజాస్వామ్య విలువలన్నింటినీ బలి చేయడమూ, సర్వవ్యవస్థలను ఆయుధాలుగా వాడటమే విషాదం. 57 మంది ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్‌కు పటేల్‌ను గెలిపించుకోవడం అత్యంత సులభం. కానీ, నెలన్నర క్రితం కాంగ్రెస్‌లో ప్రారంభమైన అనర్హతవేటు, విపక్ష కాంగ్రెస్ నాయకుడు శంకర్‌సిన్హ్ వాఘేలాను కాంగ్రెస్ నుంచి లాగడంతో పటేల్ రాకను నిలువరించే ప్రయత్నం ఆరంభమైంది. ఆయనకు పోటీగా వాఘేలా బంధువును నిలబెట్టి, ఆరుగురు ఎమ్మెల్యేలను తిరుగుబాటుతో జగన్నాటకం మొదలైంది. ఆ గత్యంతరం లేని స్థితిలో కాంగ్రెస్ మిగతా 44 మంది ఎమ్మెల్యేలను ఒక రిసార్టుకు తరలించవలసి వచ్చింది. కర్ణాటక మంత్రి శివకుమార్ స్వాధీనంలోవున్న ఈ రిసార్టు పైనా ఐటీ అధికారులు విరుచుకుపడటం ఎమ్మెల్యేలను భయపెట్టి బయటకు తీయడానికేనన్నది నిర్వివాదాంశం. ఆ తరువాత 'నోటా' ప్రతిపాదన కాంగ్రెస్‌ను కుదిపేసింది. నోటాకు సుప్రీంకోర్టు నో చెబుతుందన్న ఆశ కూడా పోయింది. ఇంతటి వేట నేపథ్యంలో పటేల్ విజయం ఏ విధంగా దక్కినదైనా ప్రజాస్వామ్య ప్రియులకు సంతోషం కలిగించేదే. బుధవారం కాంగ్రెస్ 14 మంది ఎమ్మెల్యేలను పార్టీనుంచి సస్పెండ్ చేయడం చూసినప్పుడు బీజేపీ ఎంత బలంగా దానిని దెబ్బ తీసిందో ఊహించవచ్చు. గోవా, అరుణాచల్‌ప్రదేశ్, బీహార్, తమిళనాడు, ఇప్పుడు గుజరాత్‌లో బీజేపీ నెరపుతున్న రాజకీయాన్ని చూసినప్పుడు అధికారం కోసం అది సర్వవ్యవస్థలను భ్రష్టుపట్టించడానికి, ప్రతిపక్ష వ్యవస్థలను దుర్వినియోగం చేయడానికి ఏమాత్రం వెనుకాడుతుండటం లేదని అర్థమవుతోంది. పటేల్ విజయం కాంగ్రెస్‌కు ఊపిరినిచ్చింది, దానికి పోరాటశక్తి ఉన్న గుర్తింపును కూడా ఇచ్చింది. ఈ ఏడాది చివర్లో జరిగే గుజరాత్ ఎన్నికల్లో ఈ విజయం ప్రభావం ఎంతో కొంత ఉండవచ్చును కానీ, అమిత్‌షా మీద ఓటమి ప్రభావం స్వల్పకాలం మాత్రమేనని కాంగ్రెస్ గుర్తుపెట్టుకోవాలి. వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ మూడుస్థానాలు గెలవాలంటే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో 182 స్థానాలకు గాను 150 గెలవాలి అంటూ బుధవారం ఆయన తన వీడ్కోలు సమావేశంలో రాష్ట్ర పార్టీ నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు. వాఘేలా లోటును పూడ్చి స్థానిక నాయకత్వాన్ని బలోపేతం చేసినప్పుడే కాంగ్రెస్ విజయం పరిపూర్ణమవుతుంది.

ఉద్యోగుల విభజనకై చట్ట సవరణ

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి మూడేళ్లు దాటిపోయింది. దశాబ్దాల ఉద్యమాలు త్యాగాల ఫలితంగా కోట్లాది గొంతుకలు ఏకమై కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించాయి. టీఆర్ఎస్ సాధించి రాజకీయ ప్రక్రియ ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత ఖచ్చితంగా కేసీఆర్‌దే దక్కుతుంది.

ఎన్నో లాబీలు, కుట్రలు, కుతంత్రాలు ఛేదించుకున్న నూతన రాష్ట్రం తెలంగాణను ఒక విఫల ప్రయోగంగా చేయాలనుకున్న వారికి సమాధానంగా పరిపాలన మానవతా విలువలు ఆపాదిస్తూ మంచి ప్రభుత్వంగా కేసీఆర్ ప్రభుత్వం పేరు తెచ్చుకొంటుంది. వివిధ వర్గాల నుండి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు పెరుగుతున్నది. ఇది ఖచ్చితంగా అభినందించాల్సిన విషయమే. కానీ మూడేళ్ల పరిపాలన పూర్తైన సందర్భంగా కొన్ని ఆవశ్యక మౌలిక స్వరూప కేంద్రంలో ఇంకా చర్చించాల్సిన అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అందులో అతి ముఖ్యమైన అంశం 'ఉద్యోగుల విభజన'. తెలుగు రాష్ట్రాలు విడిపోవడానికి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడటానికి 'ఉద్యోగాల నియామకాలు' అతి ముఖ్యమైన కారణమనేది ఎవరూ కాదనలేని విషయం.

తెలంగాణ రాష్ట్రం కోసం తెలంగాణ ఉద్యోగులు, సమైక్య రాష్ట్రం కోసం సీమాంధ్ర ఉద్యోగులు ఏ స్థాయిలో ఉద్యమాలు చేసారో అందరికీ తెలిసిందే. ఉద్యోగ నియామకాల్లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగింది. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలన్న నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘించి, పెద్ద మనుషుల ఒప్పందం, ముల్కీ రూల్స్ అన్నింటినీ తుంగలో తొక్కి మరీ ఉద్యోగాల నియామకాలు జరిగాయి. తెలంగాణ ప్రాంతంలో విద్యా సంస్థల్లో సీట్లలో కూడా తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరిగింది. ఉద్యోగుల ప్రమోషన్లలో, పోస్టింగ్‌లలో కూడా తీరని అన్యాయం జరిగింది. 1956 నుంచి మొదలుకొని రాష్ట్రం ఏర్పడేంత వరకూ ఉద్యోగ నియామకాల్లో తెలంగాణ భూమిపుత్రులకు తీరని అన్యాయం జరిగిందనేది ఎవరూ కాదనలేని వాస్తవం.

1985 డిసెంబర్‌లో ఎన్‌టీఆర్ ప్రభుత్వం ఇచ్చిన 610 జీవో అమలుకు నోచుకోలేదు. కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని స్థాపించే క్రమంలో 2001 ఏప్రిల్‌లో తన గృహప్రవేశం సందర్భంగా తెలంగాణ ఉద్యమానికి నాందిగా 610 జీవో ప్రస్తావించే వరకు ఆ జీవో సంగతి అమలును ప్రభుత్వాలు మర్చిపోయాయి. మలిదశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఊపందుకునే సరికి 610 జీవో గిర్‌గ్లానీ కమిషన్, ఆ తదుపరి రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన శాసనసభా పక్షం ఏర్పాటు చేసినా, వారు ప్రతిపాదించిన అంశాలు, చేసిన సిఫార్సులు ఏవీ అమలుకు నోచుకోలేదు. లక్షలాది ఉద్యోగాల్లో ఏండ్ల తరబడి తెలంగాణకు అన్యాయం జరుగుతూనే ఉన్నది. జరిగిన, జరుగుతున్న అన్యాయాలపై, వివక్షపై తెలంగాణ ఉద్యోగులు, నిరుద్యోగులు, యువకులు, విద్యార్థులు నిరంతరం ప్రశ్నిస్తూనే ఉన్నారు. ఐనా సమైక్యరాష్ట్రంలో వారి గోడును పట్టించుకున్న నాథుడే లేకపోయారు. పార్లమెంట్ విభజన చట్టం ప్రకారం అస్తులు, అప్పులు, 48:52 శాతం విభజన జరగాలన్న సూత్రం ఉద్యోగుల విషయంలో కూడా పాటించాలని సూచించారు. ఈ సూత్రం తెలంగాణకు గొడ్డలిపెట్టు. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 14 లక్షల మంది ఉద్యోగులు ఉంటే ఉద్యోగుల విభజన విషయంలో నియమించిన కమలనాథన్ కమిటీ పరిధి కేవలం సచివాలయం, ప్రభుత్వ కమిషనరేట్లు, డైరెక్టరేట్లకు మాత్రమే పరిమితం. కేవలం 56వేల మంది ఉద్యోగుల విభజనకు పరిమితమైన కమిటీ మూడేళ్ళలో 15 వేల మంది ఉద్యోగుల విభజన చేసి చేతులు దులుపుకొంది. అందులో ఆంధ్రకు కేటాయించినవారు అక్కడికి వెళ్ళకుండా కోర్టు నుంచి స్టేలు తీసుకురావడం, తెలంగాణలోనే కొనసాగడం జరుగుతోంది. కమలనాథన్ కమిటీ కేటాయించిన ఉద్యోగులను కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేర్చుకోకుండా వెనక్కి తిరిగి పంపిన వైనం బాధాకరమైన విషయం. ఉద్యోగుల విభజన విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తోంటే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఈ అంశం భవిష్యత్తులో ఇరు రాష్ట్రాల ఉద్యోగుల మధ్య మరిన్ని విభేదాలు సృష్టించే అవకాశం ఉంది. 13–14 లక్షల మంది ఉద్యోగుల్లో 52 వేల మందికి విభజన పరిమితమై, అందులో 15 వేల మంది విభజన జరిగి అందులో మూడువేల మంది కోర్టులను ఆశ్రయిస్తే, రాష్ట్రాలు ఏర్పడి మూడేళ్ళు అయినా ఇంకా ప్రక్రియ కొనసాగడం భావ్యం కాని విషయం. ముల్కీ రూల్స్, పెద్దమనుషుల ఒప్పందాలు ఉల్లంఘించి తెలంగాణ జిల్లాల్లో నియమింపబడ్డ ఆంధ్ర ఉద్యోగులు ఇంకా కొనసాగుతుంటే పబ్లిక్ సెక్టార్‌లలో వివిధ ప్రభుత్వ విభాగాలలో ఇంకా ఆంధ్ర ఉద్యోగులు ఆధిపత్యం కొనసాగుతుంటే తెచ్చుకొన్న తెలంగాణకు అర్థం ఏముంది? ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగ – నిరుద్యోగుల కడుపులు మండిపోతున్నాయి. ఇది ఒక వైపు ఇలా ఉంటే ఆంధ్రకు కేటాయించిన తెలంగాణ ఉద్యోగులను వెంటనే వెనక్కి తీసుకురావాలనే డిమాండ్ తప్ప తెలంగాణలో కొనసాగుతున్న ఆంధ్ర ఉద్యోగులను వెనక్కి తీసుకురావాలనే డిమాండ్ ఒక్కటీ మూడేళ్ళలో వినిపించలేదు. పార్లమెంట్ చట్టం అడ్డంపెట్టుకొని వేలాది, లక్షలాది ఉద్యోగులు తెలంగాణలో కొనసాగడం కరెక్టు కాదు. తెలంగాణ ప్రభుత్వం దీనిపై పార్లమెంట్ చట్టం సవరణకు డిమాండ్ చేయాలి.

ఆంధ్రకు కేటాయించిన తెలంగాణ ఉద్యోగులను వెంటనే వెనక్కి తీసుకురావాలనే డిమాండ్ తప్ప తెలంగాణలో కొనసాగుతున్న ఆంధ్ర ఉద్యోగులను వెనక్కి తీసుకురావాలనే డిమాండ్ ఒక్కటీ మూడేళ్ళలో వినిపించలేదు. పార్లమెంట్ చట్టాన్ని అడ్డం పెట్టుకొని వేలాది ఉద్యోగులు తెలంగాణలో కొనసాగడం కరెక్టు కాదు. తెలంగాణ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి పార్లమెంట్ చట్టం సవరణకు డిమాండ్ చేయాలి.

పోలవరం కొరకు ఏడు మండలాలను కలపడానికి, సీలేరు ప్రాజెక్టును ఆంధ్రకు కేటాయించడానికి ఎలాగైతే పార్లమెంట్ చట్టం సవరణ జరిగిందో అదే విధంగా ఉద్యోగుల విభజన విషయంలో కూడా పార్లమెంట్ చట్టం సవరించాలి. క్యాడర్ స్ట్రెంత్, వర్కింగ్ స్ట్రెంత్ విభజన కాకుండా ఆంధ్ర ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణ ఉద్యోగులు తెలంగాణలో పనిచేసే విధంగా నిబంధనలు పెట్టి ఏకకాలంలో ఉద్యోగుల విభజన పూర్తిచేయాలి. పార్లమెంట్‌లో చట్టాన్ని వెంటనే సవరించాలి

■ సురేష్ కాలేరు

రాష్ట్ర సహాధ్యక్షులు, తెలంగాణ ఉద్యోగుల సంఘం

రైతు దాకా చేరని భూసంస్కరణలు

తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చీరాగానే భూపరిపాలనపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించింది. అందులో భాగంగానే దళితులకు మూడు ఎకరాల భూమి పంపిణీ చేయడం; రెవెన్యూ చట్టాలను సమీక్షించి, సాదాబైనామా ద్వారా పేదలు కొనుగోలుచేసిన భూములను క్రమబద్ధీకరించడం; మిషన్ కాకతీయ ద్వారా బీడు భూములను పంట భూములుగా మార్చడం; పంట పెట్టుబడి సహాయం క్రింద ఎకరాకు కొంతమొత్తాన్ని రైతులకు అందించటం వంటి ప్రభుత్వ నిర్ణయాలు రైతుల సంక్షేమ దృష్ట్యా హర్షించదగ్గ పరిణామమే. కానీ దీనికి భిన్నంగా గ్రామీణ రైతు సమాజం భూమికి సంబంధించిన సమస్యలను, చిక్కులను పరిష్కరించుకోలేక పోతున్నది. గత రెండు దశాబ్దాలుగా, భూమిని నమ్ముకున్న రైతులపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూమి రికార్డుల ఆధునికీకరణ చేపట్టాయి. భూమి రికార్డులను కంప్యూటరీకరణ చేయడానికి కోట్లాది రూపాయలను ఖర్చు పెడుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ భూమి రికార్డుల ఆధునికీకరణ కొరకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్యంగా ఈ విభాగం రెవెన్యూ పాలనలో పారదర్శకత తీసుకురావడం, సత్వర సేవలు అందించటం లక్ష్యంగా పని చేస్తుంది.

రెండు దశాబ్దాలు గడుస్తున్నా భూమి రికార్డుల కంప్యూటరీకరణ ఒక కొలిక్కి రావటం లేదు. భూమి విపరీతమైన వాణిజ్యపరమైన డిమాండ్ సంతరించుకోవడం, అదేవిధంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరు మీద వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రభుత్వమే స్వయానా భూమిని సేకరించడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం, జనాభా పెరుగుదల మొదలైన అంశాలన్నీ భూపరిపాలన సాఫీగా సాగక పోవడానికి కారణాలు అవుతున్నాయి. భూపరిపాలన అనేది పెద్ద సమస్యగా పరిణమించింది. ప్రభుత్వాల దృష్టిలో భూమి రికార్డుల క్రమబద్ధీకరణ అనేది ఎలా ఉన్నా, రికార్డులను అదే విధంగా కంప్యూటర్‌లో బంధించటంతో సరిపోతుందని, తద్వారా సత్వర సేవలు అందించవచ్చునని భావిస్తుంది. ప్రస్తుతం భూమికి సంబంధించిన కాపీలను పొందాలంటే మీ–సేవ, ఇ–సేవ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి. రైతుకు అవసరమున్న కాపీలో ఏవైనా క్లరికల్ తప్పులు జరిగినా మళ్ళీ రెవెన్యూ అధికారుల చుట్టూ తిరగవలసి వస్తుంది. ఆ ఇబ్బంది అనుభవిస్తే తప్ప తెలియదు. కంప్యూటర్‌లో జరిగే క్లరికల్ తప్పులకు రైతులు బలికావాల్సి వస్తుంది. గతంలో కూడా ఉమ్మడి ప్రభుత్వం చాలా భూ చట్టాలను చేసింది. లక్షల ఎకరాల భూ పంపిణీ చేసింది. వాటిలో సగానికి పైగా నిజమైన లబ్ధిదారుల చేతుల్లో లేనట్లు వివిధ అధ్యయనాలు చెప్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెసు ప్రభుత్వం వేసిన కె.ఆర్.ఆర్. భూకమిటీ తన నివేదికలో ఈ అంశాలను పేర్కొంది. ఇప్పటివరకు దురాక్రమణకు గురైన ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు, అసైన్‌మెంట్ భూములు, వక్ఫ్ భూములు, భూదాన భూములు, ఇనామ్ భూములు, 38ఇ భూములు, ఊరుమ్మడి భూములు అన్యాక్రాంతమైన వాటిపైన సమీక్ష జరపకుండా రైతులను అభివృద్ధిపై నడిపించడం వారి ఆదాయాలను రెట్టింపు చేయడం అసాధ్యమైన పనే. పైగా ప్రభుత్వం తను తీసుకున్న ఉత్తమ నిర్ణయాలను ప్రక్కదారి పట్టించడమే అవుతుంది. పట్టా భూముల విషయానికి వస్తే పట్టాదారు పాసుపుస్తకాలలో ఒకరి పేరుకు బదులుగా మరొకరి పేరు ఉంటుంది. పట్టాభూములను ప్రభుత్వ భూములుగా పేర్కొనడం, ప్రభుత్వ భూములను పట్టా భూములుగా చూపించడం, సాగులో వారసులు ఉంటే రికార్డులలో చనిపోయిన తాతాతండ్రుల పేర్ల మీద ఉండటం... ఇలా ఉంటాయి. వారసత్వపు వాటాలో మహిళలకు సమానమైన హక్కులు దక్కడం లేదు. వారి పేర్లు రికార్డుల్లో ఎక్కడా నమోదు కావడం లేదు. అటవీ హక్కుల చట్టం వచ్చి 10 సంవత్సరాలు గడుస్తున్నా గిరిజనుల సాగులో ఉన్న భూములకు అటవీ హక్కుల పట్టాలు దక్కడం లేదు. అటవీ హక్కుల చట్టం క్రింద వ్యక్తిగత హక్కు పత్రాలకు దరఖాస్తు చేసుకుంటే, వాటిలో ఆమోదించిన వాటికంటే తిరస్కరణకు గురైనవే ఎక్కువ వున్నాయి. ఇక సామూహిక పట్టాలకు సంబంధించిన ఊసే లేదు. అదే విధంగా పేద ప్రజల సాగులో వున్న భూములకు రక్షణ లేదు. ఇనాం భూములకు ఇప్పటికీ పరిష్కారం లభించడం లేదు. 1/70 భూములు సగానికి పైగా గిరిజనేతరుల చేతుల్లో వున్నాయి. వీటన్నింటిపై రైతుల నుంచి తీవ్రమైన ఒత్తిడులు, పోరాటాలు వచ్చినప్పుడు మాత్రమే ప్రభుత్వాలు తూతూ మంత్రంగా కొత్త చట్టాలను తీసుకురావడమో, ఉన్న చట్టాలను సవరించడమో లేదా సమీక్షించడమో చేస్తాయి తప్ప వాటి అమలును మాత్రం కావాలనే పక్కదారి పట్టిస్తాయి.

షెడ్యూల్డ్ ఏరియా ప్రాంతాలలో ఉన్న భూపరిపాలనను మైదాన ప్రాంతంలో వున్న పరిపాలనతో పోల్చి చూస్తే మరింత అధ్వాన్నంగా కనిపిస్తుంది. షెడ్యూల్డ్ ప్రాంత భూసమస్యలను పరిష్కరించడానికి పి.ఓ.ఐ.టి.డి.ఎ.



భూమి రికార్డుల ఆధునికీకరణలో (డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్) ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించవలసిన అవసరాన్ని గుర్తించాలి. ప్రజల భాగస్వామ్యం లేకుండా యథావిధిగా రికార్డులను కంప్యూటర్‌లో ఎక్కించడం వల్ల ఒరిగే ప్రయోజనం ఏమీ ఉండదు. ప్రత్యేకమైన రెవెన్యూ అకాడమి, రెవెన్యూ ట్రిబ్యునల్‌ను ఏర్పాటుచేయడం ద్వారా భూసంబంధిత సమస్యలను అన్నింటిని పరిష్కరించవచ్చును.

akbar

పరిధిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తారు. ప్రస్తుతం ఏవొక్క ఐ.టి.డి.ఎ. పరిధిలో కూడా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లేరు. తెలంగాణలో 10 జిల్లాలు ఉన్నప్పుడు 4 షెడ్యూల్డు ఏరియా కలిగిన జిల్లాలు ఉండేవి. ప్రస్తుతం వాటి సంఖ్య 31 జిల్లాల్లో 9కి చేరుకుంది. కాని 9 పి.ఓ.ఐ.టి.డి.ఎ. మాత్రం పెరగలేదు. అంతేకాకుండా షెడ్యూల్డు ఏరియాలో పనిచేసే వారికి షెడ్యూల్డ్ ప్రాంత ప్రత్యేక చట్టాల పట్ల అవగాహన లేకపోవడం వల్ల చాలా కేసులు పెండింగులో వున్నాయి. ఎస్.డీ.సీ కోర్టు, పి.ఓ.ఐ.టి.డి.ఎ., ఆర్.డి.ఓ., జిల్లా కలెక్టర్ కోర్టులలో చాలా కేసులు పెండింగులో వున్నాయి.

దీనికి భిన్నంగా పేద రైతుల భూములు పాదరసంలా కదిలిపోతున్నాయి. కొత్తగా భూమిని సంపాదించే కన్నా ఉన్న భూమిని ఏవిధంగా కాపాడుకోవాలో తెలియక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పటికే భూవివాదాలు, సివిల్, క్రిమినల్, జ్యుడిషియల్ కోర్టులలో వేలాదిగా పేరుకుపోతున్నాయి. వీటి పరిమాణం రోజురోజుకూ పెరుగుతుందే కాని తగ్గటం లేదు. రెవెన్యూ అధికారులు పరిష్కరించవల్సిన భూవివాదాలు నేడు పోలీస్ స్టేషన్‌ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరుగుతున్నాయి. దానంతటికి ముఖ్య కారణం రెవెన్యూ రికార్డుల క్రమబద్ధీకరణ సక్రమంగా లేకపోవడం, వాటిపైన పర్యవేక్షణ లోపించడం. రెవెన్యూ పరిపాలనలో రికార్డుల భద్రత అనేది చాలా ప్రధానమైనది. అంతేకాకుండా వాటిని వివిధ స్థాయిలో అమలు చేసే అధికారులకు వాటిని ఏ విధంగా నిర్వహించాలి అనే అంశం పట్ల అవగాహన, సరైన శిక్షణ ఉండాలి. అవి లేకపోవడం మూలాన భూపరిపాలన అపరిష్కృతంగా తయారు అవుతుంది. రెవెన్యూ పరిపాలనలో పారదర్శకత రానంత వరకు పేద ప్రజల భూసమస్యలు అపరిష్కృతంగానే ఉంటాయి. ఎప్పుడైతే భూమి చట్టాలు, వ్యవసాయ చట్టాలు సక్రమంగా అమలవుతాయో అప్పుడే వ్యవసాయం అభివృద్ధి జరుగుతుంది. రైతుల ఆదాయాలు రెట్టింపు అవుతాయి.

కానీ వివిధ స్థాయిలలో విధులు నిర్వహించాల్సిన రెవెన్యూ అధికారులు భూపరిపాలన విధులకు బదులు ఇతర అభివృద్ధి పథకాల అమలుకు, ప్రోటోకాల్ విధులు నిర్వహించడానికి ఎక్కువ సమయం తీసుకుంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కార్పొరేట్ కంపెనీల దృష్టిలో భూమి వ్యాపార వస్తువుగా ఉండవచ్చును కానీ రైతుల దృష్టిలో అది ఎప్పటికీ వారి జీవనాధారం. కుటుంబ పోషణ, ఆర్థిక చేయూతకు అదే మూలాధారం. ఇప్పటికీ ఆహార భద్రతకు గ్రామాల్లో రైతులే పెద్ద దిక్కుగా వున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 69 ఏళ్ళు గడుస్తున్నా నిజమైన రైతులకు భూమిపై యాజమాన్య హక్కులు దక్కడంలేదు. వివిధ చట్టాలను అమలుచేసే అధికారులకు ఆ చట్టాల పట్ల అవగాహన లేకపోవడం, శిక్షణ లేకపోవడం వల్ల రైతులకు చాలా అన్యాయం జరుగుతున్నది. సీలింగ్ చట్టాలను, ఇనాం చట్టాలను, 38 ఇ చట్టాలను, ఆర్ఓఆర్ చట్టాన్ని, పి.ఓ.టి. చట్టాలను అమలుచేసే అధికారులకు ఈ సమస్యలపైన అవగాహన లేకపోవడం రైతులకు ఎంతో ఇబ్బందికరం.

ప్రభుత్వం ప్రతి విభాగానికి ప్రత్యేకమైన శిక్షణా కేంద్రాలను రూపొందించింది. పోలీసు వారికి పోలీసు అకాడమి, జ్యుడీషియల్ ఆఫీసర్స్‌కు జ్యుడీషియల్ అకాడమి, ఫారెస్టు డిపార్టుమెంటు వారికి ఫారెస్టు అకాడమి, ఇంజనీర్స్‌కు ఇంజనీర్ అకాడమీలు ఉన్నట్లు, రెవెన్యూ సిబ్బందికి శిక్షణ ఇచ్చే ఒక కేంద్రం అంటూ లేకపోవడం మూలంగా భూపరిపాలనలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, భూసంబంధ సమస్యలను సత్వరమే పరిష్కరించలేకపోతున్నారు. మండలస్థాయి, డివిజనల్ స్థాయిలో భూసంబంధిత సమస్యలు వచ్చినప్పుడు దానికి సంబంధించిన చట్టాలను అధ్యయనం చేయడానికి కనీసం రెఫరెన్సు పుస్తకాలు కూడా రెవెన్యూ కార్యాలయాల్లో కనిపించడం లేదు. సివిల్ కోర్టు పరిధిలో లోక్ అదాలత్‌లను ఏవిధంగా అయితే నిర్వహిస్తారో అదే రీతిగా గ్రామ అదాలత్‌లను, మండల అదాలత్‌లను నిర్వహించడం వలన చాలా గ్రామాలను సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దవచ్చు. మండల స్థాయిలో, డివిజనల్ స్థాయిలో శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కూడా సమస్యల ఉత్పన్నతకు కారణమౌతుంది. రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖల మధ్య భూసమస్యల పరిష్కారంలో సమన్వయం అనేది ఉంటేనే శాఖాపరమైన విధులను పారదర్శకంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. అదే విధంగా వీటి పట్ల విస్తృతమైన ప్రచారం కల్పించాలి. ప్రభుత్వం దీని కొరకు ప్రత్యేకమైన కార్యక్రమాన్ని రూపొందించాలి. భూమి రికార్డుల ఆధునికీకరణలో (డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్) ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించవలసిన అవసరాన్ని గుర్తించాలి. ప్రజల భాగస్వామ్యం లేకుండా యధావిధిగా రికార్డులను కంప్యూటర్‌లో ఎక్కించడం వల్ల ఒరిగే ప్రయోజనం ఏమీ ఉండదు. పాత రికార్డుల కొనసాగింపుగానే ఉంటుంది తప్ప ఏమీ ఉండదు. ప్రత్యేకమైన రెవెన్యూ అకాడమి, రెవెన్యూ ట్రిబ్యునల్‌ను ఏర్పాటుచేయడం ద్వారా భూసంబంధిత సమస్యలను అన్నింటిని పరిష్కరించవచ్చును. తద్వారా భూసమస్యలు లేని గ్రామాలుగా మన గ్రామాలను తయారు చేయవచ్చును.

■ ఇస్త్రంపల్లి సుదర్శన్

న్యాయవాది, రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రైతు హక్కుల వేదిక

జనవాక్యం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్: editpage@andhrajyothy.com

కుహనా మేధావులతో ప్రమాదం

కేరళలో జరిగిన ఆరెస్సెస్ వర్కర్ దారుణ హత్య గర్హనీయం. పొలిటికల్ హత్యలు జరగటం కొత్తకాకపోయినా ఈ హత్య వెనుక చరిత్ర చూస్తే ఇది ఒక పథకం ప్రకారం ఒక వర్గాన్ని టార్గెట్ చేసి పథకాన్ని పకడ్బందీగా అమలుచేస్తున్నారు అని ఎవరికయినా అర్థమవుతుంది. ఇది కూడా రాజకీయాల్లో అప్పుడప్పుడు జరుగుతూనే ఉండటం కద్దు. కానీ 17 నెలల్లో 17 మంది ఒకే వర్గీయులు హత్యకు గురవటం అమానుషం. గవర్నమెంట్ ఈ పరిస్థితిని కంట్రోల్ చేయలేకపోవటం ఆశ్చర్యం. ఆరెస్సెస్, హిందూ కులాల వల్ల మిగతా వారికి ఎక్కడ ఒక్క తేడా వచ్చినట్టు కనిపించినా ఏళ్ల తరబడి విమర్శనా వ్యాసాలు గుప్పించే వందలకొద్దీ మేధావులు గప్ చుప్ అయిపోవటమే ఈ హత్యలకంటే మహా ఆశ్చర్యం. ఈ మేధావుల సెక్యులరిజం అరుపులు ఎంత పస ఉన్నవో ప్రజానీకానికి ఈ సంఘటన అద్దంలో చూపిస్తుంది. ఇలాంటి కుహనా మేధావులు ఉండటమే ఈ దేశ దౌర్భాగ్యం! కానీ ప్రజలు విజ్ఞులు. నిజానిజాలు గుర్తిస్తూనే వుంటారు. తగిన సమయంలో బుద్ధిచెబుతారు.

– సి.వి. రాజు, హైదరాబాద్

సామాన్యులే సమిధలు

మనదేశంలో ప్రస్తుత ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులు హర్షణీయం. కానీ ఈ చర్యల వల్ల ప్రధానంగా ఇబ్బందులు పడుతోంది సామాన్య ప్రజలే. ముఖ్యంగా నగదు – పెద్ద నోట్ల రద్దు మార్పిడి వల్ల అంతిమంగా నష్టపోయింది సామాన్య ప్రజలే. ఇప్పటి వస్తుసేవల పన్ను విధానం వల్ల కూడా సామాన్యుడే నష్టపోతున్నాడు. ఈ పన్ను రూపం పరోక్షం. కనుక ప్రభుత్వాలు ఏ పేరుతో పిలిచినా అంతిమ భారం వినియోగదారుడిదే. ప్రభుత్వాలు తమ ఆదాయం కోసం అమ్మకం పన్ను, మద్యం అమ్మకాలపై ఆధారపడిన పరిస్థితుల్లో వస్తుసేవల పన్ను ఎవరిమీద పెనుప్రభావం చూపిస్తుందో ప్రభుత్వ పెద్దలకు తెలీదా? మరోవైపు మన దేశంలో ప్రథమ, ద్వితీయ రంగాల కంటే తృతీయ రంగమైన సేవల రంగం విస్తరిస్తోంది. దీని వల్ల సామాన్యులు పొందే నిత్యావసర సేవలు ఖరీదైపోతున్నాయి. ప్రభుత్వపరంగా అందించాల్సిన సేవారంగం నిస్తేజంగా మారిపోతున్నది. దీంతో ఈ వస్తుసేవల పన్ను వల్ల అంతిమంగా సామాన్యులు వినియోగించే వస్తుసేవల ధరలు పెరిగి జీవనవ్యయం మరింత పెరుగుతుంది. ప్రభుత్వం తన ఆదాయం కోసం ప్రత్యక్ష పన్నులు వంటి వాటిపై ఆధారపడే విధంగా వ్యవస్థని మార్చే ప్రయత్నం చేస్తోందో లేదో కానీ, సామాన్యుల నుంచి ముక్కుపిండి వసూలు చేసే ఇట్లాంటి పరోక్ష పన్నులపై గొప్పలు చెప్పుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గడచిన మూడున్నర సంవత్సరాలలో తమ ప్రభుత్వంపై ఒక్క అవినీతి ఆరోపణే లేదని గొప్పగా చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం పెద్దనోట్ల రద్దు – మార్పిడి పథకం వాస్తవంలో క్షేత్రస్థాయిలో ఎందుకు విఫలమయిందో ఆత్మపరిశీలన చేసుకుంటే బాగుంటుంది.

– వి. పేరయ్య శాస్త్రి

మార్కెట్ రక్షణపై ఆర్‌సీఈపీ వేటు

జూలై 24 నుంచి 28 వరకూ హైదరాబాద్‌లో జరిగిన 'ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం' (రీజినల్ కాంప్రహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్ షిప్ – ఆర్‌సీఈపీ)పై చాలా వరకూ అంగీకారం కుదిరినట్లు తెలిసింది. ఈ ఒప్పందం వల్ల మనకున్న కొద్దిపాటి మార్కెట్ రక్షణ తప్పుతుంది. ఇప్పుడున్న ధరలు కూడా పంటలకు దక్కవు. పాడి, చేనేత, దేశీయ మార్కెట్‌పై ఆధారపడిన పరిశ్రమలు కుదేలవుతాయి. ప్రపంచ పెట్టుబడులు ఏకమై తలెత్తిన బహుళజాతి సంస్థలు ఉత్పత్తి రంగం మొదలుకొని మార్కెట్ల వరకు అన్నింటా అధికారాన్ని చెలాయిస్తాయి. దేశ సార్వభౌమత్వాన్ని కూడా సవాలు చేసే అధికారం చెలాయించే క్లాజులు ఇందులో ఉన్నాయి. ఈ మార్పులకు అవసరమైన 'ఇన్వెస్టర్ స్టేట్ డిస్‌ప్యూట్ సెటిల్‌మెంటు' (ఐఎస్‌డీఎస్) క్లాజుకు సభ్యదేశాలన్నీ అంగీకరించినట్టు సమాచారం పొక్కింది. ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంటు చాప్టర్‌నూ ఈ సమావేశంలోనే ముందుకుతెచ్చినట్టు తెలిసింది. పేటెంట్ల విధానానికి తెర ఎత్తారు. ఇంత తీవ్రత కలిగిన దీన్ని పార్లమెంటులో చర్చించకుండా ప్రభుత్వం ఆమోదించడానికి సిద్ధం కావడం ఎన్‌డీఏ పాలకులే కార్పొరేట్ ఏజెంట్లయ్యారన్న విమర్శకు తావిస్తోంది.



ఆర్‌సీఈపీలో భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వగైరా 16 సభ్య దేశాలున్నాయి. ఇవి 2012లో కాంబోడియాలో తొలి సమావేశం జరిపాయి. గత నెలలో హైదరాబాద్‌లో 19వ రౌండ్ జరిగింది. అనధికారికంగా తెలిసిన మేరకు దీనిలో అసంపూర్ణంగా ఉన్న అంశాలను వచ్చే నెలలో మనీలాలో జరిగే 20వ రౌండులో చర్చించనున్నారు. భారత్‌లో ఈ చర్చలు ఇక్కడి వరకూ రావడానికి తోడ్పడే క్రమం 1991 నుంచి మొదలైందని చెప్పొచ్చు. అప్పటి వరకు 113 శాతం దిగుమతి సుంకాలు విధించే హక్కుతో ప్రభుత్వరంగం ఆసరాగా భారత ఆర్థిక వ్యవస్థ పురోగమించింది. 1991 తరువాత ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణ (ఎల్‌పీజీ) విధానాలతో మన మార్కెట్టుకూ, పెట్టుబడులకూ ఉన్న రక్షణ తప్పింది. ప్రపంచ పెట్టుబడితో ఏకం కావాలన్న దేశీయ సంపన్న పెట్టుబడిదారుల ఒత్తిడితో మన పాలకులు ఇందులో చేరారు. ఆపై ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో)లో 1995లో మన దేశాన్ని చేర్చారు. 1992 రెగ్యులేషన్ చట్టం ప్రకారం రూపొందిన 1997–2002 'ఎగ్జిమ్ పాలసీ'లోకి దించారు. ఐదేళ్ళకొకసారి దీన్ని మార్చేలా రూపొందించారు. ఇది 'ఎగుమతి ప్రోత్సాహక విధివిధానాల'ను రూపొందించింది. ఇప్పటి వరకు జరిగిన ఈ మార్పుల కొనసాగింపుగా ఆర్‌సీఈపీ ఉంది. 1991 తరువాత జరిగిన మార్పులేంటి? దిగుమతులపై 113 శాతంగా ఉన్న సుంకాన్ని 32.7 శాతానికి మన పాలకులు దించారు. ఎగ్జిమ్ పాలసీ వచ్చాక వాజ్‌పేయి ప్రధానిగా ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఆయన ప్రభుత్వం ఫోఖ్రాన్ అణు పరీక్షలు జరపడం అమెరికా ఆగ్రహానికి కారణమైంది. దానిని ప్రసన్నం చేసుకునేందుకు మార్కెట్ రక్షణలో డబ్ల్యూటీవో మనకు ఇచ్చిన హక్కును మూడేళ్ళ ముందే వదులుకొని 2000, 2001లో 1428 వస్తువులను ఈ పాలసీ పరిధిలోకి తెచ్చారు. దీని ప్రకారం మన అవసరాలతో నిమిత్తం లేకుండా నిర్దేశిత మొత్తాలను దిగుమతి చేసుకొని తీరాలి. దీంతో చౌక పామోలిన్ దిగుమతులు జరిగాయి. ఫలితంగా వేరుశనగ, కొబ్బరి నూనె, ఇతర నూనె గింజల పంటల ధరలు పడిపోయాయి. దేశంలో అధికంగా గోధుమ ఉత్పత్తులు జరిగిన సంవత్సరమే ఎన్‌డీఏ ప్రభుత్వం దిగుమతులపై ఉన్న 25 శాతం సుంకాన్ని ఎత్తేసింది. దీంతో దిగుమతులు పెరిగి, రైతు అమ్మే గోధుమ ధరలు పడిపోయాయి. రెండేళ్ళు కరువుబారిన పడిన మధ్యప్రదేశ్‌లో 2016–17 వ్యవసాయ సీజన్లో దిగుబడులు పెరిగినా వరికి ధర లేకుండా పోయింది. కందిపప్పు దిగుమతితో మన రాష్ట్రంలో క్వింటా రూ.9 వేలు ఉన్న కంది ధర రూ.4 వేలకు పడిపోయింది.

ఆర్‌సీఈపీ ఒప్పందం అమల్లోకొస్తే ఇప్పటివరకూ పాక్షికంగానైనా ఉన్న దిగుమతి సుంకాలతో విదేశీ పెట్టుబడులను నిరోధించే రక్షణ తప్పుతుంది. మన ఉత్పత్తుల ధరలు బహుళజాతి సంస్థల లాభాల వేటకు బలవుతాయి. ఇప్పుడున్న ధరలు కూడా పంటలకు దక్కవు. పాడి, చేనేత, దేశీయ మార్కెట్‌పై ఆధారపడిన పరిశ్రమలు కుదేలవుతాయి. బహుళజాతి సంస్థలు ఉత్పత్తి రంగం మొదలు మార్కెట్ల వరకు అన్నింటా అధికారాన్ని చెలాయిస్తాయి. ఈ ఒప్పందం దేశ సార్వభౌమత్వానికి సవాలుగా మారుతుంది.

రైతు అమ్మే పంటల ధరలు పడిపోయినప్పుడు ప్రజలు కొనే పప్పుల ధరలు పెరగడంపై ప్రజల్లో తీవ్రమైన ఆందోళన వ్యక్తమైంది. దీనిపై ఆదాయపు పన్ను శాఖ స్పందించి 2015 అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య దాడులు చేసింది. ఈ ధరల మాయాజాలపు రాకెట్‌ను అది మూడు శ్రేణులుగా విశ్లేషించింది. తొలి శ్రేణిలో ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేసే బహుళజాతి స్థాయి సంస్థలున్నాయి. ముఖ్యమైన గ్లైనకోర్, ఎడిల్ వైన్, షార్పుమెంటు గ్రూపులు పప్పులను దేశంలోకి దిగుమతిచేసే ప్రధాన సంస్థలుగా ఉన్నాయి. ఇంకా ఏటీజీ గ్రూపు, కమోడిటీ మల్టీ నేషనల్ కార్పొరేషన్‌లు ఉన్నాయి. రెండో శ్రేణిలో దేశీయ డీలర్లయిన జిందాల్ గ్రూపునకు చెందిన దివిస్ జిందాల్, ప్రదీప్ జిందాల్, జిందాల్ ఆగ్రోతో పాటు సుపీరియర్ గ్రూపుకు చెందిన వికాస్ గుప్తా, ఎస్‌వి అగ్రిట్రేడ్‌కు చెందిన మనోజ్ అగర్వాల్, షార్పుమెంటు గ్రూపులున్నాయి. వీరు వ్యవసాయోత్పత్తులను రైతుల నుంచి సేకరించి తొలి శ్రేణి గ్రూపులకు అమ్ముతారు. మూడో శ్రేణిలో మనోజ్ అగర్వాల్, రిద్ధిసిద్ధి ఇంప్లెక్స్ పార్థ ఇంటర్నేషనల్, గున ఎంటర్‌ప్రైజెస్, చార్లెస్ ప్రయివేటు ఇండియా సంస్థలున్నాయి. లాభాలు తగ్గించి చూపి, పన్నుల ఎగవేతకున్న అవకాశాలను ఇవి తెలియజేస్తాయి. వీరు ముందు చెప్పిన రెండు గ్రూపుల ప్రయోజనాలను కాపాడే పనిలో ఉంటారు. ఇవి మనీ ల్యాండరింగుల్లోనూ తోడ్పడతాయి. ఇలా ఐటీ శాఖ రూపొందించిన 2,100 పేజీల నివేదికలో చౌకగా సేకరించడం, మార్కెట్లలో కృత్రిమ కొరత సృష్టించడం ద్వారా ధరలు పెంచడంలో దేని పాత్ర అవి నిర్వహిస్తున్నాయని 'ది వైర్' విశ్లేషించింది. ఇందువల్లే 2015లో తొలి దశలో 15 నుంచి 30 శాతం పెరిగిన పెసర, కంది, మినప ధరలు రెండో దశలో 64 శాతం పెరిగాయని విశ్లేషించింది. ఈ విధానాల ఫలితంగానే ప్రపంచ పాల ఉత్పత్తిలో 17 శాతం వాటాతో అతి పెద్ద ఉత్పత్తి కేంద్రంగా ఉన్న భారత్ పాడి పరిశ్రమ గాడి తప్పింది. 90 శాతంగా ఉన్న చిన్న, సన్నకారు రైతుల్లో పది శాతం మంది దీని నుంచి తప్పుకున్నారు. ఇలాంటి విధానాల మూలంగానే భారత బొమ్మల తయారీ పరిశ్రమ దారుణంగా దెబ్బ తిన్నది. పింగాణీ పరిశ్రమ, చేనేత వృత్తులు ఒడిదుడుకులకు లోనయ్యాయి.

ఆర్‌సీఈపీ ఒప్పందం అమల్లోకొస్తే ఇప్పటి వరకూ పాక్షికంగానైనా ఉన్న దిగుమతి సుంకాలతో నిరోధించే రక్షణ పూర్తిగా తప్పుతుంది. సంపూర్ణ స్వేచ్ఛా వాణిజ్యం అమలౌతుంది. మన ఉత్పత్తుల ధరలు బహుళజాతి సంస్థల లాభాల వేటకు బలౌతాయి. ప్రపంచ మార్కెట్‌లో బడుగు దేశాల ఉత్పత్తులకు తావుండదు. సంపన్న దేశాలు వీటిని ముడి సరుకు సరఫరాదారులుగా మారుస్తాయి. వాటినే నవీనీకరించి (ప్రాసెస్ చేసి) తమ ఉత్పత్తులుగా ప్రపంచంలో ఎక్కువ ధర ఉన్నచోట అమ్ముతాయి. ఈ ఒప్పందంలో ఉన్న పేటెంట్ల విధానం కొన్ని రంగాల్లో బహుళజాతి సంస్థల పెత్తనానికి చోటిస్తాయి. ప్రత్యేకించి పేటెంటు పొందిన విత్తన కంపెనీలు విత్తన ధరలను ఇష్టానుసారంగా పెంచేస్తాయి. మందుల కంపెనీల్లోనూ ఇదే తరహా పెత్తనాన్ని చెలాయిస్తాయి. ఇందువల్ల మన దేశంలో పేదలకు ఊరటగా ఉన్న జనరిక్ మందుల దుకాణాలు కనుమరుగవుతాయి. యంత్ర, వస్త్ర, ఎలక్ట్రానిక్, పింగాణీ తయారీ వగైరా దేశీయ పరిశ్రమల మార్కెట్ వీటి కబ్జాకు గురౌతుంది.

ఇందులో ఉన్న 'పెట్టుబడికి రక్షణ' అన్న క్లాజు మన దేశ సార్వభౌమత్వానికే సవాలుగా మారుతుంది. మన దేశ ప్రజా ప్రయోజనాలు, పర్యావరణ చట్టాల పేరిట వీటి పెట్టుబడులకు అనుమతులు నిరాకరిస్తే మన పాలకుల్ని అంతర్జాతీయ న్యాయస్థానంలో సవాలు చేస్తాయి. అవి ప్రజా వ్యతిరేకమైనా పెట్టుబడి రక్షణ ఒప్పందాల మేరకు నడుచుకోవాలంటుంది. ఇందువల్ల మన జీడీపీలో అంటే వ్యవసాయ, పారిశ్రామిక, సేవలరంగ ఉత్పత్తుల్లో 1.6శాతం తగ్గుదల ఉంటుందని వాణిజ్యశాఖ అంచనాకట్టింది. అయినా దేశీయ కార్పొరేటు వర్గాలు సంపదను పెంచుకునేందుకివి తోడ్పడతాయి. ఇంత తీవ్రత కలిగిన ఈ ఒప్పందాన్ని పార్లమెంటులో చర్చకుపెట్టకుండా ఆమోదించే పనిలో ఎన్‌డీఏ పాలకులున్నారు.

■ ఉన్నం వెంకటేశ్వర్లు

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి!

- సచివాలయం ఎదుట గిరిజన జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా!

హైదరాబాద్: రాష్ట్రం ఏర్పడి మూడు సంవత్సరాలైనా గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ గిరిజన జాయింట్‌యాక్షన్ కమిటీ ఆరోపించింది. బుధవారం సచివాలయం ఎదుట జరిగిన ధర్నాలో మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ గిరిజన తండాలు, గూడాలను గ్రామ పంచాయితీలుగా ఏర్పాటుచేస్తామన్న హామీ ఇప్పటికీ నెరవేరలేదని అన్నారు. అలాగే గిరిజనులకు 9 శాతం రిజర్వేషన్‌ల అమలుకు హైకోర్టు ఇచ్చిన రెస్ట్రాస్పెక్టివ్ ఎఫెక్ట్ జీవో అమలుకు నోచుకోలేదన్నారు. మైనార్టీలతో కలిపి ఎస్టీల రిజర్వేషన్‌కు సంబంధించి ఒకే బిల్లు ప్రవేశ పెట్టడం వల్ల అది అమలుకు నోచుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రతి గ్రామ పంచాయితీకి 5కోట్ల మంజూరు చేయాలని తద్వారా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. టీఆర్ఎస్ మేనిఫెస్టోలో ప్రకటించిన ఏ హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. గిరిజనుల పట్ల ప్రభుత్వ అనుసరిస్తున్నతీరును నిరసిస్తూ న్యాయధర్మ యుద్ధ భేరి ప్రకటించినట్టు తెలిపారు.



మంచిర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

ఆదివాసీలను ఆదుకుంటాం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- జేఏసీ తరపున పోరాడుతాం: కోదండరాం
- భూముల జోలికొస్తే గద్దెదించుతాం: సున్నం రాజయ్య
- ఘనంగా ఆదివాసీ దినోత్సవం

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: దివాసీల హక్కుల కోసం పోరాడిన కొమురం భీం సేవలకు ప్రభుత్వం తగిన గుర్తింపునిస్తుందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్రవాప్తంగా ఆదివాసీ దినోత్సవాలు జరిగాయి. నిర్మల్‌లో జరిగిన ఉత్సవంలో కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆదివాసీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆదివాసులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు చేపడుతామన్నారు. ఆదివాసీలకు భూమి హక్కును కల్పించాలని మంచిర్యాలలో జరిగిన ఆదివాసీ దినోత్సవ ర్యాలీ, సభలో ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివాసీ హక్కుల కోసం జేపీసీ ఆధ్వర్యంలో త్వరలోనే పోరాటం చేస్తామని జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం కొమురం భీం జిల్లా కాగజ్‌నగర్‌లో అన్నారు. గిరిజన ఆదివాసీల భూముల జోలికొస్తే గద్దె దించుతామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే సున్నం రాజయ్య హెచ్చరించారు. జిల్లా భద్రాచలంలో నిర్వహించిన ప్రదర్శనలో అన్నారు.

గిరిజన యువత ఉపాధికి 224.20 కోట్లు: తాటి వెంకటేశ్వర్లు

రాష్ట్రంలోని నిరుపేద గిరిజన యువతకు స్వయం ఉపాధి కార్యక్రమం కింద 2017-18 సంవత్సరానికిగాను రూ. 224.20 కోట్లతో వార్షిక ప్రణాళిక రూపొందించినట్టు ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు తెలిపారు. 19,713 మందికి లబ్ధికలిగించేలా 177 పథకాలను రూపొందించినట్టు పేర్కొన్నారు. బుధవారం మాట్లాడుతూ రూ. 224.20కోట్ల వార్షికప్రణాళికలో రాష్ట్ర వాటా రూ. 183.70 కోట్లు కాగా, కేంద్రం వాటా రూ 40.50కోట్లని వెల్లడించారు.

కేటీపీఎస్ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

- అధికారుల హామీ.. బంద్‌ను విరమించుకున్న విపక్షాలు
- రాష్ట్రంలో రాక్షస రాజ్యం: భట్టి విక్రమార్క



కేటీపీఎస్/దమ్మపేట, ఆగస్టు 9: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ ఫిట్టర్ కేశబోయిన నాగేశ్వరరావు కుటుంబా న్ని ఆదుకుంటామని జెన్‌కో అధికారులు హామీ ఇచ్చారు. విలీన జాబితాలో తనపేరు రాలేదని మనస్తాపానికి గురైన నాగేశ్వరరావు మంగళవారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుమారు 24గంటల పాటు మృతదేహంతో ఆందోళన చేసిన కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల నేతలు, కార్మిక సంఘాల నేతల ఉత్కంఠకు బుధవారం తెరపడింది. కేటీపీఎస్ కార్మిక సంఘాల నేతలు జెన్‌కో థర్మల్ డైరెక్టర్ సచ్చిదానందం, చీఫ్‌ఇంజనీర్లు సమ్మయ్య, మూర్తిలతో చర్చలు జరిపారు. నాగేశ్వరరావు సతీమణికి ఉద్యోగం ఇవ్వడంతో పాటు దహన సంస్కారాలకు రూ.50వేలు తక్షణ సాయంగా మ రో రూ.3లక్షలు ఇచ్చేందుకు అధికారులు అంగీకరించారు. మరో రూ.10లక్షలను నెలవ్యవధిలో కుటుంబానికి అందజేస్తారని తెలిపారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. విపక్ష నేతలు గురువారం నిర్వహించతలపెట్టిన బంద్‌ను విరమించుకుంటున్నట్లు ప్రకటించారు. తెలంగాణ ఏర్పడితే బంగారం చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీసుల నిర్బంధాలతో రాక్షస రాజ్యంగా మార్చారని రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. పోలీసులు అరెస్టు చేసిన అఖిలపక్ష నాయకులను పరామర్శించిన తర్వాత ఆయన మాట్లాడారు.

నేరెళ్ల బాధితులను విచారించిన డీఐజీ

వేములవాడ, ఆగస్టు 9 : నేరెళ్ల ఘటనలో నిందితులుగా ఉన్న ఎనిమిది మందిని కరీంనగర్ రేంజ్ డీఐజీ రవివర్మ బుధవారం విచారించారు. నేరెళ్ల ఘటనపై ప్రభుత్వం డీఐజీ రవివర్మను విచారణ అధికారిగా నియమించగా, బుధవారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ చేరుకొని బాధితులను విచారించారు. తొలుత రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఓరుగంటి గణేశ్, చీకోటి శ్రీనివాస్‌లను డీఐజీ విచారించారు. అనంతరం మిగతా ఆరుగురిని విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు రావాలని కబురు పంపారు. అయితే పోలీస్ స్టేషన్‌లోకి వచ్చేందుకు వారు నిరాకరించారు. దీంతో డీఐజీ రవివర్మ బాధితులు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి చేరుకొని పసుల ఈశ్వర్, గంధం గోపాల్, పెంట బానయ్య, చెప్యాల బాలరాజు, కోల హరీశ్, బత్తుల హరీశ్‌లను విడివిడిగా విచారించారు. నేరెళ్ల ఘటనలో మొత్తం ఎనిమిది మందిని విచారించామని విచారణ అనంతరం డీఐజీ రవివర్మ వెల్లడించారు. ఆయన వెంట డీఎస్పీ అవధాని చంద్రశేఖర్, సీఐ ఎ.శ్రీనివాస్ ఉన్నారు.

ముగ్గురు మహిళా రైతుల ఆత్మహత్యా యత్నం

దహెగాం, ఆగస్టు 9 : కుమరం భీం జిల్లా దహెగాం మండల ఎంపీపీ చిలువేరు కల్పన (టీ ఆర్ ఎస్) ఇంటి ఎదుట బుధవారం అదే గ్రామానికి చెందిన ముగ్గురు మహిళా రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దహెగాంకు చెందిన గుర్లె తులసీబాయి, రాధాబాయి, పోశక్కలకు అదే గ్రామానికి చెందిన చప్పిడి రాజు, సత్తయ్య, వైకుంఠంల మధ్య భూతగాదా నడుస్తోంది. ఈ ఏడాది గుర్లె తులసీబాయి, రాధాబాయి, పోశక్కలు సదరు భూమిలో పత్తి పంటను సాగు చేయగా, బుధవారం చప్పిడి రాజు, వైకుంఠం, సత్తయ్యలు పత్తి పంటను ధ్వంసం చేశారు. ఎంపీపీ భర్త చిలువేరు శ్యాంప్రసాద్ ప్రోత్సాహంతోనే వారు తమ పంటను ధ్వంసం చేశారని, ఆయన జోక్యం కారణంగానే పంట నాశనమైందని ఆరోపిస్తూ ముగ్గురు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.

రవ్వా శ్రీహరి రచనలపై 12న సాహితీ సమాలోచనం



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ భాషావేత్త ఆచార్య రవ్వా శ్రీహరి పంచసప్తతి మహోత్సవం సందర్భంగా ఆయన సమగ్ర రచనలపై సాహితీ సమాలోచనం నిర్వహించబోతున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు జరగబోతున్న ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరుకాబోతున్నారు. దీనిలో మొత్తం నాలుగు సదస్సులు జరగనున్నాయి. రవ్వా శ్రీహరి సమగ్ర రచనలపై 29 మంది ఆచార్యులు వివిధ అంశాలపై పత్రాలను సమర్పించనున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఎస్వీ సత్యనారాయణ, తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు అమరేశం రాజేశ్వరశర్మ, కోవెల సుప్రసన్నాచార్యులు, ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులు కె. శ్రీనివాస్ పాల్గొననున్నారు.

డయాగ్నస్టిక్ సెంటర్లలోనూ సీటీ స్కాన్, ఎమ్మారై

- **ఉద్యోగులకు వెసులుబాటు.. మరిన్ని వెల్‌నెస్ సెంటర్లు**

హైదరాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రముఖ డయాగ్నస్టిక్ సెంటర్లలోనూ సీటీ స్కాన్, ఎమ్మారై సహా రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేయించుకునేందుకు ఉద్యోగులకు వెసులుబాటు లభించనుంది. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు జారీ కానున్నాయి. బుధవారం తనను కలిసిన టీఎన్జీవోఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కారం రవీందర్ రెడ్డి, ఎం. రాజేందర్, రామినేని శ్రీనివాస్‌రావుకు వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్ తివారీ ఈ మేరకు హామీ ఇచ్చారు. ఈహెచ్ఎస్ (ఉద్యోగుల ఆరోగ్య పథకం) కింద ప్రస్తుతం హైదరాబాద్ నిమ్స్‌లో మాత్రమే ఉద్యోగులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో నిమ్స్‌పై భారం పడుతోంది. ఉద్యోగులు గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. టీఎన్జీవోఏ నేతల విజ్ఞప్తితో వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సానుకూలంగా స్పందించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభిస్తామని టీఎన్జీవోఏ నేతలకు ఆయన హామీ ఇచ్చారు. వాస్తవానికి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కలిపి 14 వెల్‌నెస్ సెంటర్లు గతంలోనే మంజూరయ్యాయి. ఒక్క హైదరాబాద్‌లో రెండు సెంటర్లను మాత్రమే ప్రారంభించారు. ఈ పరిస్థితి ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారడంతో.. పాత జిల్లా కేంద్రాల్లో కొత్తగా వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించనున్నారు.

కిడ్నీ బాధితులకు అండగా ఉంటాం

ఆసిఫాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కొమరం భీం జిల్లా లింగాపూర్ మండలం లొద్దిగూడ గ్రామంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారికి అండగా ఉంటామని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ పురాణం సతీష్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ చంపాలాల్ తెలిపారు. లొద్దిగూడ గ్రామాన్ని బుధవారం రాత్రి సందర్శించిన వారు కిడ్నీ బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ఆరా తీశారని వారు పేర్కొన్నారు. నిమ్స్ వైద్యుల బృందం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వపరంగా బాధితులకు సహకారం అందిస్తామని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు.

ఫైళ్లు చూడడం కాదు...ఫీల్డ్‌కు వెళ్లండి

- **కలెక్టర్లకు ప్రధాని మోదీ మార్గనిర్దేశం**

ఢిల్లీ/రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కలెక్టర్లు ఫైళ్లు చూడడం కాదు..ఫీల్డ్ విజిట్‌కు వెళ్లాలని ప్రధాని మోదీ ఆదేశించారు. కార్య క్షేత్రానికి వెళితేనే వాస్తవాలు అర్థమవుతాయని, నిజమైన సమస్యలు తెలుస్తాయన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం చేపట్టి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా ఉన్న జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తొలిసారిగా న్యూ ఇండియా-మంథన్ పేరుతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో వైద్య సౌకర్యాల గురించి కలెక్టర్లు తెలుసుకోవాలన్నారు. 2022 నాటికి మీ జిల్లాలు ఎలా ఉండాలనేదానిపై ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. వీటిని ఉంచేందుకు కేంద్రం ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభిస్తుందన్నారు. పేదల జీవితంలో మార్పు తేగలిగామా, ఏదైనా మేలు చేయగలిగామా అన్న విషయాన్ని కలెక్టర్లు రోజూ తమను తాము ప్రశ్నించుకోవాలని అన్నారు. తమ కష్టాలు చెప్పుకోడానికి వచ్చే వారి ఫిర్యాదులను కలెక్టర్లు ఓపిగ్గా వినాలని సలహా ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దివ్య, రంగారెడ్డి జిల్లా డీఆర్వో భవానీ శంకర్ పాల్గొన్నారు.

కేసీఆర్ సింహం లాంటోడు

(మొదటి పేజీ తరువాయి)

కలుగుతోందని అన్నారు. నేరెళ్ల ఘటనలో దళిత కోణం అసలే లేదని, కాంగ్రెస్ నాయకులు మీరాకుమార్ వంటి వారిని తీసుకువచ్చి వివాదాన్ని మరింత పెద్దదిగా చేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలకు ఏ ఇష్యూ లేకపోవడం వల్లనే నేరెళ్ల ఘటన జరిగిన తెల్లారి నుంచే టూరిజం స్పాట్ మాదిరిగా పరుగెత్తుకు వెళ్లి ఆందోళనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన మంత్రి కేటీఆర్.. కాంగ్రెస్ నాయకుల తీరుపై తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలోని మిగిలిన ఇసుక పాయింట్ల కంటే నేరెళ్ల వద్ద ఇసుక అధికంగా ఉందని, ఈ పాయింట్‌లో దాదాపు 2కోట్ల సీఎఫ్‌టీ మేరకు ఇసుక ఉందని, అందుకే ఇక్కడి నుంచే ఇసుకను తరలిస్తున్నారన్నారు. దీంతో ఇక్కడ లారీల రాకపోకలు పెరిగాయని చెప్పారు. ఘటన జరిగిన రోజు లారీ ప్రమాదంలో భూమయ్య అనే వ్యక్తి చనిపోయాడని, అప్పటికే ఆ దారిన పెద్దసంఖ్యలో ఇసుక లారీలు రావడంతో కొందరు ఒక లారీకి నిప్పుపెట్టారని తెలిపారు. కొందరిని అరెస్టుచేసి, రిమాండ్‌కు తరలించే వరకూ తనకు పూర్తి సమాచారం లేదని మంత్రి వివరించారు. కొందరు పోలీసులు మాత్రం అత్యుత్సాహం ప్రదర్శించి భయంకరంగా కొట్టినట్టు అక్కడివారు చెప్పారని అన్నారు. తాము ఉద్యమం నుంచి వచ్చిన వాళ్లమని, పోలీసులను ప్రేరేపించే ఖర్మ తమకు లేదని కేటీఆర్ చెప్పారు. క్షణికావేశంలో జరిగిన ఘటనలో ఉద్రిక్తతలను నివారించడంలో స్థానిక నాయకత్వం విఫలమైందని తెలిపారు. ఈ ఘటనపై డీఐజీ స్థాయి అధికారి ద్వారా విచారణ జరిపిస్తున్నామని, పోలీసుల అత్యుత్సాహమే కారణమని తేలితే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



బినామీల పేరుతో దోచుకుతిన్న కాంగ్రెస్..

'నేరెళ్ల ఘటనపై కాంగ్రెస్ నాయకులు రకరకాల ఆరోపణలు చేస్తున్నారు. ఒకాయన దళితులపై దాడి అని, మరి కొందరు ఇసుక మాఫియా అంటూ విమర్శలు చేస్తున్నారు. దళితులపై దాడులు చేయించిన ఘనత కాంగ్రెస్‌దే. నిజంగా ఇసుక మాఫియా అయితే ప్రభుత్వానికి మూడేళ్లలో రూ.1000 కోట్ల ఆదాయం ఎలా వస్తుంది? కాంగ్రెస్ హయాంలో 60 ఏళ్లలో ఇసుక దోపిడీతో పెద్దమొత్తంలో దండుకున్నారు. అందుకే తెలంగాణ ఏర్పడే నాటికి ఇసుక ద్వారా ప్రభుత్వ ఆదాయం రూ.10.84 కోట్లు దాటలేదు' అని మంత్రి కేటీఆర్ అన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ రాష్ట్రం టీఆర్ఎస్‌దే విజయమని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయం కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కూడా తెలుసునని అన్నారు. నేరెళ్ల ఘటనను రాజకీయం చేద్దామనుకున్న రాజకీయ టూరిస్టులకు తాను భయపడనని కేసీఆర్ చెప్పారు. బాధితులను ఆదుకుంటామన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ తాను వందశాతం సిరిసిల్ల నుంచే పోటీ చేస్తానన్నారు.

హిమాన్షు మోటార్స్ నిలిచిపోయి ఏడేళ్లయింది..

కాంగ్రెస్ నాయకులు పోలీసుల వాహనాల కొనుగోళ్లలోనూ ఆరోపణలు చేశారని కేటీఆర్ అన్నారు. తాను 2004లో అమెరికా నుంచి వచ్చాక హిమాన్షు మోటార్స్ పేరుతో ఎస్కార్ట్ ట్రాక్టర్స్‌కు సంబంధించి సిద్దిపేటలో స్టాక్ యార్ట్ వ్యాపారం మొదలు పెట్టిన విషయం నిజమేనన్నారు. 2009 నుంచి 2011 వరకు నష్టాలు రావడంతో వ్యాపారం బంద్ చేసుకున్నామన్నారు. 2014లో టీఆర్ఎస్ వచ్చాక పోలీసులకు కొత్త వాహనాలను సమకూర్చడానికి ప్రభుత్వం టయోటా మోటార్స్ కోసం ఆర్డర్ ఇచ్చిందని, రాధాకృష్ణ టయోటా, హర్ష టయోటా కంపెనీల్లో హర్ష టయోటా కంపెనీకి ఆర్డర్ ఇచ్చారు. తన కంపెనీ కార్యకలాపాలు నిలిచిపోయి 7 ఏళ్లు అయిందని, అయినా కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఇక స్వర్ణ భారతి ట్రస్ట్, బసవ తారకం ట్రస్ట్ వంటి వాటికి ప్రభుత్వం మినహాయింపులు ఇచ్చిన మాట వాస్తవమేనని, బసవతారకం ట్రస్టుకు రూ.5.70 కోట్ల మేరకు మినహాయింపులు ఇచ్చామని చెప్పారు.

పార్టీలన్నీ కలిసినా ఓడించలేవు..

వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను ఓడించడానికి కాంగ్రెస్, కమ్యూనిస్టులు, టీడీపీ కలిసి పోటీ చేస్తే.. అది తమ బలానికి సంకేతమని కేటీఆర్ అన్నారు. ఇప్పుడు తెలంగాణలో టీడీపీ, కమ్యూనిస్టులకు దిక్కులేద ని, అన్ని పార్టీలు కలిసి వచ్చినా టీఆర్ఎస్‌ను ఓడించలేవన్నారు. 'టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సింహం లాంటోడు. సింగిల్‌గానే వస్తారు. మళ్లీ టీఆర్ఎస్‌ను గెలిపిస్తారు. కేసీఆర్ 2029 నాటికి కూడా సీఎంగా కొనసాగుతారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఆయన ఆరోగ్యంపై రకరకాల ప్రచారం చేస్తున్నారు. కానీ, ఆయన ప్రస్తుతం నాకంటే, బావ(హరీశ్‌రావు) కంటే కూడా ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో కేసీఆర్ ఉన్నంతకాలం బీజేపీ, కాంగ్రెస్ అధికారంలోకి రావని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ కూడా చెప్పారన్నారు. హైదరాబాద్‌లో మెట్రోరైల్ ప్రాజెక్ట్ నవంబరు ఆఖరుకు ప్రారంభమవుతుందన్నారు. టీఆర్ఎస్ సభ్యత్వం 75 లక్షలకు చేరిందని కేటీఆర్ తెలిపారు.

ఇద్దరి మధ్య అన్ని విషయాల్లోనూ క్లారిటీ ఉంది



మీడియాలో ప్రచారం జరుగుతున్నట్టుగా తనకు బావ(మంత్రి హరీశ్‌రావు)తో ఏ స్పర్థలూ లేవని కేటీఆర్ స్పష్టం చేశారు. అన్ని విషయాల్లో తమ ఇద్దరి మధ్య క్లారిటీ ఉందన్నారు. 'హరీశ్‌బావ ఫుల్‌టైమ్ అంకితభావంతో పనిచేస్తున్నారు. ఆయన కష్టపడుతున్నతీరు చూసి ఆదివారం రోజైనా కాస్త రెస్ట్ తీసుకోమని చెప్పాను. ఆయన చేసే పని పట్ల ఎంతో నిబద్ధతతో వ్యవహరిస్తారు' అని కేటీఆర్ తెలిపారు.

నా కొడుకుపై కూడా విమర్శలా?



ప్రతిపక్ష పార్టీల నాయకులు కొందరు సీఎం కేసీఆర్‌ను, తననే కాకుండా తన కుమారుడినీ విమర్శిస్తున్నారని కేటీఆర్ అన్నారు. తన కుమారుడు హిమాన్షు లావున్నాడని కూడా మాట్లాడుతున్నారని తెలిపారు. వ్యక్తిగతంగా దూషించడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించారు. తిరిగి తాను కూడా తిడితే ఎలా ఉంటుందన్నారు. ఇలాంటివి చూసినప్పుడు రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానా? అని బాధ కలుగుతుందన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క వంటి వారంతా తనకు రాజకీయంగానే శత్రువులన్నారు.

జీఎస్టీపై కోర్టుకైనా వెళ్తామని చెప్పాం

జీఎస్టీకి మొదట మద్దతు తెలిపింది తెలంగాణ రాష్ట్రమేనని మంత్రి కేటీఆర్ చెప్పారు. 'జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఐటమ్ వారీగా పన్నులు వేస్తామన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా పన్నుల వ్యవస్థ ఉంటుందన్నారు. గ్రానైట్స్ వంటి కొన్ని అంశాల విషయంలో 28శాతం స్లాబ్‌ను మేము అంగీకరించలేదు. బీడీలపై పన్నునూ వ్యతిరేకించాం. వాటర్, రోడ్డు, హౌసింగ్ వంటి ప్రాజెక్టుల పై 18శాతం పెట్టడాన్ని, ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులపై కూడా 18శాతం జీఎస్టీని తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించింది. గతంలో 5శాతం ఉన్న పన్ను ఇప్పుడు 18శాతానికి పెరిగింది. రాష్ట్రంలో ప్రాజెక్టులకు సంబంధించి రూ.2 లక్షల కోట్లకు పైచిలుకు పనులు జరుగుతున్నాయి. వీటిపై 18శాతం జీఎస్టీ చెల్లించాలంటే ఇప్పుడు 13శాతం అదనపు భారం పడుతుంది. దాదాపు రూ.19,200 కోట్లు పన్ను రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. దీనిని వ్యతిరేకించాం. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులపై పన్నులను తొలగించాలని, లేదా గతంలో ఉన్నట్టుగా 5శాతం వసూలుచేయాలని చెప్పాం. కేంద్రం అంగీకరించకపోతే కోర్టుకెళతామని కూడా స్పష్టం చేసి వచ్చాం' అని కేటీఆర్ వివరించారు. ఈ ప్రతిపాదనకు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, గుజరాత్ రాష్ట్రాలూ మద్దతు తెలిపాయన్నారు.

వాదన వినిపిస్తాం..

సెప్టెంబరు 9న హైదరాబాద్‌లో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనుందని, ఈ భేటీలో ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణ వాదన వినిపిస్తామని కేటీఆర్ తెలిపారు. కేంద్రం అంగీకరించకపోతే కోర్టుకు వెళ్లక తప్పదన్నారు. జీఎస్టీతో అన్యాయం జరిగితే స్పందించిన మొదటి రాష్ట్రంగా కూడా తెలంగాణ ఉండబోతుందన్నారు. జీఎస్టీ విషయంలో కేంద్రం ఆనాడు చెప్పిందొకటి, ఇప్పుడు అనుసరిస్తున్నది మరొకటని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగితే ఏ విషయంలోనైనా కేంద్రంతో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఒక్క హౌసింగ్ ప్రాజెక్టులపైనే రూ.18 వేల కోట్ల జీఎస్టీ భారం పడబోతోందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ వాళ్లే ఈ బిల్లును తెచ్చేందుకు ప్రయత్నించారని, ఇప్పుడు వాళ్లే వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఇక కేంద్రం నుంచి తెలంగాణకు బయ్యారం, ఐటీఐఆర్, రైల్వే కోచ్, ఎయిమ్స్ వంటివి ఇవ్వాల్సి ఉన్నా సహకరించడం లేదన్నారు. టీఆర్ఎస్‌కు కేంద్రంతో దోస్తానీ లేదు, దుష్మనీ లేదని ఆయన స్పష్టం చేశారు.

ఇంటి నుంచి వచ్చి.. ఇంతలోనే..

నారాయణ కళాశాలలో ఇంటర్ విద్యార్థిని మృతి

హైదరాబాద్/వలిగొండ, ఆగస్టు 9: పండుగకి ఇంటికొచ్చిన కుమార్తెను తిరిగి కాలేజీకి తీసుకొచ్చి దింపాడు ఆ తండ్రి. సామాన్లు పెట్టి వస్తానంటూ ఆమె హాస్టల్ గదికి వెళ్లింది. ఆయన ఫీజు కట్టేందుకు కౌంటర్ వద్ద వేచి ఉన్నాడు. కొద్దిసేపటికి కాలేజీకి అంబులెన్స్ రావడంతో ఏం జరిగిందోనని అక్కడ ఆందోళన రేగింది. అందరితో పాటు ఆ తండ్రీ వెళ్లి చూశారు. అంబులెన్స్‌లో తీసుకువెళుతున్నది తన కూతురేనని తెలిసి హతాశుడయ్యాడు. ఇది హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో చదువుతున్న శ్రావ్య (16) అనే విద్యార్థిని విషాదాంతం. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రానికి చెందిన పబ్బు వెంకటేశం కుమార్తె శ్రావ్య. హైదరాబాద్‌లో హిందూ అరణ్య సమీప బండ్లగూడలోని నారాయణ మహిళా కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం(బైపీసీ) చదువుతోంది. శ్రావ్యను బండ్లగూడలోని సుప్రజ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. యాజమాన్యం వేధింపులే ఆమె మృతికి కారణమని బంధువులు ఆరోపిస్తున్నారు. హాస్టల్‌లోకి వెళ్లిన శ్రావ్య ఎంతకీ రాకపోవడంతో సిబ్బంది వెళ్లి చూశారు. హాస్టల్ గదిలో దుస్తులు ఆరేసే కొండికి చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని చెబుతున్నారు. రాఖీ పండుగకి ఇంటికి వచ్చి ఆనందంగా గడిపిందని, ఇంతలోనే తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయిందని శ్రావ్య కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. వెంకటేశం ఫిర్యాదుపై హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలి కుటుంబానికి రూ.20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చిలుక మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు.



విద్యార్థిని శ్రావ్య మృతదేహం

ఇకపై ఖతర్‌కు వెళ్లే భారతీయులకు వీసా అవసరం లేదా?

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: పొరుగున ఉన్న పెద్ద దేశాల ఆంక్షలతో దిగ్బంధం ఎదుర్కొంటున్న ఖతర్.. తాజాగా భారత్‌తో సహా 80 దేశాల జాతీయులకు ఎలాంటి వీసా లేకుండా ప్రవేశం కల్పించనున్నట్లుగా ప్రకటించింది. దేశంలోకి వచ్చే 80 దేశాల జాతీయులకు వారి జాతీయత ఆధారంగా నెల నుంచి ఆరు నెలల వ్యవధి కలిగిన సందర్శనకు అనుమతిస్తామని ఖతర్ పర్యాటక మండలి అధ్యక్షుడు హస్సన్ అల్ ఇబ్రహీం ప్రకటించినట్లుగా స్థానిక మీడియా వెల్లడించింది. ఈ అనుమతి పొందిన వారు తమకు కేటాయించిన వ్యవధిలో దేశం బయటకు వెళ్ళి మళ్ళీ తిరిగి ప్రవేశించడానికి అవకాశం ఉంటుందని కూడా ఆయన వివరించారు. ఆరు నెలల గడువు మరియు తిరుగు ప్రయాణం టిక్కెట్ తప్పని సరిగా ఉండాలని కూడా ఆయన చెప్పారు. వీలైనంత మంది విదేశీయులకు సులభతర సందర్శనలను అనుమతించడం ద్వారా విమాన రాకపోకలను పెంచి పొరుగున ఉన్న దేశాలపై ఒత్తిడి పెంచాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఖతర్‌లో 6 లక్షల మంది భారతీయులు పని చేస్తుండగా, హైద్రాబాద్‌తో సహా భారత్ నుంచి ప్రతీ వారానికి 24 వేల మంది రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఖతర్ పర్యాటక సంస్థ ప్రకటించినట్లుగా భారతీయులకు వీసా లేకుండా దేశంలోకి ప్రవేశించడానికి అనుమతి లభిస్తే, భారీ సంఖ్యలో ప్రవాసీయులు తమ భార్య, పిల్లలను తాత్కాలిక సందర్శన నిమిత్తం ఖతర్‌కు పిలిపించుకునే అవకాశాలున్నాయి. గల్ఫ్ దేశాలలో కార్మికులు, విదేశీ ఉద్యోగులు తమ భార్య, పిల్లలను తమతో పాటు ఉంచుకోవడానికి లేదా తాత్కాలిక సందర్శన నిమిత్తం పిలిపించుకోవడానికి అనేక కఠోర నియమాలు అడ్డుగా ఉన్నాయి. దిగ్బంధం కారణాన ఈ రకమైన వెలుసుబాటు ఇచ్చిన మొదటి గల్ఫ్ దేశం ఖతర్.

మా ఓటు బ్యాంకు పెరిగింది

- **తాజా సర్వేలో వెల్లడయింది**
- **ప్రస్తుతం 7-8 శాతం పెరుగుదల**
- **2019లో కాంగ్రెస్ విజయం తథ్యం**
- **క్విట్ ఇండియా ఉద్యమ చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ సర్కారు: ఉత్తమ్**

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకు ఇటీవల గణనీయంగా పెరిగిందని టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. టీపీసీసీ తరపున తాజాగా చేయించిన సర్వేలో తమకు 7 నుంచి 8 శాతం ఓటు బ్యాంకు పెరిగినట్లు వెల్లడయిందని అన్నారు. 2019 ఎన్నికలు సమీపించే నాటికి ఇది మరింత మెరుగుపడుతుందని, కాంగ్రెస్ విజయం సాధించడం తథ్యమని పేర్కొన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. ఎన్నికల్లో ఏయే పార్టీలతో పొత్తుపెట్టుకునాలనే విషయంపై ప్రస్తుతం ఆలోచన చేయడంలేదని, ఒకవేళ పొత్తులు ఉన్నా తాము 100 స్థానాల్లో పోటీ చేయడం ఖాయమని అన్నారు. విద్యుత్ రంగంలో పరిస్థితులు మెరుగుపడటానికి కారణమెవరో, టీఆర్ఎస్ సర్కారు ప్రజల్ని ఎలా భ్రమింపజేస్తోందో పీపీటీలో వివరిస్తామన్నారు. దళితులకు మూడెకరాల విషయంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని, భూమి లేకపోతే ఎకరానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సూచించారు. పౌరసరఫరాల శాఖ ద్వారా రేషన్ కార్డు ఉన్నవారికి ఇచ్చే 10, 11 వస్తువులను టీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క వస్తువుకు పరిమితం చేసిందన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో బ్రిటిష్ వారికి అనుకూలంగా వ్యవహరించిన ఆర్ఎస్ఎస్, బీజేపీ శక్తులు నేడు క్విట్ ఇండియా ఉత్సవాల పేరిట హడావిడి చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో జెండా ఎగురవేశారు. స్వాతంత్ర్యం కోసం 14 ఏళ్లు జైల్లో ఉన్న నెహ్రూ పేరును ఉత్సవాల సందర్భంగా ప్రస్తావించకపోవడం దురదృష్టకరమని అన్నారు. కాగా, గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో అహ్మద్‌పటేల్ గెలుపొందిన నేపథ్యంలో టీపీసీసీ సంబరాలు చేసుకుంది



అహ్మద్‌పటేల్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంలో గాంధీభవన్‌లో స్వీట్స్ తినిపించుకుంటున్న ఉత్తమ్, షబ్బీర్

సోనియాతో పొన్నాల భేటీ

- **రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై నివేదిక**



న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య బుధవారం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీతో సమావేశమయ్యారు. ఢిల్లీలో సోనియా నివాసంలో ఆమెను కలిసి పార్టీకి సంబంధించి పలు అంశాలు చర్చించారు. ప్రస్తుతం తెలంగాణలో రాజకీయ పరిస్థితులపై నివేదికను అధినేత్రికి అందించారు. కరీంనగర్‌లో మెడికల్ కాలేజీ కోసం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ చేపట్టి దీక్ష, నేరెళ్ల ఘటన, కాంగ్రెస్ నేతలపై టీఆర్ఎస్ విమర్శలు వంటి అంశాలను సోనియా ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

మెడికల్ కాలేజీ కోసం ఆమరణ దీక్ష

- **15 నుంచి సంగారెడ్డిలో: జగ్గారెడ్డి**



హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 15వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రకటించారు. గాంధీ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద తన దీక్ష సాగుతుందన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ మంత్రి బోడ జనార్దన్



మంచిర్యాల, ఆగస్టు 9, (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, టీడీపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బోడ జనార్దన్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఆయన వెంట పెద్దసంఖ్యలో చెన్నూరు నియోజకవర్గానికి స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు చేరే విధంగా ప్లాన్ చేసుకుంటున్నారు.



పొన్నం ప్రభాకర్‌కు నిమ్మరసం తాగిస్తున్న జైపాల్‌రెడ్డి

పొన్నం దీక్ష విరమణ

- **నిమ్మరసం ఇచ్చి విరమింపజేసిన జైపాల్‌రెడ్డి**
- **మెడికల్ కళాశాలను సాధించి తీరుతాం**
- **జీఎస్టీపై సీఎం కొత్త నాటకం: జైపాల్**

కరీంనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలంటూ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షను మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ బుధవారం సాయంత్రం విరమించారు. దీక్షా శిబిరం నుంచి పోలీసులు బలవంతంగా ఆస్పత్రికి తరలించి సెలైన్లు ఎక్కిస్తున్నా.. పొన్నం దీక్షను కొనసాగించిన నేపథ్యంలో కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి బుధవారం ఆయనను ఆస్పత్రిలో పరామర్శించారు. పొన్నం ఆరోగ్య పరిస్థితి బాగాలేదని వైద్యులు తెలిపారు. దీంతో జైపాల్ తదితరులు పొన్నంతో మాట్లాడి దీక్ష విరమణకు ఒప్పించి నిమ్మరసం తాగించారు. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ.. కరీంనగర్‌లో వైద్య కళాశాలను సాధించి తీరుతామన్నారు. కేసీఆర్‌కు మూడు నెలల సమయం ఇస్తున్నామని ఆ తర్వాత తమ కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ జీఎస్టీపై కొత్త నాటకం ఆడుతున్నారని విమర్శించారు. జైపాల్ వెంట సీఎల్పీ ఉపనేత టి.జీవన్‌రెడ్డి, సిరిసిల్ల రాజయ్య, కటకం మృత్యుంజయం, సుద్దాల దేవయ్య, గజ్జెల కాంతం ఉన్నారు.

ఆంధ్రజ్యోతి నవ్య
కుటుంబ కదంబం





తండ్రి గుమ్మడి నర్సయ్యతో..

ఆదివాసీల చదువుల తల్లి

ఆదివాసీ మహిళలు తలచుకుంటే ఎందులోనూ... ఎవ్వరికీ... తీసిపోరని గుమ్మడి అనూరాధ నిరూపించారు. న్యాయకళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకమైన తొలి ఆదివాసీ మహిళగా రికార్డు సృష్టించారామె. విశేషమేమిటంటే రెండు తెలుగు రాష్ట్రాలలో ఇంతటి ఉన్నత ఉద్యోగాన్ని నిర్వహిస్తున్న ఏకైక ఆదివాసీ మహిళ అనూరాధే! ఉస్మానియా యూనివర్సిటీ వందేళ్ల చరిత్రలో తొలిసారి ఒక ఆదివాసీ (కోయ)మహిళ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టింది. ఐదుసార్లు ఇల్లెందు ఎమ్మెల్యేగా ఎన్నికైన తండ్రి గుమ్మడి నర్సయ్య నేర్పించిన 'విలువల పాఠాలే' స్ఫూర్తిగా స్వయంకృషితో ఎదిగిన ఆమెతో 'నవ్య' సంభాషణ

"ఖమ్మం జిల్లా టేకుల గూడెం మా ఊరు. మాది మధ్యతరగతి వ్యవసాయకుటుంబం. నాకు ఒక అన్నయ్య, ఒక అక్క. అన్నయ్య వ్యవసాయం చేస్తారు. అక్క మా ఊరికి దగ్గరిలోనే టీచర్‌గా పనిచేస్తుంది.

అమ్మే వ్యవసాయం చేసింది...

మా చిన్నతనం ఎన్నో ఒడిదుడుకులతో గడిచింది. నాన్న పార్టీ (సిపిఐ-ఎంఎల్)కార్యకలాపాల్లో మునిగితేలుతుండేవారు. ఆయనకు ప్రజల్లో మంచి ఆదరణ ఉండేది. ఎంతో నిజాయితీపరుడన్న పేరుండేది. పార్టీ సిద్ధాంతానికి అనుగుణంగా ఎంతో నిబద్ధతతో పనిచేస్తారని పార్టీ వర్గాల్లో కూడా మంచి అభిప్రాయం ఉండేది. ఆయన ఎప్పుడూ ప్రజలతో మమేకమై పనిచేసేవారు. ఎక్కడ తన అవసరముంటే అక్కడ వాలేవారు. ఆయన ఇంట్లో ఉండడం చాలా అరుదు. అందుకే ఆయనతో మేం గడిపిన రోజులు అంతంతమాత్రమే. సెలవుల్లో కూడా మేం ఆయన్ని చూసింది లేదు. అమ్మే అన్నీ తానై మమ్మల్ని చూసుకునేది. అందుకే అమ్మతోనే మాకు దగ్గరితనం ఎక్కువ. నాన్న ఎప్పుడూ ప్రజా సేవలో తిరగడంతో అమ్మే (పేరు అమ్మక్క) వ్యవసాయం చేసింది. కుటుంబ భారాన్ని మోసింది. అన్నయ్య వ్యవసాయంలో అమ్మకు తోడుగా నిలిచాడు.

సమానంగా చూశారు..

అమ్మానాన్నలు ఆడ, మగ అన్న తేడా లేకుండా మమ్మల్ని పెంచారు. రెండవ తరగతి వరకూ నేను మా ఊరులోనే చదివాను. మూడవ తరగతి నుంచి ఇంటర్ వరకు సుదీమత్తెలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివాను. ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ (హెచ్‌ఇపిగ్రూపు) పూర్తిచేశాను. తర్వాత ఓయు క్యాంపస్‌లో ఎల్ ఎల్ బి, ఎల్‌ఎల్ ఎం పూర్తిచేశాను. ప్రస్తుతం ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ పర్యవేక్షణలో 'ట్రైబల్ ప్రాపర్టీ రైట్స్ ఇన్ తెలెంగాణా, స్పెషల్ రెఫరెన్స్ టు ఖమ్మం' అన్న అంశంపై పిహెచ్‌డి చేస్తున్నాను. ఎస్టీ బ్యాక్‌లాగ్ అధ్యాపక ఉద్యోగాల నియామకంలో నాకు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం వచ్చింది. అందులో చేరాను. రీ-నోటిఫికేషన్ ద్వారా బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను పూర్తిచేశారు. ఒక ఆదివాసి మహిళ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకం కావడం ఇదే తొలిసారి. తెలంగాణాలోనే కాదు ఆంధ్రలో కూడా ఈ ఉద్యోగం చేపట్టిన తొలి ఆదివాసీ మహిళను నేనే కావడం ఎంతో సంతోషంగా ఉంది.

నాన్న ప్రభావం ఎంతో...

నా విషయానికి వస్తే మా నాన్ననకు నన్ను 'లా' చదివించాలని, అక్కను డాక్టరు చేయాలని ఉండేది. కానీ నాకు మటుకు ఐపిఎస్ అవాలని ఉండేది. అది చేయాలంటే కోచింగ్ సెంటర్లకు వెళ్లాలి. అవి నగరంలోనే ఉంటాయి. అందుకని నేను హైదరాబాదు వచ్చాను. నేను సివిల్స్‌లో ప్రవేశించాలనుకోవడానికి కారణం ప్రజలకు సేవ చేయాలని. ప్రజాస్వామిక అంశాలన్నీ దేశంలో అమలు అయ్యేలా కృషిచేయాలని. కానీ 'సర్వీసు నీ లక్ష్యమైతే లా కోర్సు చేస్తేనే బాగుంటుంద'ని నాన్న సూచించారు. నిజానికి నేను ఒక సంవత్సరం పాటు సివిల్స్ శిక్షణ కూడా తీసుకున్నాను. కానీ తర్వాత సివిల్స్ ఫార్మేట్ మారడంతో ఆ ఆలోచన వదిలేశాను. 2009లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌బి చేరాను. చిన్నప్పటి నుంచి టీచర్లు, నాన్న నాకు మంచి మార్గదర్శకత్వం చేశారు. ఒక దశలో చదువుమానేయాలనుకున్న నన్ను దారి తప్పకుండా కొమ్ముకాసారు.

నా చదువు విషయంలోనే కాదు, ప్రజల సమస్యలపై పోరాడడంలో కూడా నాకు స్ఫూర్తి నిచ్చింది మా నాన్నే. మేము ఎమ్మెల్యే బిడ్డలమైనా ఆ భావం మాలో ఎన్నడూ రానీయకుండా సాధారణ మధ్యతరగతి వారి లాగే పెంచారాయన. నేను చదివే స్కూల్లో కూడా టీచర్లు నన్ను ప్రత్యేకంగా చూడలేదు. అందరి పిల్లలతో సమానంగానే చూసేవారు. ఇక్కడ మీకొక సంఘటన చెప్పాలి. ఒకసారి ఒకావిడ మా స్కూలుకు వచ్చి 'ఇక్కడ గుమ్మడి నర్సయ్య పిల్లలు చదువుతున్నారట. చూపిస్తారా' అని మా టీచర్‌ను అడిగింది. అప్పుడే అటుగా వచ్చిన నన్ను చూపిస్తూ 'ఈ అమ్మాయి గుమ్మడి నర్సయ్య కూతురు' అని మా టీచరు చెప్పారు. అప్పుడు నేను ఏడవ తరగతి చదువుతున్నాను. ఆమె మమ్మల్ని ఎందుకు చూడాలనుకుంటోందో అప్పుడు నాకు తెలియదు. నేను ఇంటర్ చదువుతున్నప్పుడు తెలిసింది మా నాన్న ఎమ్మెల్యే అని. ఆయన ఎప్పుడూ 'మనం వచ్చిన దారిని మర్చిపోకూడదు' అని చెప్పేవారు. అంతేకాదు నిరాడంబరంగా జీవించాలనేవారు. జనాల మధ్య ఉంటే సమాజం గురించి తెలుస్తుందని

పిడిఎస్‌యులో సభ్యురాలిగా...

పిడిఎస్‌యులో చేరడం నా జీవితంలో మరో మలుపు. 3 నుంచి 12 వ తరగతి వరకూ హాస్టల్‌లోనే ఉండి చదివాను. అక్కడ మాకు చదువుతో పాటు ప్రత్యేకంగా మోటివేషనల్ క్లాసులు నిర్వహించేవారు. అక్కడ ఉన్నప్పుడే నేను అనుకోకుండా మా నాన్న పార్టీకి అనుబంధమైన పిడిఎస్‌యులో చేరడం జరిగింది. అదెలా అంటే ఒకసారి మా స్కూల్లో ఒక అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది. దానిపై పిడిఎస్‌యు వాళ్లు బాగా పోరాడారు. ఆ సందర్భంలోవాళ్లు నన్ను కలిశారు. ఆ అమ్మాయికి న్యాయం జరిగేలా , వారి కుటుంబానికి ఆర్థిక సహాయం, ఉపాధి కల్పన అందేలా పోరాడమన్నారు. మేం చాలా సీరియస్‌గా రెండు రోజులు పోరాటం చేసి విజయం సాధించాం. ఆ సంఘటనప్పుడే వాళ్లు నాకు తెలియకుండానే నా పేరును పిడిఎస్‌యు సభ్యత్వంలో రాసారు. అది తెలిసిన నేను ఇలా ఎందుకు చేశారని అడిగాను. అప్పుడు వాళ్లు నన్ను వాళ్ల క్లాసెస్‌కు తీసుకెళ్లారు. పలు సామాజిక అంశాలపై ఆ పార్టీ అవగాహన కల్పిస్తున్న తీరు, పోరాటం నచ్చింది.

నాలో బలాన్ని పెంచాయి...



చదువు గురించి నాన్న చెప్పిన మాటలు నన్నెంతో బలంగా తయారుచేశాయి. ఆయన 'పోరాడుతూ చదవాలి. చదువుతూ పోరాడాలి' అన్న మాటలు నామీద మంత్రంలా పనిచేశాయి. దీనికి ఒక ఉదాహరణ చెప్తాను. నేను డిగ్రీ ఒక కాలేజీలో చదవాలనుకున్నాను. కానీ ఆ కాలేజీ వాళ్లు పది వేల రూపాయల డబ్బులు (సంవత్సరానికి) అడిగారు. నాన్నను 30 వేలు ఇమ్మనమని అడిగాను. దానికి నాన్న 'డబ్బులు ఇవ్వాలా' అని ఎదురు ప్రశ్నించారు. ఆ ప్రశ్నలో నాకు ఎన్నో అర్థాలు స్ఫురించాయి. అప్పుడు నేను 'నాకేమీ మీరు డబ్బులు ఇవ్వక్కర్లేదు. ఇల్లెందులో మీరు కట్టించిన ప్రభుత్వ కళాశాల ఉంది కదా. అందులోనే డిగ్రీ చదువుకుంటాను' అని సమాధానం చెప్పాను. అలానే అక్కడ చదువుకున్నాను ఎవ్వరి మీదా ఆధారపడకుండా. సాధారణంగా తల్లిదండ్రులు తాము పడ్డ కష్టాలు పిల్లలు పడకూడదనుకుంటారు. కానీ మా నాన్న తనుపడ్డ కష్టాల గురించి పిల్లలకు తెలియాలని భావించేవారు. అంతేకాదు మంచి విలువలు ఎప్పుడూ మనతోనే ఉండాలనేవారు. అప్పుడే సమాజం మన వెంట వస్తుందని చెప్పేవారు. ఒకసారి 'నాకు పుస్తకాలు ఉంటే ఇంట్లోనే బాగా ప్రిపేర్ అవొచ్చు నాన్నా' అన్నాను. దానికి ఆయన వెంటనే 'నీకు పుస్తకాలు అవసరమనుకుంటే నేను పాలేరుగా పనిచేస్తూ నిన్ను చదివిస్తాను' అని అన్నారు. ఆ మాటలు ఎమ్మెల్యేగా ఉండి కూడా ఆయన అన్నారు. నాన్న మమ్మల్ని చదివించారు. దానికి మించిన ఆస్తి మరేముంటుంది?

వివక్షను చవిచూశా...

నగరంలో ఆదివాసీల పట్ల వివక్ష చూపడం గమనించా. దీనికి ఒక ఉదాహరణ చెపుతాను. మా కాలేజీ ప్రిన్సిపాల్ నన్ను ఎన్నో ఇబ్బందులకు గురిచేశారు. నేను 'కొన్ని క్లాసులు నాకు ఇవ్వండి. డబ్బులు తీసుకోకుండానే పాఠాలు చెబుతాను. నాకు అనుభవం వస్తుంది' అని ఆయన్ని అడిగాను. దానికి ఆయన చెప్పిన సమాధానం ఏమిటో తెలుసా 'ఆర్‌జెఎన్‌ఎఫ్ (రీసెర్చ్ స్కాలర్‌షిప్) వదులుకుంటే క్లాసులు ఇస్తానన్నారు. నిజానికి ఆర్‌జెఎన్‌ఎఫ్, జిఆర్‌ఎఫ్ విద్యార్థులకు కొన్ని క్లాసులు కేటాయించాలన్న నిబంధన ఉంది. కానీ దాన్ని ఆయన అతిక్రమించారు. అడిగేవాళ్లెవరు?

ఉద్యమాల్లోనూ ముందున్నా...

పిడిఎస్‌యు చేసిన ఉద్యమాల్లో పాల్గొన్నాను. విద్యా అంశాలపై పోరాడాను. డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలని చేసిన పోరాటంలో పాల్గొన్నాను. తెలంగాణా పోరాట సమయంలో నిరాహారదీక్షలు, నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నాను. నా లక్ష్యం ఆదివాసీలలో విద్య అభివృద్ధిచెందేలా కృషి చేయడం. చదువుకుంటే ఏ సమస్యనైనా ఎదుర్కోగలం. నేను ఆదివాసీని కాబట్టి ఆ బాధ్యత నాపై మరింత ఉందనుకుంటున్నాను.

• **నవ్య డెస్క్**, ఫోటోలు: **సాల్మన్ రాజ్**

ఇప్పటికీ వారి బతుకులు మారలేదు..

నన్ను ఎంతగానో బాధించే అంశం స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ఆదివాసీ బతుకు చిత్రం మారకపోవడం. వారికి నిజమైన స్వాతంత్ర్యం ఇంకా రాలేదు. వారి పేదరికం పోలేదు. అనారోగ్యాలు వారిని వెన్నాడుతూనే ఉన్నాయి. విద్య ఇంకా వారికి అందని ఫలంగానే ఉంది. వారి గూడాలు ఎలాంటి అభివృద్ధికీ నోచుకోవడంలేదు. అడవుల్లోని వారి భూములను నాన్ ట్రైబల్స్ ఆక్రమించుకుంటున్నారు. ఆదివాసీ భూములను నాన్‌ట్రైబల్స్‌కు అమ్ముతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, ఉద్యోగావకాశాలు కూడా ఆదివాసీల్లో కొద్దిమందికి మాత్రమే అందుతున్నాయి. వారి హక్కులు, ఆదేశిక సూత్రాలు మాటలకే తప్ప చేతలకు నోచుకోవడం లేదు. వారికి సమాన అవకాశాలు అందడం లేదు. వారిలో హక్కుల చైతన్యం, అవగాహన అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఆదివాసీ ప్రాంతంలో ప్రతి అంశంలో పంచాయతీ రాజ్ షెడ్యూల్డ్ ఏరియాస్ యాక్ట్ అతిక్రమణకు గురవుతోంది. పట్టాలు లేని పోడు భూములను బయటివారు ఆక్రమించడంతో ఆదివాసీలకు నష్టపరిహారం కూడా లభించడంలేదు. మైనింగ్, ప్రాజక్టులు, పరిశ్రమలు చేపట్టడం వల్ల ఆదివాసీలు భూమిని కోల్పోతున్నారు. నిరాశ్రయులవుతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సమస్యలు ఆదివాసీలను నేటికీ వెన్నాడుతున్నాయి.

అప్‌డేట్

కలర్‌ఫుల్ వాట్సప్



ఫేస్‌బుక్‌లో మాదిరిగా వాట్సప్‌లోనూ కలర్‌ఫుల్ టెక్ట్స్ అప్‌డేట్స్‌ను పోస్ట్ చేయొచ్చు. ఈ ఫీచర్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వాట్సప్ ప్రకటించింది. ప్రస్తుతం ఈ ఫీచర్ బేటా యూజర్స్‌కు మాత్రమే అందుబాటులో ఉంది. వాట్సప్ బేటా వెర్షన్ 2.17.291లో ఈ ఫీచర్ అందుబాటులో ఉంది. వాట్సప్ కొత్త వెర్షన్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే న్యూ స్టేటస్ అప్‌డేట్ కనిపిస్తుంది. ఇక్కడ మూడు ఆప్షన్లుంటాయి. ఫాంట్, బ్యాక్‌గ్రౌండ్ కలర్, ఎమోజిల్లో మీకు నచ్చినది ఎంచుకోవచ్చు. దాదాపు ఫేస్‌బుక్‌లో మాదిరిగానే బ్యాక్‌గ్రౌండ్ కలర్ ఎంచుకోవడం ఉంటుంది. బ్యాక్‌గ్రౌండ్ కలర్‌తో స్టేటస్‌ను పోస్ట్ చేయాలనుకునే వారు ముందుగా స్టేటస్ అప్‌డేట్ బాక్స్‌లోకి వెళ్లాలి. దానిపై ట్యాప్ చేస్తే 'వాట్స్ ఆన్ యువర్ మైండ్?' అని మెసేజ్ కనిపిస్తుంది. ఇప్పుడు కలర్ ప్యాలెట్‌లో నుంచి కలర్ బ్యాక్‌గ్రౌండ్‌ను ఎంచుకోవాలి. తరువాత టెక్ట్స్ టైప్ చేసి పోస్ట్ చేయాలి.

కొత్త రుచి

పైనాపిల్ చికెన్



తాజాగా స్పైన్ యాపిల్ ఫుడ్ ట్రెండ్ ఇన్‌స్టాగ్రమ్‌లో అందరినీ ఆకట్టుకుంటోంది. సరికొత్త రీతిలో ఆహారాన్ని తినటంలో అమెరికన్లు ముందుంటారు. ఇంతకీ ఈ స్పైన్ ఆపిల్ ఫుడ్ గురించి తెలుసుకోవాలంటే... పెద్ద పైనాపిల్‌ను తీసుకుని పైన కట్ చేయాలి. ఆ తర్వాత కత్తితో హోల్ చేసి అందులో చికెన్, మటన్ లాంటి స్టఫ్‌ను తురమాలి. ఆ తర్వాత పైన ముక్కను చిన్నపాటి పుల్లలతో అతికించాలి. ఆ పైనాపిల్‌ను నిప్పుల మంట చిన్నగా తగిలేట్లు బాగా గ్రిల్ చేయాలి. అదే స్పైన్ యాపిల్ అవుతుంది. ఎంచక్కా.. హాయిగా పైనాపిల్‌ను కట్ చేసుకుని వేడివేడిగా తినటమే తరువాయి.

నగ ధగ

నిత్యం కొత్తవే!






ఎంతో డబ్బు పోసి కొన్న నగలు కలకాలం వన్నె తగ్గకుండా ఉండాలంటే వాటిని బద్రపరిచేటప్పుడు, శుభ్రం చేసేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ పాటించాలి. సాదా, రాళ్ల నగలు, పోల్కి, అన్‌కట్ నగల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే అవి ఎప్పటికీ కొత్తవిలా మెరిసిపోతూ ఉంటాయి. అందుకోసమే ఈ చిట్కాలు!

- స్నానానికి ముందు నగలను తీసేయాలి. సబ్బులు, షాంపూలలోని రసాయనాలు నగల మీద పైపూతలా అతుక్కుపోయి వాటి మెరుపును తగ్గిస్తాయి. ఇక అడుగున వెండి ఫాయిల్ ఉండే కమ్మలు, గాజుల విషయంలో ఆ సిల్వర్ ఫాయిల్ ఆక్సిడైజ్ అయిపోయి నల్లగా తయారవుతుంది.
- మేకప్ వేసుకునేముందు కాకుండా తర్వాత నగలు వేసుకోవాలి. హెయిర్ స్ప్రే, పర్ఫ్యూమ్‌లు, లోషన్లు మొదలైన సౌందర్య సాధనాలలోని రసాయనాలు నగలను డ్యామేజ్ చేస్తాయి. కాబట్టి వీటిని వాడిన ఐదు నిమిషాల తర్వాత నగలు ధరించాలి.
- వంట పని, తోట పని, రసాయనాలతో కూడిన పనులు చేసేటప్పుడు నగలు వేసుకోకూడదు.
- ఆటలు ఆడేటప్పుడు, ఈత కొట్టేటప్పుడు కూడా నగలు తీసేయాలి. ఈత కొలనులోని నీటిలో ఉండే క్లోరిన్ వల్ల నగలు పాడవుతాయి.
- సాదా నగలను శుభ్రం చేయటం కోసం గోరువెచ్చని నీటిని వాడాలి. రాళ్ల నగలను శుభ్రం చేయటానికి చల్లని నీరే వాడాలి.
- నగలను పాలిష్ చేయటం కోసం ప్రత్యేకించిన పాలిషింగ్ క్లాత్‌నే వాడాలి.
- విరిగిన, డ్యామేజ్ అయిన నగలను రిపెయిర్ చేయించకుండా శుభ్రం చేయకూడదు.
- పోల్కి జ్యువెలరీని దూదిలో చుట్టి జిప్‌లాక్‌లో వేసి గాలి చొరబడని ప్లాస్టిక్ డబ్బాల్లో బద్రపరచాలి. ఈ నగలను చుట్టడానికి వెల్వెట్ క్లాత్ వాడితే నగల్లోని సిల్వర్ ఫాయిల్ నల్లగా మారుతుంది. నగలూ వన్నె తగ్గుతాయి.
- వజ్రాల నగలను షాంపూ కలిపిన నీటితో శుభ్రం చేసి తర్వాత ఎక్కువ నీటిలో కడగాలి. సబ్బులు వాడితే వాటిలో ఉండే మాయిశ్చరైజర్ వల్ల వజ్రాల మీద సబ్బు పొరలా ఏర్పడుతుంది.
- నగల్లోని మలినాలు, మట్టిని తొలగించటానికి మెత్తని బ్రష్, టూత్‌పిక్ వాడాలి.
- నగలు బద్రపరిచే వెల్వెట్ బాక్సుల వల్ల కుందన్, అన్‌కట్ పోల్కి నగలు నల్లగా తయారవుతాయి. అయితే ఈ నలుపును పాలిష్ చేయించి తొలగించుకోవచ్చు.
- పోల్కి నగలను శుభ్రం చేయటానికి మెత్తని క్లాత్, ఎరేజర్ లేదా రబ్బర్ ఉపయోగించి నగలను రుద్దాలి. ఇలా చేయటం వల్ల మరకలు వదులుతాయి. పోల్కి నగలను ఎట్టి పరిస్థితుల్లోనూ నీళ్లతో శుభ్రం చేయకూడదు.
- కుందన్ నగలు కింద పడితే విరిగిపోతాయి. కాబట్టి వాటిని చాలా జాగ్రత్తగా వాడాలి.
- 22 క్యారెట్ల నగలు సున్నితంగా ఉంటాయి. కింద పడితే జాయింట్లు ఊడిపోతాయి. కాబట్టి వాటిని కూడా కింద పడకుండా చూసుకోవాలి.
- నగలను తేమ ప్రదేశంలో ఉంచకూడదు. అలాగే సూర్యరశ్మి నేరుగా తగిలే చోట కూడా ఉంచకూడదు. సూర్యరశ్మి ఎక్కువ సేపు సోకితే నగల్లో పొదిగిన రాళ్ల సెట్టింగ్ దెబ్బతింటుంది.



మంజులా రావు,
మంజుల జ్యువెల్స్,
9550545432

మైగ్రేన్‌కు హోమియో బెస్ట్



హార్మోన్ సమస్యలకు సరైన పరిష్కారం





లైఫ్ లెసన్

మార్లిన్ మన్రో 36 ఏళ్లకే సూసైడ్ చేసుకుంది. కానీ, బతికినన్నాళ్లూ ఆమె ఓ హాట్ బాంబ్. హాలీవుడ్ చిత్రాల అసలైన శృంగార తార!

కసితీరా గెలిచింది!

పుట్టింది 1926 జూన్ 1.. అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో. తండ్రి ఎవరో తెలియదు- తల్లి గ్లాడిస్‌కి అనేకమందితో సంబంధాలు ఉండటం వల్ల! మార్లిన్ అసలు పేరు నోర్మాజీన్. ఓసారి గ్లాడిస్ మెదడుకు జబ్బు చేసింది. మతి తప్పింది. దాంతో రెండేళ్ల కూతురిని స్నేహితురాలికి ఇచ్చేసింది. పెంచుకోమంది. అక్కడే అయిదేళ్లు పెరిగింది నోర్మా. అంతా బాగుంది. అంతలో గ్లాడిస్ తిరిగొచ్చింది. నా పాపని నాకివ్వమంటూ పట్టుపట్టింది. గొడవపడి మరీ ఏడేళ్ల నోర్మాను పట్టుకుపోయింది.

తీరా గ్లాడిస్‌కి పిచ్చి ముదిరింది. తన కూతురిని ఎవరో తీసుకుపోతారన్న వెర్రి భ్రమ. అందుకే నోర్మాను సంచిలో దాచేసేది. తలుపు వెనక్కి తోసేసేది. పుస్తకాల బీరువా వెనుక ఉంచేసేది. భయంకరమైన బాల్యం. అనుక్షణం భయం-భయం. నోర్మాకు 12 ఏళ్లు వచ్చేసరికి అమ్మకు పూర్తిగా మతి తప్పింది.

నోర్మా వీధిన పడింది. గ్లాడిస్ స్నేహితురాలు గ్రేస్ ఆమెను చేరదీసింది. తనకు పెంచే స్థోమత లేదు. అందుకే నోర్మాను వాళ్లింట్లోనూ, వీళ్లింట్లోనూ పెంచింది. ఎక్కడ ఉంచినా... ఆ ఇళ్లల్లోని మగాళ్లు రహస్యంగా నోర్మాపై అత్యాచారం చేసేవారు. ఎవ్వరికీ చెప్పుకోలేని స్థితి. చెప్పలేనంత బాధ. కొంత కాలానికి నోర్మాను తనింట్లోనే ఉంచుకుంది గ్రేస్. అక్కడ గ్రేస్ భర్త ఓ పశువు. నోర్మాపై కామత్వం తీర్చుకున్న సందర్భాలు ఎన్నో! ఎన్నిసార్లు మౌనంగా ఏడ్చిందో నోర్మా. ఎవరిని చూసినా భయమే! ఎప్పుడూ ఒంటరిగా ఉండిపోవాలన్న కోరిక. ఎవరితో మాట్లాడితే ఏం జరుగుతుందో అన్న సంకోచం. బిడియం, సిగ్గు, తనలో తానే ముడుచుకుపోవడం! కుంచించుకుపోవడం, తలుపులన్నీ వేసేసుకొని బిగ్గరగా ఏడ్వడం, చివరకు తనకే తెలియకుండా నోర్మాకు నత్తి వచ్చింది.

ఇంతటికీ కారణం తనకో తోడు లేకపోవడం. అందుకే పక్కింట్లోని 21 ఏళ్ల జేమ్స్‌ని ప్రేమించి పెళ్లి చేసుకుంది. అప్పటికి నోర్మాకు 16 ఏళ్లు. ఎన్నెన్నో కలలు- ఇంకెన్నో ఊహలు. పెళ్లయ్యాక స్వర్గం చూడొచ్చనుకుంది. కానీ, ఆమె ఆశలు ఆవిరయ్యాయి. జేమ్స్ ఎప్పుడూ మౌనంగా, ముభావంగా ఉండేవాడు. అంతా నైరాశ్యమే! దగ్గరికి చేరదీసేవాడు కాడు. అందుకే అంటుంది నోర్మా- "ఒక స్త్రీని పురుషుడు నవ్విస్తే చాలు- ఆమె ప్రపంచాన్ని జయిస్తుంది" అని.

మళ్లీ ఓడిపోయింది నోర్మా!

1946లో 20 ఏళ్ల నోర్మా విడాకులు ఇచ్చేసింది. ఇప్పుడేం చేయాలి? ఎక్కడికి వెళ్లాలి? ఏ దేహంపై ఈ ప్రపంచం దాడి చేసిందో.. అదే తనకు అస్త్రం అని అనుకుంది. అందాల ఆరబోతతో లోకాన్ని కాళ్లకింద తొక్కేయాలనుకుంది. కసితీరా నగ్నత్వాన్ని ప్రదర్శించాలని అనుకుంది. తొలిసారి న్యూడ్ క్యాలెండర్‌కి పోజులిచ్చింది. తన పవర్ ఏమిటో అర్థమైంది. సినిమాల్లోకి వెళ్లాలని నిశ్చయించుకుంది. అందుకోసం తనను తాను పదునైన, కనికరం లేని కత్తిలా మలుచుకోవాలనుకుంది.

దేహ సౌందర్యాన్ని ఇనుమడింపజేసే కసరత్తులు చేసింది. 200కి పైగా పుస్తకాలు తెప్పించుకుంది. కాచి వడబోసింది. నత్తిని పోగొట్టుకునేందుకు ప్రత్యేక శిక్షణ పొందింది. భాషపై, అభినయంపై జరిగే క్లాసులకు వెళ్లింది. మనసును ఉల్లాసపరుచుకునేందుకు బీథోవెన్ సంగీతం వింది. ఇప్పుడు తాను నోర్మాజీన్ కాదు! కొత్త అమ్మాయి. లోకం పోకడ తెలుసుకున్న అమ్మాయి. ప్రపంచానికి దయ లేదు, దాక్షిణ్యం లేదు. ప్రేమ లేదు. మానవత్వం అంతకన్నా లేదు. ఉన్నాయని నమ్మి లాభం లేదు! భయపడటం మూర్ఖత్వం. అందుకే తన పేరు మార్చుకుంది. అప్పటికే హాలీవుడ్‌లో టాప్ డ్యాన్సర్, బ్రాడ్‌వే స్టార్ మార్లిన్ మిల్లర్‌లోని మొదటి పేరుకు... చిన్నప్పుడు తనను ఆదరించిన ఏకైక వ్యక్తి, ఆయా పేరులోని 'మన్రో' కలిపి.. మార్లిన్ మన్రోగా అవతరించింది.


హాలీవుడ్ చిత్రాల్లో ఆఫర్లు రావడం మొదలెట్టాయి. మొదటి చిత్రం 'డేంజరస్ ఇయర్స్' (1947)లో చిన్న వేషమే. ఫరవాలేదు.. తన ఆయుధాలన్నీ ప్రదర్శించింది. అస్త్రాలన్నీ సంధించింది. ఒక్కొక్క చిత్రంలో క్రమంగా తన స్త్రీత్వంతో, నగ్నత్వంతో, దేహంతో.. ప్రపంచాన్ని దాసోహం చేసుకుంది. మెలికలు తిరిగిన పాదరసంలా మారింది. రెండు పెళ్లిళ్లు చేసుకున్నా.. అవీ పెటాకులయ్యాయి!

ప్రేమ రాహిత్యంతో రగిలిపోయింది మార్లిన్ మన్రో. అందరికీ పున్నమి పంచి తాను అమావాస్య అయింది. అందరికీ ఒయాసిస్సై తాను ఎడారిగా మిగిలింది. ప్రేమ లేని జీవితం వద్దనుకుంది. నిద్రమాత్రలు ఎక్కువగా మింగింది. నేల రాలింది ఓ శృంగార తార!

• ఆకెళ్ల రాఘవేంద్ర

తెలుసా!


పూలు మిగిల్చిన పుర్రెలు





కౌన్సెలింగ్

ఒంట్లో చక్కెర నిల్వలు పడిపోతే..



- డాక్టర్ డి. జె. కార్తిక్, జనరల్ ఫిజీషియన్

• విన్నర్స్

స్ఫూర్తి ప్రదాతలు..
ఈ పరిశోధకులు



పట్టా స్వీకరిస్తున్న సూర్య నారాయణ



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాసరావు


ఒకరు ఎనభైనాలుగేళ్ల వయసులో విద్యార్థిగా మారి పీహెచ్‌డీ పూర్తి చేశారు. మరొకరు అంధత్వాన్ని ఎదిరించి ఈ ఘనత సాధించారు. వీరిద్దరూ ఇటీవల ఆంధ్ర యూనివర్సిటీ స్నాతకోత్సవంలో డాక్టరేట్ పట్టాలను పుచ్చుకున్నారు. ఆ ఇద్దరి పేర్లు.. డాక్టర్ నూకల సూర్యనారాయణ, టీకేవీ శ్రీనివాసరావు. వయసు, వైకల్యం అడ్డుకాని ఆ నిత్య విద్యార్థుల అనుభవాలు..

చిరకాల స్వప్నం ఇది



డాక్టర్ నూకల సూర్యనారాయణ

కించపరిస్తే తట్టుకోలేకపోయా!



టీకేవీ శ్రీనివాసరావు

• వాసు, విశాఖపట్నం, ఫొటోలు: విజయ్, ప్రసాద్

ట్రావెల్ టిప్స్

ముందుగానే అడగండి



డైలీ సుడోకు - 149

8		3						9
	4			1	5		8	
	2						3	4
5			3					
	7						2	
				2				6
4	8						6	
	1		4	6			7	
9						8		2

ఎలా పూరించాలి?

నిన్నటి సుడోకు- 148 సమాధానం



సి.కల్యాణ్, వినాయక్, సాయిధరమ్‌తేజ్

మళ్లీ మెగా హీరోతోనే...

చిరంజీవితో 'ఖైదీ నంబర్ 150' తెరకెక్కించిన వి.వి.వినాయక్ ఎనిమిది నెలల తరువాత మళ్లీ మెగాఫోన్ చేతబట్టారు. ఈసారి వినాయక్ ప్రాజెక్ట్‌ను షురూ చేసింది మెగాస్టార్ మేనల్లుడు సాయిధరమ్‌తేజ్‌తో. ఈ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో మొదలైంది. ఓ వైపు బాలకృష్ణ చిత్ర నిర్మాణంతో బిజీగా ఉన్న సి.కల్యాణ్ ఈ చిత్రానికీ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లిమిటెడ్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ మెగాస్టార్ చిరంజీవిని ఆయన స్వగృహంలో కలిసి ఆశీస్సులు అందుకున్నారు. సాయిధరమ్‌తేజ్ మాతృమూర్తి విజయదుర్గ చేతుల మీదుగా వినాయక్ స్క్రిప్ట్‌ను అందుకున్నారు. ఈ చిత్రానికి కథ, మాటలు అందించిన ఆకుల శివ ఫస్ట్ షాట్‌ని డైరక్ట్ చేశారు. సెప్టెంబర్ మొదటివారంలో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. లావణ్య త్రిపాఠి నాయికగా నటిస్తున్నారు. సహ నిర్మాతలు: సి.వి.రావు, పత్స నాగరాజు.

భయపడుతూనే ఆయనకు కథ చెప్పా

- హను రాఘవపూడి



నితిన్, మేఘా ఆకాశ్ జంటగా హను రాఘవపూడి డైరెక్ట్ చేసిన చిత్రం 'లై'. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై వెంకట్ బోయినపల్లి సమర్పణలో రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట, అనిల్ సుంకర నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా హను మాట్లాడుతూ "నాకు తెలిసి లవ్ లేకుండా ఏ సినిమా ఉండదు. 'లై' కూడా ప్రేమ ప్రధానంగా నడిచే సినిమాయే. దానితో పాటు యాక్షన్ ఉంటుంది. లవ్‌స్టోరీ మేళవించిన రివెంజ్ డ్రామా అని చెప్పొచ్చు. 'అందాల రాక్షసి', 'కృష్ణగాడి వీరప్రేమగాథ' సినిమాల మధ్యలో వచ్చిన ఐడియా ఇది. ఎప్పట్నించో నాతో సినిమా చేయాలనుకుంటున్న నితిన్‌కు ఈ కథ చెప్పగానే కనెక్టయ్యారు. ఇప్పటి వరకూ చూడని పాత్రలో నితిన్ కనిపిస్తారు. ఆయన లుక్స్, పెర్ఫార్మెన్స్ బాగా ఆకట్టుకుంటాయి. కథ ప్రకారమే అమెరికాలో ఎక్కువ షూటింగ్ జరిపాం. డిఫరెంట్ షాట్ మేకింగ్‌తో సినిమాని రూపొందించాం. ఇందులో విలన్ కేరక్టరైజేషన్ ఎప్పట్నించో నా మైండ్‌లో ఉంది. ఆ కేరక్టర్‌కు అర్జున్‌గారైతే బాగుంటుందని అనిపించింది. భయపడుతూనే ఆయనకు కథ చెప్పాను. వినగానే చేస్తానని చెప్పారు. ఆయన కేరక్టర్ చాలా స్టయిలిష్‌గా ఉంటుంది. సినిమాకు సెంటర్ పాయింట్ ఆయన పాత్రకు సంబంధించిన మానసిక స్థితి. నితిన్ మార్కెట్ విలువను బట్టే సినిమా తీశాం. నిర్మాణ విలువలు అంత చక్కగా ఉంటాయి. డైరెక్టర్‌గా నా జర్నీని ఆస్వాదిస్తున్నా. జయాపజయాలకు లొంగిపోను. నానితో ఓ సినిమా చేయబోతున్నా. ఆర్మీ నేపథ్యంలో నడిచే కథ. లడఖ్‌లో షూటింగ్ చేయాలి కాబట్టి వచ్చే ఏడాది మే నెలలోగా షూటింగ్‌కు వెళ్లలేం. నాని కూడా వేరే సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ మధ్యలో వీలైతే ఓ సినిమా చేస్తాను" అని చెప్పారు.


MIRYALA SATHYANARAYANA REDDY PRESENTS
DWARAKA CREATIONS
రేపే విడుదల
జయ జానకి నాయక
MIRYALA RAVINDER REDDY BOYAPATI SREENU
DEVI SRI PRASAD
CHITYALA SAIKUMAR REDDY
RISHI PUNJABI SAHI SURESH KOTAGIRI VENKATESWARA RAO RAM-LAXMAN PREM RAKSHITH VAMSI SHEKAR
Junglee MUSIC


DR. D.RAMANAIDU PRESENTS
రేపే విడుదల
BLUE PLANET Entertainments
నేనే రాజు నేనే మంత్రి
TEJA
SURESH BABU KIRAN REDDY BHARATH CHOWDARY
ANUP RUBENS VENKAT C.DILIP KOTAGIRI VENKATESWARA RAO PARCHURI BROTHERS
LAXMI BHUPALA NARAYAN REDDY SURENDRA KRISHNA SHANKAR RAVI VERMA
PANTHER NAGARAJ VIVEK KUCHIBOTLA ABHIRAM DAGGUBATI
A SURESH PRODUCTIONS (P) LTD AND BLUE PLANET ENTERTAINMENTS LLP PRODUCTION
U/A

నేడు ఢిల్లీకి కేసీఆర్

- వెంకయ్య ప్రమాణ స్వీకారానికి హాజరు
- జీఎస్టీపై ప్రధాని, కేంద్ర మంత్రులతో భేటీ
- పోచంపాడు చేరుకున్న ముఖ్యమంత్రి
- నేడు 'శ్రీరాంసాగర్'కు శంకుస్థాపన



హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సీఎం కేసీఆర్ గురువారం రాత్రి ఢిల్లీ వెళ్లనున్నారు. శుక్రవారం ఉప రాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరవుతారు. ప్రధాని మోదీతో పాటు ఆర్థిక, రక్షణ శాఖ మంత్రి అరుణ్ జైట్లీ, హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ కానున్నారు. ఇప్పటికే అమలులో ఉన్న ప్రాజెక్టులకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలు చేయరాదని కోరతారు. దీనికి సంబంధించి లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్ కుమార్ సిద్ధం చేశారు. ఏయే ప్రాజెక్టులపై ఎంత ప్రభావం పడుతోందో అంచనాలు రూపొందించారు. అమలులో ఉన్న ప్రాజెక్టులపై వేల కోట్ల భారం పడనుందని నివేదించనున్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, గృహ నిర్మాణం, నీటి పారుదల ప్రాజెక్టులపై జీఎస్టీని తగ్గించాలని, దీర్ఘకాల ప్రయోజనాలతో వీటిని నిర్మిస్తున్నామని చెప్పనున్నారు. ఒకవైపు తలెత్తే నష్టాన్ని భరిస్తూనే.. జీఎస్టీ రద్దు కోసం పోరాటం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నోట్ల రద్దు, జీఎస్టీ, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తాము ఇచ్చిన మద్దతును గుర్తుచేస్తూ ఈ నివేదిక ఉండనుంది. ప్రధాని స్పందన తర్వాతే న్యాయ పోరాటంపై నిర్ణయం తీసుకోనున్నారు. తెలంగాణ సచివాలయానికి బైసన్ పోలో గ్రౌండ్‌ను ఇవ్వాలని, స్థలం అప్పగింత ప్రక్రియ సత్వరం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేయనున్నారు. కాగా, రూ.1170 కోట్లతో చేపట్టనున్న శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకం శంకుస్థాపనకు హాజరుకావడానికి వీలుగా బుధవారం సాయంత్రమే సీఎం పోచంపాడుకు చేరుకున్నారు. కరీంనగర్ జిల్లాలో శంకుస్థాపన జరుగనుండగా.. పోచంపాడులో బహిరంగ సభ నిర్వహిస్తున్నారు.

నీటి విడుదలపై కర్ణాటక సానుకూలం

- హరీశ్‌రావు లేఖపై స్పందన

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తాగునీటి అవసరాల కోసం 15 టీఎంసీల నీటిని విడుదల చేయాలని మంత్రి హరీశ్‌రావు చేసిన విజ్ఞప్తికి కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో నీటి మట్టాలు అట్టడుగుకు చేరడంతో నల్లగొండ, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా ఇబ్బందిగా మారింది. దాంతో నీటిని దిగువకు విడుదల చేయాలని హరీశ్‌రావు కర్ణాటక ఇరిగేషన్ శాఖ మంత్రి పాటిల్‌కు లేఖ రాశారు. ఈ లేఖను బుధవారం నాగార్జునసాగర్ సీఈ ఎస్. సునిల్ మంత్రి పాటిల్‌ను కలిసి ఇచ్చారు. ఈ సందర్భంగా పాటిల్ మాట్లాడుతూ కర్ణాటకకు చెందిన కృష్ణా భాగ్య జల నిగమ్ ఎండీతో చర్చించి దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా, రాజోలి బండ డైవర్షన్ స్కీం(ఆర్‌డీఎస్) పనులపై మంత్రి హరీశ్‌రావు కర్ణాటక, ఏపీ మంత్రులు పాటిల్, ఉమా మహేశ్వరరావుకు లేఖలు రాశారు.



సీఎం బహిరంగ సభకు ముస్తాబైన వేదిక

గోదారి రివర్స్



ఎస్సారెస్పీ

(మొదటి పేజీ తరువాయి)

సంతరించుకోనున్నాయి. వెరసి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఏడాది అంతా జల కళతో కళకళలాడనుంది. రైతులకు రెండు పంటలకు సాగునీరు అందనుంది. ప్రధాని నెహ్రూ శంకుస్థాపన చేసిన 53 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ ప్రాజెక్టుపై సీఎం కేసీఆర్ దృష్టి పెట్టారు. రివర్స్ పంపింగ్ విధానం ద్వారా ప్రాజెక్టును నింపే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆయకట్టును 9.2 లక్షల నుంచి 14.2 లక్షలకు పెంచారు. ఈ మేరకు రూ.1067 కోట్ల వ్యయమయ్యే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఎస్సారెస్పీ వరద కాల్వ (ఎఫ్ఎఫ్‌సీ)పై ఏర్పాటు చేయనున్న మూడు లిఫ్టులకు సీఎం కేసీఆర్ గురువారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ లిఫ్టులు పూర్తయితే.. మేడిగడ్డ నుంచి కాళేశ్వరం ప్రాజెక్టుకు తరలించే నీటిని ఎస్సారెస్పీలోకి తీసుకెళ్లడానికి అవకాశం ఉంది. ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక నీటి కొరత ఏర్పడినప్పుడు దిగువ నుంచి గోదావరిని తరలించనున్నారు. ఆ నీటిని గ్రావిటీ ద్వారా ఆయకట్టు భూములకు అందించనున్నారు. ఒకవేళ ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసి, వరదలు వచ్చి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండితే.. ఈ లిఫ్టుల ద్వారా నీటి పంపింగ్ నిలిపి వేస్తారు. పై నుంచి వచ్చే నీటినే గ్రావిటీ ద్వారా ఆయకట్టుకు అందిస్తారు. పునరుజ్జీవ పథకంతో ఆయకట్టు రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. మూడు లిఫ్టులూ పూర్తయితే, చివరి భూములకూ నీళ్ల అందించడమే కాదు.. ప్రస్తుత ఆయకట్టుకు అదనం గా మరో ఐదు లక్షల ఎకరాలకూ సాగునీరు అందనుంది. కొన్నిచోట్ల రెండు పంటలకు, మరి కొన్నిచోట్ల మూడో పంటకూ అవకా శం దక్కనుంది. ఏడాది వ్యవధిలోనే మూడు లిఫ్టులనూ పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ టార్గెట్ నిర్దేశించిన నేపథ్యంలో వచ్చే ఖరీఫ్ తర్వాత తమ పొలాల్లో బంగారం పండనుందని రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

పోచంపాడు ముస్తాబు

సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలోని పోచంపాడు ముస్తాబైంది. వరద కాల్వ వద్ద పథకం పైలాన్‌ను నిర్మించారు. ఉదయం 10.30 గంటలకు పోచంపాడు గెస్ట్‌హౌజ్ నుంచి బయలుదేరి సీఎం 11 గంటలకు పైలాన్ వద్దకు చేరుకుంటారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి నేరుగా పోచంపాడు ప్రాజెక్టును పరిశీలిస్తారు. వరద కాల్వ హెడ్ రెగ్యులేటర్‌ను అధికారులతో కలిసి పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు పోచంపాడు గెస్ట్‌హౌజ్‌కు చేరుకుంటారు. అక్కడే లంచ్ చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు గెస్ట్‌హౌజ్ పక్కన ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంతానికి చేరుకుంటారు. మూడు గంటల వరకూ జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఈ మేరకు పోచంపాడులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాగా, బుధవారం సాయంత్రం ఆరు గంటలకే సీఎం కేసీఆర్ పోచంపాడు చేరుకున్నారు. పార్టీ నేతలు, మంత్రులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

భారీ ఏర్పాట్లు

పోచంపాడులో సీఎం కేసీఆర్ బహిరంగ సభ నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సభ కోసం సుమారు 80 ఎకరాలను చదును చేశారు. సుమారు 2000 మంది పోలీసులతో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. లక్షలాదిగా తరలివచ్చే వారి కోసం బారికేడ్‌లను నిర్మించారు. సభ నిర్వహణకు కొన్ని రోజులుగా అధికార యంత్రాంగంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు దగ్గరుండి ఏర్పాట్లను చేస్తున్నారు. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, కరీంనగర్, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, సిరిసిల్ల జిల్లాల నుంచి భారీగా రైతులను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. సభ ఇన్‌చార్జి, మంత్రి ఈటల రాజేందర్‌తోపాటు జిల్లా మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. సీఎం ఒకరోజు ముందుగానే పోచంపాడుకు చేరుకోవడంతో బందోబస్తును హైదరాబాద్ రేంజ్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర, సెక్యూరిటీ వింగ్ ఐజీ ఎంకే సింగ్, డీఐజీ శివశంకర్‌రెడ్డి, సీపీ కార్తికేయ, ఇంటెలిజెన్స్ ఎస్పీ సాయిబాబాతో పాటు ఇతర అధికారులు పరిశీలించారు.

రివర్స్ పంపింగ్ హర్షణీయం



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నింపేందుకు చేపట్టిన రివర్స్ పంపింగ్ ఆలోచన హర్షణీయం. కాళేశ్వరం నుంచి వరద కాలువ ద్వారా నీటిని పంపింగ్ చేయడం వల్ల ఎల్లప్పుడూ నీరు సంవృద్ధిగా ఉంటుంది. వరద కాలువపై ఆధార పడి చాలా మంది రైతులు పంటలు సాగు చేశారు. ఈ ఏడాది ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులోకి చుక్క నీరు రాలేదు. దీంతో కాలువ ఆధారిత పంటలు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి. ఇకపై ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటి కోసం ఎదుచూడాల్సిన అవసరం ఉండదు. దీనిని త్వరితగతిన పూర్తి చేయాలి.

– ఏనుగు రవి, రైతు, వన్నెల్(బి) నిజామాబాద్ జిల్లా

పునరుజ్జీవంతో అదనపు ఆయకట్టు



ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన పునరుజ్జీవ పథకంతో ఈ ప్రాంతంలో అదనంగా మరో 80 వేల ఎకరాల ఆయకట్టు పెరుగుతోంది. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు ఏర్పడింది. ఈ పథకం పూర్తయితే కరువు ఉండదు. రోజుకో టీఎంసీ చొప్పున నీటిని పంపింగ్ చేయడం ద్వారా ప్రాజెక్టు జలకళను సంతరించుకోబోతోంది. కాలువల ద్వారా అవసరం ఉన్నప్పుడు నీటిని విడుదల చేసుకోవచ్చు. సాగు, తాగు నీటికి ఇబ్బంది ఉండదు. చెరువులు, కుంటలు నిండి భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి. రైతులకు ఈపథకం వరం లాంటిది.

– పార్శపు రాజేశ్వర్, రైతు, బాల్కొండ, నిజామాబాద్ జిల్లా



సీఎంకు స్వాగతం పలుకుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

కాల్వలకూ పునరుజ్జీవం

- ఆధునికీకరణకు 863 కోట్లు విడుదల చేసిన సర్కారు.. ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నిజామాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలోని ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ ఆధునికీకరణకు ప్రభుత్వం బుధవారం రూ.863 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో కాకతీయ, లక్ష్మి, సరస్వతి, సదర్‌మఠ్ ప్రధాన కాల్వలను ఆధునికీకరించనున్నారు. అలాగే, మొత్తం ప్రాజెక్టు పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థను కూడా ఆధునికీకరించి, నీటిని పొలాలకు తరలించనున్నారు. వచ్చే ఏడాదికల్లా ఈ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. టెండర్లను త్వరలోనే ఖరారు చేయనున్నారు. ఎస్సారెస్పీ కాల్వల ఆధునికీకరణకు వెయ్యి కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 200 కోట్లతో పనులు మొదలుపెట్టింది. తాజాగా 863 కోట్లు మంజూరు చేసింది. ఆధునికీకరణతో నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్ రూరల్, అర్బన్, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లోని రైతాంగానికి మేలు జరుగుతుంది. ఎస్సారెస్పీ పరిధిలోని స్టేజ్1 కింద 284 కిలోమీటర్ల పరిధిలోని 13.70 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ నిధులను వినియోగిస్తారు.

పునరుజ్జీవంలో ఐఐటీ సహకారం

- క్షేత్రస్థాయిలో నిపుణుల పరిశీలన
- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాతే సర్కారు నిర్ణయం

నిర్మల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) సాంకేతిక నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి రూపకల్పన చేసింది. గతంలో మాదిరిగా కాగితాలపై ప్రణాళికలు రచించే విధానానికి స్వస్తి పలికి, క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా ప్రణాళికలు రూపొందించింది. కాళేశ్వరం నుంచి ఎస్సారెస్పీకి నీటి మళ్లింపుపై తొలుత ఇరిగేషన్ అధికారులు పలు రకాల ప్రతిపాదనలు రూపొందించారు. వాటి సాధ్యాసాధ్యాలపై సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, సాగునీటి రంగ నిపుణులు అనేకసార్లు సమీక్షలు జరిపారు. చివరకు, ఆ బాధ్యతను ఐఐటీ నిపుణులకు అప్పగించారు. పలువురు ఐఐటీ నిపుణులు కాళేశ్వరం నుంచి ఎస్సారెస్పీ వరకూ పరిశీలన జరిపి సాంకేతికపరమైన, అనుకూల అంశాలను గుర్తించి ఈ బృహత్తర పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

రివర్స్ పంపింగ్‌తో బహుళార్థ సాధకం

శ్రీరాంసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు. ఎన్నో ప్రయోజనాలను ఉద్దేశించి దీనిని నిర్మించారు. కానీ, ఐదు దశాబ్దాల్లో ఏనాడూ అది తన లక్ష్యాన్ని చేరుకోలేదు. పునరుజ్జీవ పథకంతో ఇప్పుడు ఆ లక్ష్యం నెరవేరబోతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా నిన్న మొన్నటి వరకూ నిర్మల్ జిల్లాలోని సరస్వతీ కాలువకు మాత్రమే కాస్తో కూస్తో నీరందుతూ వస్తోంది. పునరుజ్జీవం పూర్తయితే, సరస్వతీ కాలువకు రెండు సీజన్లలో ఆటంకాలు లేకుండా నీరందడమే కాకుండా ప్రధానమైన హై లెవల్ కెనాల్‌కు, 32 ఎత్తిపోతల పథకాలకు నీరు అందుబాటులోకి రానుంది. భూగర్భ జలాలు కూడా గణనీయంగా పెరగనున్నాయి.

ప్రాణహాని ఉంది.. కాపాడండి

- 40 రోజులుగా కేటీఆర్‌కు మేం కనిపించలేదా ?
- నేరెళ్ల బాధితుల ఆవేదన



మీడియాతో మాట్లాడుతున్న హరీశ్, బానయ్య

వేములవాడ, ఆగస్టు 9: తమకు ప్రాణహాని ఉందని, కాపాడాలని నేరెళ్ల బాధితులు పెంట బానయ్య, కోల హరీశ్, పసుల ఈశ్వర్, గందం గోపాల్, చెప్యాల బాలరాజు, బత్తుల హరీశ్ వేడుకున్నారు. 40 రోజుల తరువాత పరామర్శ కోసం వచ్చిన స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్‌కు ఇన్ని రోజులూ తమ ఆక్రందనలు వినిపించలేదా అని ప్రశ్నించారు. కనీసం విచారం కూడా వ్యక్తం చేయలేదని వారు ఆవేదన వెలిబుచ్చారు. బుధవారం స్థానిక ఆస్పత్రిలో విలేకరులతో వారు మాట్లాడారు. తమతో మాట్లాడిన మంత్రి కేటీఆర్ స్పష్టమైన హామీ ఏదీ ఇవ్వలేదన్నారు. కరీంనగర్ జైలు సూపరింటెండెంట్, బీజేపీ నేతలు ఆదుకోకపోతే ఈ పాటికి తమ నెలదినం కూడా అయ్యేదని మంత్రికి చెప్పామని పేర్కొన్నారు. ఆస్పత్రి ఖర్చులు పెట్టుకుంటానని అన్నారని, అందుకు తాము తిరస్కరించామని చెప్పారు. ఇసుక రవాణా చేస్తున్న లారీల వల్ల ఎందరు చనిపోయారో తెలుసా అని మంత్రిని ప్రశ్నిస్తే, సమాధానం చెప్పకుండా.. త్వరలో ఇసుక రవాణా నిలిపివేయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇసుక లారీలను అడ్డుకుంటున్నందువల్లే కక్ష కట్టి తమను రాజకీయ కుట్రకు బలిచేశారని ఆరోపించారు. అన్ని విపక్షాల నాయకులు ఆస్పత్రికి వచ్చి తమను పరామర్శించారని చెప్పారు. జిల్లా ఎస్పీతో పాటు 18 మందిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కొందరు పోలీసు అధికారులతో తమకు, తమ కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని కోల హరీశ్ కోరారు.

నేరెళ్ల బాధితులకు మెరుగైన వైద్యం చేయించండి

- హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నేరెళ్ల బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఉమ్మడి హైకోర్టు బుధవారం ఆదేశించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో ఇసుకలారీల దహనం కేసులో పోలీసులు థర్డ్ డిగ్రీకి పాల్పడ్డారని, దళితులపై దాడి ఘటనకు సంబంధించిన కేసుల దర్యాప్తును సీబీఐ లేదా ప్రత్యేక బృందానికి అప్పగించాలని కోరుతూ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ పిల్ దాఖలు చేశారు. దీనిని విచారించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ ఉమాదేవిల ధర్మాసనం.. బాధితులకు వరంగల్ ఎంజీఎం వైద్యులతో చికిత్స చేయించాలని ఆదేశించింది. ఇందుకోసం ఇద్దరు వైద్యులను కేటాయించాలని, బాధితుల గాయాల తీవ్రతపైనా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. బాధితులు ప్రస్తుతం చికిత్స పొందుతున్న వేములవాడలోని మనోరమ ఆస్పత్రికి వైద్యులు వెళ్లి వైద్యం అందించాలని, మెరుగైన చికిత్స అవసరమని భావిస్తే నిమ్స్‌కు తరలించాలని పేర్కొంది. మొత్తం ఘటనపై తీసుకున్న చర్యలను వివరిస్తూ సమగ్ర నివేదిక సమర్పించాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. విచారణను 16వ తేదీకి వాయిదా వేసింది.

ఆల్మట్టికి తగ్గిన వరద



గద్వాల (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టుకు వరద నీరు భారీగా తగ్గింది. బుధవారం 3వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వచ్చింది. దీంతో నారాయణపూర్ నుంచి జూరాలకు, శ్రీశైలానికి నీటి రాకపై ఆశలు వదులుకునే పరిస్థితి నెలకొన్నది. ప్రస్తుతం ఆల్మట్టిలో 129.72 టీఎంసీల సామర్థ్యానికి గాను 128.19 టీఎంసీల నీరు ఉంది.. నారాయణపూర్‌లో 37.646 టీఎంసీలకు గాను 34.82టీఎంసీలు ఉంది. ప్రాజెక్టుకు 1,916 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 11,444 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జూరాల సామర్థ్యం 9.66 టీఎంసీలకు గాను 6.62 టీఎంసీల నీరు ఉంది.

బాసరలో బోసిపోయిన గోదారమ్మ



బాసర, ఆగస్టు 9 : నిర్మల్ జిల్లాలోని బాసర వద్ద గోదారమ్మ నీరు లేక బోసిపోయి కనిపిస్తోంది. ఈ ఏడాది ఎగువన మహారాష్ట్రలో వర్షాలు లేకపోవడంతో నదిలో నీరు లేకుండా పోయింది. దీంతో నిత్యం పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే వేలాది మంది యాత్రికులతో కళకళలాడే గోదావరి తీరం, తగినన్ని నీరు లేక కళ తప్పింది. కాగా, గత ఏడాది జూలై చివరి వారంలో నిండు కుండలా నీటితో కళకళలాడింది.

కాళేశ్వరానికి మరో 11,400 కోట్ల రుణాలు

హైదరాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు మరో రూ. 11,400 కోట్ల రుణాలను ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు వచ్చాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇప్పటికే వివిధ బ్యాంకుల నుంచి రూ. 7,200 కోట్ల రుణాలను తీసుకున్న ప్రభుత్వం.. మరిన్ని నిధుల కోసం బ్యాంకర్లను కోరగా అందుకు వారు అంగీకరించినట్టు సమాచారం. పంప్‌హౌజ్‌లు, టన్నెల్ పనులతో పాటు కొండపోచమ్మ, మల్లన్నసాగర్, బస్వాపూర్, గంధమల, రంగనాయకసాగర్ వంటి రిజర్వాయర్ల నిర్మాణానికి బ్యాంకు రుణాలను తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ పనుల కోసం కొన్ని బ్యాంకులను కలుపుకొని రుణాలను ఇవ్వడానికి పంజాబ్ నేషనల్ బ్యాంకు ముందుకు వచ్చింది. ఈ మేరకు బ్యాంకర్లతో ఇరిగేషన్ శాఖ అధికారులు బుధవారం జరిపిన చర్చలు ఫలించాయి. దీనికి సంబంధించి త్వరలోనే ఒప్పందాలను చేసుకునే అవకాశం ఉంది.

మల్లన్నసాగర్ టెండర్లలో 7 కంపెనీలు

మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల నిర్మాణానికి పిలిచిన టెండర్లలో మొత్తం 7 కంపెనీలు పాల్గొన్నాయి. బుధవారం సాంకేతిక బిడ్లను తెరిచారు. ఈ రెండు రిజర్వాయర్ల పనుల కోసం నవయుగ, మెగా, సత్య ఇన్‌ఫ్రా, కె.ఎన్.ఆర్, ఆప్కాన్స్, హెచ్‌ఈఎస్, రాఘవ కంపెనీలు పాల్గొన్నాయి. ప్రైస్ బిడ్‌లను ఈ నెల 18న తెరవనున్నారు.

వాహనాల క్రయ విక్రయాలకు 'ఆధార్': మంత్రి

హైదరాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వాహనాల కొనుగోళ్లు, అమ్మకాలు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియల్లో ఆధార్ నమోదును తప్పనిసరి చేయాలని రవాణా శాఖా మంత్రి మహేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇక ఈ - చలానా తరహాలోనే రవాణా శాఖ వెబ్‌సైట్‌లో వాహనాల క్రయవిక్రయాల సమాచారాన్ని పొందుపర్చాలనీ ఆదేశించారు. వాహనాల యాజమాన్య హక్కుల బదిలీ అంశంపై బుధవారం సచివాలయంలో రవాణా, పోలీస్ శాఖల అధికారులతో మంత్రి సమీక్షించారు.

మహిళా అభ్యర్థులతో భర్తీ: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బాలికల, మహిళా విద్యా సంస్థల్లో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను మహిళా అభ్యర్థులతోనే భర్తీచేయవచ్చని, ఈమేరకు సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పులు ఇచ్చిందని హైకోర్టు అభిప్రాయపడింది. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ఇటువంటి నిర్ణయాలు తీసుకొవచ్చని అభిప్రాయపడింది. సాంఘిక సంక్షేమ, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ బాలికల, మహిళల గురుకుల విద్యాలయాల్లో అన్ని పోస్టులను మహిళా అభ్యర్థులతోనే భర్తీ చేసేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, జస్టిస్ శ్యామ్‌ప్రసాద్‌ల ధర్మాసనం బుధవారం విచారించింది. ఈ విద్యాసంస్థల్లో మహిళా అభ్యర్థులతోనే అన్ని పోస్టులను భర్తీ చేయవచ్చని, ఈ మేరకు సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని ఏజీ ప్రకాశ్‌రెడ్డి నివేదించారు.

17నుంచి ఎంసెట్-బైపీసీ 'తుది' కౌన్సెలింగ్

ఎంసెట్-బైపీసీ విభాగం తుది విడత కౌన్సెలింగ్‌ను ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ కన్వీనర్ వాణీ ప్రసాద్ తెలిపారు. 17న ధ్రువ పత్రాల పరిశీలన, 17, 18 తేదీల్లో కాలేజీల ఎంపికకు ఆప్షన్లు ఇచ్చుకునేందుకు అవకాశం కల్పించారు. ఆప్షన్లు ఇచ్చిన విద్యార్థులకు ఈ నెల 20న సీట్లను కేటాయించనున్నారు.

బీ, సీ కేటగిరి సీట్లలో చేరే గడువు పెంపు

మేనేజ్‌మెంట్, ఎన్‌ఆర్ఐ కోటా కింద వైద్య సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో చేరడానికి నిర్దేశించిన గడువును ఈ నెల 12 వరకు పొడిగించినట్టు హెల్త్ వర్సిటీ ప్రకటించింది. అలాగే కన్వీనర్ కోటా కింద వైద్య సీట్లను పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో చేరే గడువు బుధవారం నాటితో ముగిసింది.

14 మంది డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగులు

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఐదు నెలల కిందట పదోన్నతులు పొంది.. వెయిటింగ్‌లో ఉన్న డిప్యూటీ కలెక్టర్లలో 14 మందికి పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పోస్టులు లేకున్నా అడ్డదిడ్డంగా పదోన్నతులు కల్పించిన రెవెన్యూశాఖ, వీరికి పోస్టింగులు ఇవ్వడానికి శాఖలను వెతుక్కునే పనిలో పడింది.

పసుపు బోర్డుకు ప్రతిపాదన రాలేదు: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. రాజ్యసభలో ఎంపీ డి.శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు.

తెలంగాణను పునర్నిర్మిస్తున్నాం: జితేందర్

న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సాధించిన తెలంగాణను అలా వదిలేయకుండా పునర్నిర్మాణం చేస్తున్నామని టీఆర్ఎస్ ఎంపీ జితేందర్ రెడ్డి తెలిపారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు.

లండన్‌లో కేసీఆర్ ఫర్ ఫార్మర్స్-వీవర్స్ ర్యాలీ

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలను, కార్యక్రమాలను చేపడుతున్నారని యూకే ఎన్నారై టీఆర్ఎస్‌సెల్ నేతలు అనిల్ కూర్మాచలం, దూసరి అశోక్‌గౌడ్ అన్నారు. లండన్‌లో ఎన్నారై టీఆర్ఎస్‌సెల్-యూకే ఆధ్వర్యంలో కేసీఆర్ ఫర్ ఫార్మర్స్-వీవర్స్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు.

ఎస్ఎఫ్ఐలో చీలిక.. టీఎస్ఎఫ్ఐ ఏర్పాటు

హైదరాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీలో చీలిక వచ్చింది. రాష్ట్ర నాయకత్వంతో విభేదించిన కొందరు విద్యార్థి నేతలు తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండిపెండెంట్(టీఎస్ఎఫ్ఐ) పేరుతో వేరుకుంపటి పెట్టుకున్నారు. ఉమ్మడి వరంగల్ పరిధిలో కొత్తగా ఏర్పాటైన 5 జిల్లాల్లో ఈ సంఘం కమిటీలు ఏర్పాటు చేసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. సీపీఎం నేతల ప్రమేయం పెరిగిపోవడం వల్లే తాము వేరుగా సంఘం పెట్టుకున్నామని చెబుతున్నారు.



శరద్ యాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్. కృష్ణయ్య తదితరులు

శరద్ యాదవ్‌ను కలిసిన కృష్ణయ్య బృందం

- బీసీల డిమాండ్ల సాధనకు సహకరించాలని వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): బీసీల డిమాండ్ల సాధనకు సహకరించాలని జేడీయూ జాతీయ అధ్యక్షుడు శరద్ యాదవ్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బృందం కలిసి విజ్ఞప్తి చేసింది. పార్లమెంట్‌లో బీసీ బిల్లు తీసుకురావడం, చట్టసభల్లో 50% రిజర్వేషన్లు కల్పించడంపై ఆయనతో చర్చించారు.

దత్తాత్రేయను కలిసిన తెలంగాణ బీసీసంఘం

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు, కేంద్రంలో బీసీ సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కేంద్ర మంత్రి దత్తాత్రేయను తెలంగాణ బీసీ సంక్షేమ సమితి కోరింది. బీసీలకు పెద్ద పీట వేసే వరకు పోరాటం సాగిస్తామని రెండ్రోజులుగా ఢిల్లీ కేంద్రంగా ధర్నాలు చేపడుతున్న శ్రీనివాస్‌గౌడ్ బృందం తెలిపింది.

శాట్‌ను ఆశ్రయించిన జెకుమార్ ఇన్‌ఫ్రా, పార్శ్వనాథ్

● సెబి 'డొల్ల' కంపెనీల ముద్రపై ఆగ్రహం

న్యూఢిల్లీ: సెబీ తమను డొల్ల కంపెనీలుగా వర్గీకరించి, షేర్ల లావాదేవీలపై ఆంక్షలు విధించడంపై జెకుమార్ ఇన్‌ఫ్రా, పార్శ్వనాథ్ డెవలపర్స్ కంపెనీలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. సెబీ నిర్ణయాన్ని సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్(శాట్)లో సవాల్ చేశాయి. ఈ రెండు కంపెనీలతోపాటు 311 కంపెనీల లావాదేవీలు డొల్ల కంపెనీల్లా అనుమానాస్పదంగా ఉన్నట్టు ప్రభుత్వం ఇంతకు ముందు ప్రకటించింది. దీంతో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఈ కంపెనీల షేర్ల లావాదేవీలను నెలకు ఒక రోజు మాత్రమే పరిమితం చేస్తూ సెబి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో అనేక కంపెనీల్లో దేశీయ ఇన్వెస్టర్లతో పాటు, విదేశీ ఇన్వెస్టర్లు పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేశారు. సెబి ప్రకటనతో కొన్ని కంపెనీల యాజమాన్యాలైతే బిత్తర పోయాయి. వెంటనే తమ వాదన వినిపించడంతో పాటు, నిబంధనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమర్పిస్తున్న ఫైలింగ్‌తో మీడియా ముందుకు వచ్చాయి. 'అనుమానాస్పద డొల్ల కంపెనీల జాబితాలో మా కంపెనీ పేరు చేర్చడం మమ్మల్ని విస్మయ పరిచింది. దీంతో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో మా షేర్లు పరిమిత ట్రేడింగ్ విభాగమైన జిఎస్ఎం 6లోకి మార్చారు' అని జెకుమార్ ఇన్‌ఫ్రా కంపెనీ పేర్కొంది. ఎప్పటికప్పుడు స్టాక్ ఎక్స్ఛేంజీలు, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీలకు అన్ని రిపోర్టులు ఫైల్ చేస్తున్న తమను డొల్ల కంపెనీగా జమ కట్టడం ఊహాజనితమని పార్శ్వనాథ్ డెవలపర్స్ కంపెనీ పేర్కొంది. మిగతా కంపెనీలు కూడా త్వరలో ఇదే బాటలో పయనిస్తాయని భావిస్తున్నారు. ఎప్పటికప్పుడు రిటర్న్‌లు ఫైల్ చేస్తూ, నిబంధనలకు అనుగుణంగా పని చేస్తున్న తమను డొల్ల కంపెనీలుగా పేర్కొన డంపై మరిన్ని కంపెనీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సెబి చర్యలతో ఈ కంపెనీల షేర్లు ఇక నెలకు ఒక రోజు మాత్రమే కూడా అత్యంత కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండే జిఎస్ఎం 6 విభాగంలో మాత్రమే ట్రేడవుతాయి.

నెట్‌లింక్స్ చేతికి శ్రీ వెంకటేశ్వర గ్రీన్ పవర్ ప్రాజెక్ట్స్

● 51 శాతం వాటా కొనుగోలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఇంటర్నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ నెట్‌లింక్స్.. శ్రీ వెంకటేశ్వర గ్రీన్ పవర్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌లో మెజారిటీ వాటా (51 శాతం) వాటాను కొనుగోలు చేసింది. అయితే ఈ వాటా విలువను కంపెనీ వెల్లడించలేదు. శ్రీ వెంకటేశ్వర గ్రీన్ పవర్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ 12 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ (రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్)ను అభివృద్ధి చేయనుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతిపాదించిన ఈ విద్యుత్ ప్లాంట్ ద్వారా గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలోని చెత్తను వినియోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నారు. 18 నెలల కాలంలో ఈ ప్లాంట్ కార్యకలాపాలు ప్రారంభించనుంది. విభిన్న రంగాల్లోకి విస్తరించాలన్న వ్యూహంతో శ్రీ వెంకటేశ్వర గ్రీన్ పవర్ ప్రాజెక్ట్స్‌లో వాటాలు తీసుకున్నామని నెట్‌లింక్స్ లిమిటెడ్ చైర్మన్ మనోహర్ లోకా రెడ్డి తెలిపారు. ఈ విద్యుత్ ప్రాజెక్టును విజయవంతంగా కార్యరూపం దాల్చే విధంగా చేస్తామన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. మొత్తం విద్యుత్ ప్రాజెక్టు వ్యయం 200 కోట్ల రూపాయలని, ఇందులో 60 కోట్ల రూపాయలు ఈక్విటీ ద్వారా సమకూర్చుతామని చెప్పారు. ఇందులో 51 శాతం మొత్తాన్ని అంతర్గత నిధుల ద్వారా నెట్‌లింక్స్ సమకూరుస్తుందని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర గ్రీన్ పవర్ పవర్ ప్రాజెక్ట్స్‌లో 49 శాతం వాటా కలిగిన కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కె వెంకటేశ్వర రెడ్డి, ఆయన సంబంధీకులు ఆ మేరకు నిధులు సమకూర్చుతారని చెప్పారు. ప్రాజెక్టుకు అవసరమయ్యే మిగతా నిధులను టర్మ్ లోన్లు, వర్కింగ్ క్యాపిటల్ రుణాల ద్వారా సమకూర్చుకోనున్నట్టు ఆయన తెలిపారు. ఈ ప్లాంట్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను యూనిట్‌కు 7.40 రూపాయల ధరతో కొనుగోలు చేసేందుకు తెలంగాణ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీతో ఒప్పందం కుదిరినట్టు చెప్పారు.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	ప్రొద్దుటూరు	ముంబై	చెన్నై
24 క్యారెట్లు	29,470	29,640	29,550	28,730	--
క్రితం ముగింపు	29,370	29,400	29,450	28,590	--
22 క్యారెట్లు	28,880	27,500	27,370	28,580	27,270
క్రితం ముగింపు	28,780	27,300	27,280	28,440	27,170
వెండి (కిలో)	39,000	39,200	39,000	37,875	--
క్రితం ముగింపు	38,400	38,600	38,500	37,275	--

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	77.00	గోదావరి	77.00
కరీంనగర్	78.00	విజయవాడ	79.00
వరంగల్	77.00	గుంటూరు	80.00
మహబూబ్‌నగర్	77.00	ఒంగోలు	81.00
కర్నూలు	77.00	చిత్తూరు	83.00
విశాఖపట్నం	76.00	నెల్లూరు	83.00

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.95 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	330.00	వరంగల్	332.00
విజయవాడ	340.00	చెన్నై	372.00
గోదావరి	340.00	నమక్కల్	365.00
బెంగళూరు	365.00	చిత్తూరు	365.00
విశాఖపట్నం	345.00	ముంబై	375.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో...)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.02	67.28
పౌండ్	75.30	87.36
యూరో	68.08	79.96
ఆస్ట్రేలియా డాలర్	45.67	52.85
బ్రహ్రెయిన్ దినార్	157.23	180.08
కువైట్ దినార్	174.60	217.49
ఒమని రియాల్	153.85	176.06
సౌదీ రియాల్	15.43	18.29
సింగపూర్ డాలర్	42.53	50.39
యుఎఇ దిరమ్	15.79	18.46

ఇన్వెస్టర్లే బకరాలు



● డొల్ల కంపెనీల మాయాజాలం

ముంబై: తిమ్మిని బమ్మిని చేయడం ఇంద్రజాలం. కొంత మంది ప్రమోటర్లు దీని మించి పోయారు. తమ టక్కు టమార విద్యలతో పైసాకూ పనికిరాని కంపెనీల షేర్లను భారీ ధరలకు ఇన్వెస్టర్లకు అంటగడుతూ 'లాభాల' పండగ చేసుకుంటున్నారు. గతంలోనూ తెలుగు రాష్ట్రాల్లో పెన్నా, ఫ్లోరోకెమ్స్, గ్రానైట్, ఆక్వా పేర్లతో అనేక కంపెనీలు మార్కెట్‌కు వచ్చాయి. వాటి ప్రచారాన్ని నమ్మి ఆ కంపెనీల షేర్లు కొన్న ఇన్వెస్టర్లు లబోదిబోమంటూ ఏడుస్తుంటే, ప్రమోటర్లు మాత్రం సైలెంట్‌గా దుకాణాలు ఎత్తేశారు. ఇప్పుడు భూతద్దం పెట్టి వెతికినా ఆ కంపెనీల పేర్లు కనిపించవు. ఆ ఇష్యూల ద్వారా సమీకరించిన వందల కోట్ల నిధులు, ఆస్తులు దర్జాగా ప్రమోటర్ల జేబుల్లోకి చేరిపోయాయి. వారి మాయ మాటలు నమ్మి ఆ ఇష్యూల్లో ఇన్వెస్ట్ చేసిన ఇన్వెస్టర్లకు మాత్రం ఏడుపొక్కటే మిగిలింది. ప్రమోటర్ల మోసం గురించి తెలిసినా ప్రభుత్వంగానీ, స్టాక్ మార్కెట్ వాచ్‌డాగ్ సెబిగానీ ఈ బడా కేటుగాళ్లపై ఒక్క చర్య కూడా తీసుకోలేక పోయాయి.

స్టాక్ మార్కెట్లో ఎప్పటి నుంచో ఈ గూడు పుఠాణి నడుస్తోంది. బిజినెస్ లేకపోయినా తప్పుడు చిరునామాలు, తప్పుడు రిటర్న్‌లతో ఈ కంపెనీలు ఇప్పటి వరకు నెట్టుకొచ్చాయి. ఇన్వెస్టర్ల అమాయకత్వమే ఈ కంపెనీల ప్రమోటర్లకు శ్రీరామ రక్ష. ఇక్కడ రిటైల్ ఇన్వెస్టర్లతో పాటు రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా వంటి బిగ్‌బుల్‌ను ఈ కేటుగాళ్లు నమ్మించారంటే, ఈ మోసాల్లో ఎంత ముదిరిపోయారో అర్థం చేసుకోవచ్చు. స్టాక్ మార్కెట్లో దీన్నే 'గ్రేట్ ఫూల్ థియరీ' అంటారు. ఏ మాత్రం ఫండమెంటల్స్ లేకపోయినా ఒక కంపెనీ షేరును తక్కువ ధరకు కొని, మార్కెట్‌ను ఏదోలా మాయ చేసి మరో ఇన్వెస్టర్లకు అధిక ధరకు అమ్ముకుని భారీ లాభాలు కళ్లజూడడమే గ్రేట్ ఫూల్ థియరీ. ఇలాంటి కేటుగాళ్లకు ఇటీవల ఫేస్‌బుక్, ట్విటర్ లేదా చాట్ గ్రూపులు వేదికలుగా మారాయి. కొన్ని బ్రోకరేజ్ సంస్థలూ ఇందులో పాత్ర ఉన్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సంస్థలు ఈ డొల్ల కంపెనీల షేర్లు ఇన్వెస్ట్‌మెంట్‌కు బాగున్నాయి. త్వరగా కొనుక్కోండి అని ఎస్ఎంఎస్‌లు పంపి మరీ కొనిపించినట్టు సమాచారం.

సెబి తాజాగా 331 కంపెనీల జాబితా విడుదల చేసింది. ఈ కంపెనీల షేర్లలో ట్రేడింగ్‌ను నెలకు ఒక్క రోజుకే పరిమితం చేయాలని సెబి స్టాక్ ఎక్స్ఛేంజీలను ఆదేశించింది. దీంతో ఈ కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేసిన 31 లక్షల మంది ఇన్వెస్టర్లు ఇప్పుడు పెద్ద ఊబిలో కూరుకు పోయారు. ఈ కంపెనీల షేర్ల విలువ ఎంత లేదన్నా రూ.9,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

31 లక్షల మంది

అడ్డగోలుగా పెరుగుదల

గత జనవరి నుంచి ఈ డొల్ల కంపెనీల్లో కొన్ని కంపెనీల షేర్లు అడ్డగోలుగా పెరిగిపోయాయి. సెబి డొల్ల కంపెనీగా పేర్కొన్న ప్రకాశ్ ఇండస్ట్రీస్ కంపెనీ షేరు ధర ఏకంగా 208 శాతం పెరిగింది. పార్శ్వనాథ్ డెవలపర్స్ షేరు ధర 82 శాతం పెరిగింది. జెకుమార్ ఇన్‌ఫ్రా షేరు ధర 38 శాతం లాభపడింది. ఇప్పుడు సెబి తీసుకున్న చర్యలతో ఈ కంపెనీల షేర్లలో చిక్కుకు పోయిన ఇన్వెస్టర్లు మరిన్ని కష్టాల్లో పడ్డారు. ఇవి డొల్ల కంపెనీలన్న ముద్రతో వీటి ధర మరింత పడిపోయే ప్రమాదం ఏర్పడింది.

రెండో రోజూ వీడని 'సెబి' భయం

● ఇండెక్సులు మరింత దిగువకు

ముంబై: మార్కెట్‌ను రెండో రోజు కూడా డొల్ల కంపెనీల వ్యవహారం వెన్నాడింది. డొల్ల కంపెనీలపై సెబి చర్యతో ఏర్పడిన ఆ అపనమ్మకంతో కూడిన వాతావరణం స్టాక్ ఇండెక్స్‌లను నష్టాలబాటలో నడిపింది. సెన్సెక్స్ మరో 216 పాయింట్లు మేరకు నష్టపోయి మూడు వారాల కనిష్ఠ స్థాయికి, కీలకస్థాయి 32000 దిగువకు చేరింది. మార్కెట్లో లిస్టింగ్ కాని డొల్ల కంపెనీలపై తక్షణం చర్య తీసుకోవాలని సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీలను సెబి ఆదేశించడం ఇన్వెస్టర్లలో భయాందోళనల్ని రగిలించిన విషయం విదితమే. అవే భయాలు రెండో రోజు కూడా కొనసాగడంతో పాటు ఉత్తర కొరియా క్షిపణి కార్యక్రమ విషయంలో అమెరికాతో ఉద్రిక్తతలు చెలరేగడం, కొన్ని కంపెనీలు ప్రకటించిన మొదటి త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహపూరితంగా ఉండడం ఇన్వెస్టర్లను అమ్మకాల దిశగా పరుగులు తీయించింది. ఫలితంగా సర్వత్రా అమ్మకాల ఒత్తిడి ఏర్పడడంతో హెల్త్ కేర్, ఆటో రంగాలు బాగా నష్టపోయాయి. సెన్సెక్స్ 216.35 పాయింట్ల నష్టంతో 31797.84 పాయింట్ల వద్ద ముగిసింది. జూలై 18వ తేదీ తర్వాత సెన్సెక్స్ ఇంత కనిష్ఠ స్థాయిలో క్లోజ్ కావడం ఇదే ప్రథమం. వరుసగా మూడు రోజుల్లో ఇండెక్స్ 528 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ 70.50 పాయింట్లు నష్టపోయి 9908.05 పాయింట్ల వద్ద క్లోజయింది. ఇంట్రాడేలో నిఫ్టీ 9900 కన్నా దిగజారి 9893.05 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకినా చివరలో కోలుకుని ఆ కీలక స్థాయికన్నా పైనే నిలిచింది.

■ సెన్సెక్స్‌లోని స్క్రిప్‌లలో సన్‌ఫార్మా 5.13 శాతం నష్టపోయి 52 వారాల కనిష్ఠ స్థాయికి దిగజారింది. అదానీ పోర్ట్స్ (4.12 శాతం), సిప్లా, టాటా మోటార్స్, బజాజ్ ఆటో నష్టాల్లో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే ఎన్‌టిపిసి గాలికి ఎదురీది 1.25 శాతం లాభంతో ముగియగా ఓఎన్‌జిసి, హెచ్‌డిఎఫ్‌సి, ఏషియన్ పెయింట్స్ కూడా లాభాల బాటలో నడిచాయి.



యూనియన్ బ్యాంక్ రూ.2000 కోట్ల సమీకరణ

రైట్స్ ఇష్యూ, ప్రైవేట్ ప్లేస్‌మెంట్, ఎఫ్‌పిఒ జారీ సహా భిన్న మార్గాల ద్వారా ఈ ఏడాది 2,000 కోట్ల రూపాయల సమీకరించనున్నట్టు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఇందుకు బుధవారం సమావేశమైన డైరెక్టర్ల కమిటీ అనుమతి ఇచ్చినట్టు తెలిపింది.

డాబర్ టునీసీ మూసివేత

అనుబంధ సంస్థ డాబర్ టునీసీని మూసివేస్తున్నట్టు డాబర్ ఇండియా ప్రకటించింది. దాని లిక్విడేషన్‌కు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపింది. బుధవారం బిఎస్ఇలో డాబర్ స్టాక్ 1.41 శాతం నష్టంతో రూ.310.3 వద్ద ముగిసింది.

సిటీ యూనియన్ క్యుఐపి

సిటీ యూనియన్ బ్యాంక్ రూ.500 కోట్ల నిధుల సమీకరణకు క్యుఐపి జారీ చేసే సన్నాహాల్లో ఉంది. ఈ నెల 23వ తేదీన జరుగనున్న షేర్‌హోల్డర్ల సమావేశంలో క్యుఐపికి అనుమతి కోరనున్నట్టు ప్రకటించింది. ఆ అనుమతి ఏడాది పాటు చెల్లుబాటులో ఉంటుందని, మార్కెట్ పరిస్థితిని బట్టి ఎప్పుడు సానుకూలం అనుకుంటే అప్పుడు క్యుఐపి జారీ చేస్తామని బ్యాంకు సిఇఒ ఎన్ కామకోడి తెలిపారు.

జూలైలో రికార్డు స్థాయిలో ఎంఎఫ్‌ల్లోకి నిధులు



మ్యూచువల్ ఫండ్ సంస్థల ఈక్విటీ స్కీమ్‌లలోకి జూలై నెలలో రికార్డు స్థాయిలో నిధులు వచ్చాయి. ఇన్వెస్టర్లు 18,200 కోట్ల రూపాయల మేరకు నిధులు ఈక్విటీ స్కీమ్‌లలో పెట్టారని, ఇది చారిత్రక గరిష్ఠ స్థాయి అని డాయిష్ బ్యాంక్ ఒక నివేదికలో తెలిపింది. ఈక్విటీ, ఈక్విటీ అనుసంధానిత పొదుపు స్కీమ్‌లు, బ్యాలెన్స్‌డ్ ఫండ్లలోని ఈక్విటీ విభాగంలో అధిక మొత్తంలో నిధులు ఇన్వెస్ట్ చేయడానికి ఇన్వెస్టర్లు మొగ్గు చూపారని ఆ నివేదిక పేర్కొంది. ప్రధానంగా ఈక్విటీ స్కీమ్‌లలో ఎస్ఐపి బాటలో ఇన్వెస్ట్ చేయడం భారతీయుల పొదుపు ధోరణిలో వస్తున్న మార్పులకు సూచిక అని ఆ నివేదిక వ్యాఖ్యానించింది. అలాగే బిఎస్ఇ 500 కంపెనీల్లో మ్యూచువల్ ఫండ్ సంస్థల యాజమాన్యం 2014లో మూడు శాతం ఉండగా 2017 జూన్ నాటికి ఆరు శాతానికి పెరిగినట్టు కూడా తెలిపింది.

కీలక మద్దతు స్థాయిలో...

టెక్ వ్యూ

నిఫ్టీ ప్రారంభంలోనే బలమైన కరెక్షన్‌లో పడి 9930 వరకు దిగజారినా రికవరీ సాధించి ప్రధాన మద్దతు స్థాయి 9900కన్నా స్వల్పంగా పైన ముగిసింది. గత కొద్ది రోజులుగా స్వల్పకాలిక కరెక్షన్‌లో ఉన్న నిఫ్టీ 250 పాయింట్లకు పైగా నష్టపోయింది. ప్రస్తుతం 20 డిఎంఎకు స్వల్పంగా దిగువకు వచ్చింది. డౌన్‌ట్రెండ్‌ను నివారించుకోవాలంటే ఒకటి లేదా రెండు ట్రేడింగ్ దినాల్లో తప్పనిసరిగా రికవరీ సాధించాలి.

గురువారం స్థాయిలివే...

నిరోధం: 10040 మద్దతు: 9880

■ రికవరీబాట పడితే మరింత అప్‌ట్రెండ్ కోసం ఇంట్రాడే నిరోధం 10040 పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 10100. ఆ పైన బలంగా క్లోజయినప్పుడే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశిస్తుంది.

■ 9880కన్నా దిగజారితే మరింత బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి, స్వల్పకాలిక టార్గెట్ 9700.

సూచన: ప్రస్తుతం 9900 చేరువలో ఉన్నందు వల్ల స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

■ వి.సుందర్ రాజా

ముగింపు సెషన్ మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి: శ్రావణ బహుళ తదియ **నక్షత్రం:** పూర్వాభాద్ర

అశ్విని, మఖ, మూల నక్షత్ర జాతకులు, మీన, కర్కాటక రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ: 9908.05 (–70.50)

ట్రెండ్ మార్పు వేళలు: 11.52, 1.35

ధోరణి: గ్రహగతులను బట్టి మెరుగ్గా/నిలకడగా ప్రారంభమై 9.30 నుంచి 11.130 మధ్యలో నిలకడగా ఉండి ఆ తర్వాత 1.55 వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది. రెండు గంటల నుంచి ముగింపు వరకు మెరుగ్గా ట్రేడ్ కావచ్చు.

ట్రేడింగ్ వ్యూహం: నిఫ్టీ ఫ్యూచర్స్ 11.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 1.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. రెండు గంటల తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు: 9945, 9980

మద్దతు స్థాయిలు: 9865 9830

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి

www.thefinanciala strologer.blogspot.in

ఎన్ఎస్ఇ-500 షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా — NSE

AARTIDRUGS 551.25(564.65)7002
AARTIIND 926.85(949.2)11907
ABAN 175.8(179.5)404459
ABB 1386.35(1391.75)37418
ABFRL 169(167.25)404594
ABGSHIP 13.3(13.95)16092
ACC 1819.5(1812.15)299512
ADANIENT 124.25(137.35)5431633
ADANIPORTS 397.25(414.8)3603960
ADANIPOWER 31.55(31.6)6873075
ADANITRANS 122.8(126.15)451515
AEGISCHEM 185.45(187.8)132442
AHLUCONT 271.3(271)3964
AIAENG 1434.3(1464.8)5539
AJANTPHARM 1218.45(1298.3)922911
AKZOINDIA 1803.7(1804.85)4008
ALBK 68.85(69.85)2537010
ALLCARGO 164.1(168.95)129889
ALOKTEXT 3.05(3.05)3474359
AMARAJABAT 805.2(800.95)674420
AMBUJACEM 273.2(274.15)949202
AMTEKAUTO 26.25(27.1)602956
ANANTRAJ 55.5(57.1)2102459
ANDHRABANK 54.1(54.25)2393512
APARINDS 745.45(770.9)22104
APLLTD 526.15(530.85)47421
APOLLOHOSP 1220.55(1251.05)238162
APOLLOTYRE 270.25(280.45)6919830
ARVIND 377.35(381.1)1231682
ASHIANA 185.25(187.55)93541
ASHOKA 180.7(181.75)42256
ASHOKLEY 109.6(112.1)7762163
ASIANPAINT 1155.55(1147.35)530763
ASTRAL 650.9(654.15)86809
ASTRAZEN 905.1(895.95)12892
ATUL 2057.25(2086.1)14278
AUROPHARMA 683.6(726.3)5412591
AVANTIFEED 1703.05(1763.55)71006
AXISBANK 486.95(499.45)7169705
BAJAJ-AUTO 2831.15(2911.6)305248
BAJAJCORP 402.45(400.7)14968
BAJAJELEC 319.95(329.85)67710
BAJAJFINSV 5121.9(5336.1)225019
BAJAJHIND 14.85(15.3)5789167
BAJAJHLDNG 2554.1(2540.2)13820
BALKRISIND 1587.9(1617.55)92337
BALLARPUR 15(15.8)1513262
BALMLAWRIE 242.1(248.3)77814
BALRAMCHIN 166.35(170.1)1878491
BANKBARODA 155.2(156.55)7541485
BANKINDIA 158.45(152.55)21791934
BASF 1427.95(1432.45)16504
BATAINDIA 636.55(634.25)720334
BBTC 880.3(886.4)42604
BEML 1624.7(1697.75)496040
BERGEPAINT 256.1(253.1)1515965
BFUTILITIE 348.25(360.35)232011
BGRENERGY 136.55(140.45)81076
BHARATFIN 797.3(815.95)1455403
BHARATFORG 1165.75(1188.65)743210
BHARTIARTL 416.05(417.8)1226554
BHEL 133(134.65)2747975
BHUSANSTL 67.25(68.95)479437
BIOCON 339(349.95)1632080
BIRLACORPN 947.75(969.9)35661
BLISSGVS 163.6(168.95)167446
BLUEDART 3952.2(4082.1)13061
BLUESTARCO 680.3(682.15)23812
BOMDYEING 78.1(80.3)731355
BOSCHLTD 24032(24189.4)9346
BPCL 495.95(505.05)3120575
BRFL 136.65(131.35)262341
BRIGADE 263.85(275)76811
BRITANNIA 4058.9(4072.35)174011
CADILAHC 485.45(530)2411629
CANBK 343.95(346.65)2123888
CANFINHOME 2859.95(2921.5)90168
CAPF 749.8(779.75)411246
CARERATING 1593.7(1598.5)17501
CASTEXTECH 6.3(6.5)530061
CASTROLIND 388.35(392.5)269140
CCL 284.85(285.75)46245
CEATLTD 1689.6(1765)1365868
CENTRALBK 85.05(85.9)396724
CENTURYPLY 264.8(259.5)407933
CENTURYTEX 1244.65(1281.05)1023100
CERA 2895.45(2918.3)2249
CESC 959.5(957)422812
CHAMBLFERT 135.7(139.75)1044294
CHENNPETRO 398.25(412.05)3080683
CHOLAFIN 1171(1202.35)215847
CIPLA 561.85(578.6)1801630
CLNINDIA 612.55(623.45)13922
COALINDIA 242.5(245.05)1801736
COLPAL 1056.75(1066.85)215316
CONCOR 1168.85(1168.55)229607
COROMANDEL 423.55(438.4)151867
CORPBANK 50.25(48.55)358964
COX&KINGS 271.95(271.35)510239
CRISIL 1840.05(1861.35)16977
CUB 162(168.25)1490491
CUMMINSIND 904.35(936.3)297528
CYIENT 524.3(527.65)13242
DABUR 310.5(314.95)643371
DALMIABHA 2556.1(2636.85)91743
DBCORP 379.05(377.05)34021
DBREALTY 36.8(38.25)959071
DCBBANK 181.4(185.55)2651531
DCMSHRIRAM 373.2(375.6)207593
DEEPAKFERT 351.6(352.5)212590
DELTACORP 168.85(168.3)2156016
DEN 81.75(80.2)99609
DENABANK 32.5(32.7)846278
DHANUKA 776.9(765.2)10898
DHFL 427.85(448.85)2466869
DISHTV 74.2(76.45)2358918
DIVISLAB 639.05(673.7)1428857
DLF 178.85(178.6)13187103
DREDGECORP 605.55(616)70648
DRREDDY 2048.35(2095.65)1124987
DYNAMATECH 2255.8(2337.4)2501
ECLERX 1285.25(1288.8)3550
EDELWEISS 250.4(238.15)6621160
EICHERMOT 31489.1(32120.85)63895
EIDPARRY 307.4(312.7)200690
EIHOTEL 131.3(132.95)38222
ELECTCAST 27(27.95)348323
ELGIEQUIP 226.15(226.75)7451
EMAMILTD 1128.65(1150.25)202476
ENGINERSIN 155.2(159.6)1619604
EROSMEDIA 209.6(212.5)526445
ESCORTS 636.15(651.25)1526529
ESSDEE 36.55(37.9)16881
ESSELPACK 242.25(246.85)22231
EVEREADY 303.7(307.5)58620
EXIDEIND 207.2(214.25)2115378
FCONSUMER 40.55(41.75)5569299
FDC 173.9(176.35)15042
FEDERALBNK 108.3(112.3)13541654
FINCABLES 490.45(489.2)60506
FINPIPE 582.5(588.25)48963
FLFL 317.3(315.5)120028
FORTIS 158.6(159.8)2867206
FSL 35.5(34.5)5526081
GAIL 382.2(386.75)1761931
GATI 114.55(117.55)298547
GDL 263.7(267.1)37276
GEPIL 672.95(693.45)7261
GESHIP 388(387.7)76494
GET&D 378.6(380.6)73389
GILLETTE 5241.3(5310)3530
GLAXO 2392.1(2380)10473
GLENMARK 645.45(668.25)966191
GLOBOFFS 34.1(34.9)19601
GMDCLTD 138.75(138.95)408390
GMRINFRA 16.95(17.7)30393631
GODFRYPHLP 985.7(1017.45)121071
GODREJCP 921.8(946.8)312418
GODREJIND 601.9(629.25)490316
GODREJPROP 500(504.05)84953
GPPL 138.45(140.85)343743
GRANULES 116.8(126.75)2360012
GREAVESCOT 154(156.6)109043
GREENPLY 273(273.15)67878
GRINDWELL 393.7(406.9)19530
GRUH 478.3(497.35)101290
GSFC 123.5(125.15)1246860
GSKCONS 5409.85(5541.5)13258
GSPL 186.4(185.25)418176
GUJFLUORO 782.65(781.15)94318
GUJGASLTD 787.6(774.15)68147
GULFOILLUB 803.75(804.4)7080
GVKPIL 12.95(12.7)29534056
HATHWAY 31.5(31.95)796368
HAVELLS 497.95(485.15)1568312
HCC 34.65(36.95)14272903
HCL-INSYS 43.6(45.95)1027776
HCLTECH 878.75(882)535846
HDFC 1731.65(1719.9)1817847
HDFCBANK 1764.45(1777.9)817514
HDIL 57.2(56.4)196100277
HEIDELBERG 117.6(124.8)449074
HEROMOTOCO 3883.75(3913.4)343296
HEXAWARE 260.2(261.4)648819
HFCL 16.55(17.4)5150656
HIMATSEIDE 315.55(328.65)293341
HINDALCO 239.45(234.9)12844802
HINDCOPPER 62.45(63.8)923774
HINDPETRO 429.65(436.15)7655580
HINDUNILVR 1185.35(1191)833002
HINDZINC 286.65(284.65)1873275
HMT 34.6(36.2)9321
HMVL 268.55(270.5)2692
HONAUT 12612.15(12553.4)2706
HOTELEELA 21.45(21.95)382073
HSIL 356.7(363)51509
HTMEDIA 84.3(86.65)151814
IBREALEST 249.4(253.7)11715205
IBULHSGFIN 1159(1195.8)776497
ICICIBANK 290.6(295.5)12959158
ICRA 3930.5(3905.8)1456
IDBI 55.95(55.75)1960714
IDEA 91.05(91.65)5140576
IDFC 56.4(56.9)3947103
IFBIND 659.85(666.85)11946
IFCI 24.45(25.25)3841906
IGARASHI 1005.9(1024.05)39288
IGL 1231(1225.1)894729
IIFL 595.85(594.25)111542
IL&FSTRANS 83.45(86.5)331752
INDHOTEL 126.15(129.95)329443
INDIACEM 186.3(193.2)4896299
INDIANB 296.2(300.4)808081
INDOCO 197.75(200.1)629405
INDUSINDBK 1637.25(1638.65)530640
INEOSSTYRO 954.1(974.6)31723
INFRATEL 381.7(383.6)2750683
INFY 969.35(963.85)1961205
INGERRAND 800.7(815.2)8542
INOXLEISUR 245.3(249)59631
INOXWIND 132.8(135.2)184275
INTELLECT 105(105.6)470107
IOB 23.95(24.2)925890
IOC 414.05(413.25)6253452
IPAPPM 297.9(299.15)21671
IPCALAB 436.95(454.05)65931
IRB 211.45(219.45)3661501
ITC 272.85(274.15)9910187
J&KBANK 79.2(79.95)326079
JAGRAN 178.7(179.95)134089
JAICORPLTD 77.2(79.2)571879
JBCHEPHARM 293.6(298.05)44693
JBFIND 145.15(175.3)1389557
JCHAC 1974.4(2030.4)10414
JETAIRWAYS 613.7(630.2)1480023
JINDALPOLY 392.4(406.35)53700
JINDALSTEL 135.95(139.5)15924281
JISLJALEQS 99.4(103.15)8015979
JKCEMENT 1026.2(1033.25)16145
JKLAKSHMI 429.45(440.3)39928
JKTYRE 155.2(161.2)1164521
JMFINANCIL 124.25(123.4)1625802
JPASSOCIAT 25.6(26.2)142549932
JPINFRATEC 19.8(20.8)6549491
JPPOWER 6.8(6.85)18971197
JSWENERGY 70.55(70.95)12238707
JSWHL 1816.3(1824.55)3241
JUBILANT 669.2(688.1)231824
JUBLFOOD 1299.2(1330.8)1763170
JUSTDIAL 361.75(365.35)1767552
JYOTHYLAB 374.15(382.2)18745
KALPATPOWR 351.25(356)55160
KANSAINER 451.9(453.1)145808
KEC 300.5(297.05)401772
KESORAMIND 131(136.3)257166
KIRLOSENG 393.35(395.3)4803
KITEX 244.2(247.6)56243
KOLTEPATIL 155.85(158.65)41324
KOTAKBANK 992.4(987.7)1131399
KPIT 116.1(120.7)1950166
KRBL 457.65(469.55)113566
KSCL 609.15(659)1720126
KSK 7.55(7.85)709611
KTKBANK 146.4(150.75)1877281
KWALITY 139.3(136.15)908589
L&TFH 172.15(175.4)4403356
LAKSHVILAS 177.35(174.45)426549
LAOPALA 491.85(498.35)13679
LAXMIMACH 5884.45(5895.2)3695
LICHSGFIN 676.9(681.1)907035
LITL 1.1(1.15)815445
LT 1153.9(1171.2)1439328
LUPIN 952.95(974.5)1347325
M&M 1392.3(1400)771111
M&MFIN 423.6(425.55)2468408
MAGMA 172.5(173.75)298471
MAHINDCIE 239.15(243.35)102057
MAHLIFE 420.9(422.15)48792
MANAPPURAM 98.7(104.35)6157450
MANPASAND 763.2(773.55)89240
MARICO 325.7(333.95)2275048
MARKSANS 37.8(39.95)2146694
MARUTI 7661.6(7755.9)285089
MAYURUNIQ 340.9(348.15)14568
MCDOWELL-N 2535.95(2548.2)214981
MCLEODRUSS 178(180.95)178078
MERCK 1194.4(1226.05)24752
MHRIL 371.6(378.9)41210
MINDACORP 104(105.8)78015
MINDTREE 464.35(473.65)140954
MMTC 57.05(57.8)414635
MOIL 335.95(341.05)110405
MONSANTO 2622.25(2683.2)8413
MOTHERSUMI 329.05(336.65)1363385
MOTILALOFS 1093.5(1080.3)241101
MPHASIS 581.5(581.5)19847
MRF 65946.95(66722.25)10520
MRPL 134.4(139)2992806
MTNL 18.5(18.9)563634
MUTHOOTFIN 457.35(479.6)1062260
NATCOPHARM 829.45(923.65)946417
NATIONALUM 70.4(69.9)8224080
NAUKRI 1037.1(1040.6)120570
NAVKARCORP 189.45(188.05)20866
NCC 89.6(89.2)5364312
NETWORK18 52.25(53.2)413670
NHPC 30.85(31.25)4604984
NIITTECH 482.45(489.2)365134
NITINFIRE 5.35(5.5)724643
NLCINDIA 98.4(98.6)250640
NMDC 126.15(127.65)6002339
NTPC 173.65(171.15)2707378
OBEROIRLTY 372.65(376.25)130336
OFSS 3552.9(3568.6)11350
OIL 282.05(282.35)279146
OMAXE 202.2(202.25)472977
ONGC 165.7(164)5908883
ORIENTBANK 136.05(136.45)2169560
ORIENTCEM 156(155.15)131611
ORISSAMINE 1780.75(1807.7)3790
PAGEIND 16706.4(16244.15)31319
PCJEWELLER 299.25(291.35)3875256
PEL 2851.55(2919.15)116565
PERSISTENT 605.95(615.55)56075
PETRONET 207.45(211.35)1371273
PFC 134.1(135.65)5511396
PFIZER 1798.7(1808.95)8515
PFS 39.15(40.1)1608549
PGHH 8104.3(8087.05)3895
PHOENIXLTD 513.25(511.6)247545
PIDILITIND 795.25(810.3)401181
PIIND 730.05(746.7)150504
PNB 148.3(148.8)7478797
POLARIS 232.8(229.9)159777
POWERGRID 221.9(222.9)2572746
PRAJIND 73.2(74.3)142924
PRESTIGE 263.25(263.9)285332
PRISMCEM 118.7(121.05)156686
PTC 117.1(118.65)2889014
PUNJLLOYD 19.9(20.5)1361322
PURVA 72.1(74.2)190375
PVR 1358(1409.65)228114
RADICO 146.4(147.7)607934
RAIN 131.45(132.8)1912374
RAJESHEXPO 718.4(738.3)213274
RALLIS 238.25(239.6)87284
RAMCOCEM 672.65(687.3)243408
RAMCOSYS 370.7(380.7)36058
RATNAMANI 834.7(832.2)10948
RAYMOND 781.15(775.8)715868
RCF 98.35(98.4)8338961
RCOM 22.2(22.9)14895690
RDEL 54.9(56.5)1903584
RECLTD 175.25(179.05)4800505
REDINGTON 142.7(142.95)183188
RELAXO 490.75(497.75)25183
RELCAPITAL 799.5(786.05)9824920
RELIANCE 1598.8(1602.55)2385643
RELINFRA 514.4(528.3)2291404
RENUKA 17.8(18.6)3830694
REPCOHOME 674.9(691.25)196194
RIIL 428.4(436.05)183623
RKFORGE 564.2(553.15)55487
ROLTA 54.55(55.15)266560
RPOWER 41.25(41.8)2658505
RTNPOWER 6.15(6.25)3115485
RUCHISOYA 22.05(22.25)555090
SADBHAV 283.95(287.65)430741
SADBHIN 101.35(102.95)6128
SAIL 61.45(62.95)4534693
SANOFI 4171.75(4217.85)19699
SBIN 302.3(303.65)15852734
SCHAEFFLER 4298(4357)890
SCHNEIDER 124.65(126.6)76949
SCI 90.6(88.35)3370376
SHARDACROP 445.55(450.1)56033
SHILPAMED 617.15(633.75)42791
SHK 257.05(259.6)54916
SHOPERSTOP 350.65(353.3)45891
SHREECEM 17945.95(17767.65)11297
SHRIRAMCIT 2140.45(2128.85)13788
SIEMENS 1325.75(1344.45)156259
SIMPLEXINF 471.85(462.4)18007
SINTEX 29.5(31.75)49157070
SITINET 25.3(25.45)533608
SJVN 32.7(32.95)327113
SKFINDIA 1541.15(1552.45)2920
SMLISUZU 986.85(995)10835
SNOWMAN 53.6(55.2)369101
SOBHA 373.4(378.4)450345
SOMANYCERA 757.5(756.65)5440
SONATSOFTW 153.55(156.3)82275
SOUTHBANK 27.7(28.55)10401206
SPARC 359.95(368.1)302231
SREINFRA 114.75(115.7)1671599
SRF 1435.45(1546.85)1081786
SRTRANSFIN 942.75(970.85)950776
STAR 978.55(1033.25)272802
STCINDIA 163(165.15)131786
SUNDARMFIN 1722.6(1756.15)14862
SUNDRMFAST 384.5(391.65)60548
SUNPHARMA 474.35(500.35)11025555
SUNTV 705.55(725.6)1648664
SUPREMEIND 1052.6(1049.8)66375
SUVEN 164.65(165.6)123262
SUZLON 16.3(16.65)55115949
SWANENERGY 121.7(124.65)226511
SYMPHONY 1335.6(1337.35)12303
SYNDIBANK 69(69.7)2817195
SYNGENE 451.65(464.55)95486
TAKE 146.6(142.75)137133
TATACHEM 579.05(596.05)2197681
TATACOFFEE 122.1(126)264086
TATACOMM 606.95(628.8)599884
TATAELXSI 1689(1716.9)300450
TATAGLOBAL 162.1(166)1267995
TATAMOTORS 416.05(430)10849567
TATAMTRDVR 242.25(248.45)1542621
TATAPOWER 77.8(78.25)2107243
TATASPONGE 819.75(841.5)120199
TATASTEEL 605.05(616.45)5202611
TBZ 100.3(104.8)259274
TCS 2512(2503.05)496473
TECHM 393.85(398.25)1135609
TECHNO 365.6(367.35)42070
TEXRAIL 90.5(92.25)407294
THERMAX 878.6(897.6)40462
THOMASCOOK 223.5(223.9)198828
TIDEWATER 5774.45(5802.75)720
TIMKEN 680.8(692.3)37655
TITAN 619.15(609.4)4440491
TNPL 360.25(362.65)119549
TORNTPHARM 1234.7(1270.2)124045
TORNTPOWER 195.5(197.9)1416685
TREEHOUSE 15.7(15.5)36736
TRIDENT 83.2(84.7)622214
TRITURBINE 131.7(133.65)24890
TTKPRESTIG 6194.05(6318.05)5049
TTML 6.95(7.25)2324584
TUBEINVEST 766.5(768.25)21593
TV18BRDCST 36.45(37.8)3139024
TVSMOTOR 590.7(595.3)580251
TVSSRICHAK 3438.85(3530.2)11608
TVTODAY 228.55(234.75)83948
UBL 832.35(820.95)758790
UCOBANK 31.85(31.95)613195
UFLEX 398.4(403.45)204913
ULTRACEMCO 3997.85(4056.7)141670
UNICHEMLAB 251.95(261.4)188652
UNIONBANK 141.6(142.4)3732422
UNITECH 7.85(8.05)56793956
UPL 830.5(863.35)1211850
VAIBHAVGBL 484.85(497.15)8973
VAKRANGEE 450.25(453.2)986719
VEDL 300.2(297.7)12367142
VIDEOIND 20.5(21.55)598729
VIJAYABANK 67.85(67)898490
VINATIORGA 1016.35(1068.7)28437
VIPIND 190.05(191.85)233820
VOLTAS 527.6(537.45)896586
VRLLOG 333.6(343.6)65751
VSTIND 2784.75(2923.7)2185
VTL 1195.05(1200.1)28782
WABAG 629.65(641.3)92042
WABCOINDIA 5492.1(5540.5)2560
WELCORP 125.15(127.75)344008
WELSPUNIND 78.45(80.6)640104
WHIRLPOOL 1173.6(1179.65)535592
WIPRO 286.5(287.4)1089850
WOCKPHARMA 584.8(592.25)369327
WONDERLA 345.1(343.7)155816
YESBANK 1741.55(1763.55)1982487
ZEEL 540(539.95)2995580
ZEELEARN 41.45(42.9)334897
ZENSARTECH 809.35(808.15)30775
ZYDUSWELL 885.05(885.3)3709

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు — BSE

ACI INFOCOM 6.95(6.64)10
ADITYA SPIN. 9.1(9.55)80
AGRO TECH FO 511(515.95)398
AISHWARYA TE 4.1(4.15)8750
ALPHAGEO (I) 806.15(827.2)4631
ALU FLUORIDE 56.45(57.85)12576
AMAR RAJA BA 802.45(801.2)22164
ANDHRA BANK 54.15(54.2)134569
ANDHRA CEMEN 9.06(9.53)40786
ANDHRA PETRO 25.6(26.5)26871
ANJANI PORTL 218.8(224.5)2660
ASTRA MICRO 126.75(129.25)36224
AUROB.PHARMA 684.15(726.55)550116
AVANTEL LTD 223.2(235.8)1991
AVANTI FEEDS 1703.9(1760.2)12763
B.N.RATHI SE 31.85(33.2)6447
BALAJI AMINE 322.85(328.2)1520
BAMBINO AGRO 180.95(180.05)1491
BARTRONICSIN 14.4(14.75)10006
BHAGIRA.CHEM 165.6(175.85)1531
BHAGYA INL 22.45(23.1)7259
BHARATFIN 796.35(815.55)96142
BNR UDYOG 36.1(38.55)3147
CAMBRIDGE 68.6(69.95)8420
CAT TECHN. .63(.6)200
CCHHL 13.55(14.16)69929
CCL PRODUCTS 283.2(280.55)13366
CELESTIAL 24.15(24.45)18538
CIL SECURITS 38(39.7)2586
COROM INTER 424.65(437.85)13558
CUBEX TUBING 16.9(17.65)6135
CYIENT 524.6(527.75)1271
DANLAW TECH. 46.9(49.55)759
DECAN CEMENT 1110.55(1122.6)1039
DIAMONPOWER 24.25(25.1)60272
DIVI'S LAB. 638.9(673.2)161515
DIVYA.GRANIT 98.05(98.35)1258
DQ ENT 13.1(13.3)4835
DR.REDDY'S 2046.65(2101.7)114454
EMPEE SUGARS 5.59(5.79)9728
EVEREST ORG. 102.85(98)5000
FACOR ALLOYS 3.7(3.88)273795
FIRSTOBJ 15.7(15.45)4792
GATI LTD. 114.3(117.8)80994
GAYATRI PROJ 160(164.1)6545
GENNEX LAB 4.19(4.39)162240
GMR INFRASTR 16.95(17.7)2931706
GODAVARI DRU 38.4(40)3915
GOLDST INFRA 92.95(86.85)105455
GOLDSTONE EN 12.23(11.91)61336
GRANULES (I) 116.9(126.9)238073
GVK POWERINF 12.93(12.7)4202856
HBL P SYS 44.75(46.15)36225
HERITGFOOD 1285.45(1308.7)2424
I.C.S.A. IND 2.87(2.86)8373
INCAP LTD. 50.65(52.35)2183
IPAPPM 299.7(300.2)12307
IVRCL LTD 5.69(5.87)502129
KAKATIYA CEM 365.75(374.9)5117
KALLAM SPG. 28(26.7)99286
KARAN WOO-SN 1(.99)2200
KAVERI SEED 607.8(659)160595
KCP LTD 100.15(101.4)18956
KERNEX MICRO 34.1(35.6)12132
KNR CONST 203.1(208.25)2015
KREBS BIOCHM 99.65(101.9)652
LANCO INFRA 1.05(1.1)934938
LOKESH MACH 79.7(81.4)18184
MADHUCON PRJ 29.95(31)41437
MOLD-TEK TEC 51.75(51)6126
MOSCHIP SEMI 45.6(46.75)60950
MSR INDIA 26.3(25.05)7667
N C L IND. 207.05(208.6)11791
NAGAR.AGRICH 33.7(35.4)79466
NATCO PHARM 830.6(925.25)117366
NCC 89.65(89.15)941844
NEHA INTER. 5.54(6.07)124506
NETTLINX LTD 107.15(108.8)3473
NEULAND LAB. 1355.6(1378.8)139
NIHAR INFO 17(16.5)600
NILE LTD. 621.55(625.2)5853
NTL 4.2(4.2)10900
OIL COUNTRY 44.1(44.55)3085
PADMALAYA TE 8.62(9.07)36373
PALRED 91.2(97.9)19010
PANYAM CEMEN 60.6(61.45)12027
PENNAR STEEL 51.15(53.2)47592
PFL INFOTECH 5.76(5.77)18658
PHYTOCHEM I. 55.45(58.2)2816
PITTI LAMIN. 50.95(52)1562
POKARNA LTD 1228.35(1293.4)1717
PRAJAY ENGS. 9.02(9.09)22347
PREMIER EXPL 459.25(465.45)1810
PRISM CEMENT 117.6(120.2)20776
RAIN 131.6(132.9)423236
RAJ PACKAGIN 55.2(55.7)7252
REG.CERAMIC 5.55(5.5)2503
RESTILE CER. 5.51(5.56)10367
SAGAR CEM. 824.5(824.35)829
SAMKRG PIST. 263.1(288.05)31026
SAMPRE NUTRI 41.7(43.5)1920
SANGHI IND. 84.55(89.3)432330
SATVAH.ISPAT 40.75(41.8)5552
SAVEN TECHNO 22.8(23.45)3546
SIBAR AUTO 12.53(11.94)10
SMPL 1.76(1.85)49672
SMS PHARMACE 73.55(75.75)8688
SREE RAYALA 125.8(129.65)1124
STEEL EXCH 82.85(84.4)59117
SUJANA INDUS 1.01(1.05)133337
SURANATP 4.8(4.71)33650
SURYACHAKRA 1.23(1.33)244050
SURYAMBA SP 56.05(56)161
SURYLAK.COTT 103.75(104.7)1800
SUVEN LIFE S 164.65(165.2)28393
TAJ GVK HOTL 162.25(162.85)5408
TANLA 33.15(33.9)62014
TRANSCORP IN 18.9(19.95)4464
TRANSGENE BI 2.22(2.33)31520
TRANSPORT CO 280.35(290.5)7367
USHER AGRO 7.14(7.51)42741
VICEROY HOTE 18.3(19.25)53622
VIJAY TEXTIL 60.9(60.3)26967
VIMTA LABS 135.3(136.4)5159
VIRAT CRANE 36(36.65)1116
VIRINCHI 84.45(88.35)50995
VISAKA IND. 459.85(475.2)8484
VISTA PHARMA 30.65(30.8)54869
VIVIMED LABS 116.55(118.65)134928
VST INDUS. 2798.2(2931.05)212
WATERBASE 107.45(108.15)102553
XLENERGY 1.76(1.8)2124
YBRANTDIGI 6.81(6.97)35723
ZEN TECH 54.05(55.2)8282
ZENOTECH 47.4(49.7)20145

▼ 216.35 సెన్సెక్స్ 31797.84	▼ 70.50 నిఫ్టీ 9908.05	▲ 140 బంగారం (ముంబై) 28,730 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)	▲ 600 వెండి 37,875 కిలో (రూపాయల్లో)	▼ రూపాయి Vs డాలర్ 63.84	▲ ముడి చమురు 52.23 బ్యారెల్ ధర (డాలర్లలో..)



కొత్త ఫోన్లను విడుదల చేస్తున్న నటి తాప్సీ, మనీష్‌శర్మ


రూ.2,000 కోట్ల రాబడిపై పానసోనిక్ కన్ను

ఎ3, ఎ3 ప్రో ఫోన్ల విడుదల

న్యూఢిల్లీ: ఈ ఏడాది భారత మార్కెట్లో స్మార్ట్‌ఫోన్ల వ్యాపారం ద్వారా 2,000 కోట్ల రూపాయల రాబడిని సాధించాలని పానసోనిక్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు అనుగుణంగా కొత్త మొబైల్స్‌ను విడుదల చేయడంతోపాటు జోరుగా మార్కెటింగ్ కార్యకలాపాలు చేపట్టాలనుకుంటోంది. ఈ ఏడాదిలో 28 ఫోన్లను విడుదల చేయాలని కంపెనీ ప్రణాళికలు రచించింది. వీటి ధరల శ్రేణి 6,000 రూపాయల నుంచి 20,000 రూపాయల వరకు ఉండనుంది. జైనా కంపెనీతో తెగతెంపులు చేసుకున్నామని, ఇక నుంచి సొంతంగానే వ్యాపారం నిర్వహించనున్నట్టు పానసోనిక్ ఇండియా బిజినెస్ హెడ్ (మొబిలిటీ డివిజన్) పంకజ్ రానా తెలిపారు. భారత కస్టమర్లకు తగిన ఉత్పత్తులను తీసుకువచ్చేందుకు గత కొన్ని నెలలుగా కసరత్తు చేశామని, వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పారు. వచ్చే 30-40 రోజుల్లోనే 11 మొబైల్స్‌ను ఆఫ్‌లైన్ మార్కెట్ ద్వారా అందుబాటులోకి తెస్తామన్నారు. కొత్తగా తీసుకువచ్చే 28 ఫోన్లలో 20 ఆఫ్‌లైన్ స్టోర్ల ద్వారా అందుబాటులో ఉంటాయని చెప్పారు. బుధవారంనాడిక్కడ ఎలుగా ఎ3, ఎ3 ప్రో స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వీటి ధర వరుసగా 11,290 రూపాయలు, 12,790 రూపాయలుగా ఉంది. ఎ3తో 3జిబి రామ్, 16జిబి ఇంటర్నల్ మెమరీ, 4000 ఎంఎహెచ్ బ్యాటరీ, 8 ఎంపి ముందు కెమెరా, 13 ఎంపి వెనుక కెమెరా వంటి ఫీచర్లున్నాయి. ఎ3ప్రోలో 3జిబి రామ్, 32 జిబి ఇంటర్నల్ మెమరీ, 4000ఎంఎహెచ్ బ్యాటరీ, 13 ఎంపి వెనుక, 8 ఎంపి ముందు కెమెరాలున్నాయి.

క్యూ1 సీజన్ తర్వాత బ్యాంకుల విలీనం

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18) మొదటి త్రైమాసిక ఫలితాల సీజన్ ముగిసిన తర్వాత బ్యాంకుల విలీనం, కన్సాలిడేషన్‌పై దృష్టి సారించాలని ప్రభుత్వం యోచిస్తోంది. బ్యాంకుల విలీనంపై నిర్ణం తీసుకోవడానికి ముందు ఆయా బ్యాంకుల ఆర్థిక పనితీరుతోపాటు పలు అంశాలు పరిశీలించాల్సి ఉంటుందని ఆర్థికమంత్రిత్వ శాఖ అధికారి ఒకరన్నారు. ఆర్థిక పనితీరు అనంతరం ప్రాంతీయ సమతుల్యత, భౌగోళిక విస్తరణ, ఆర్థిక భారం, సరళమైన రీతిలో మానవ వనరుల బదిలీ వంటి అంశాలన్నీ పరిగణనలోకి వస్తాయని ఆయన అన్నారు. అంతే కాదు ఆర్థికంగా అత్యంత బలంగా ఉన్న బ్యాంకులో ఆర్థికంగా అత్యంత బలహీనంగా ఉన్న బ్యాంకును విలీనం చేయడం కూడా మంచిది కాదని, దీని వల్ల బలంగా ఉన్న బ్యాంకు కూడా నీరసపడే ప్రమాదం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఏది ఏమైనా బ్యాంకుల విలీనం, కన్సాలిడేషన్ అనేది ఒక సంక్లిష్టమైన ప్రక్రియని, జూన్ త్రైమాసికం ఫలితాల ప్రకటన పూర్తయిన తర్వాత ఈ దిశగా ఒక అడుగు



ముందుకు పడే ఆస్కారం ఉందని పేరు వెల్లడించడానికి నిరాకరించిన ఆ అధికారి చెప్పారు. దేశీయంగాను, అంతర్జాతీయంగాను ఎదురవుతున్న పోటీని తట్టుకోవడంతో పాటు కాపిటల్ యాడిక్వసీ మెరుగుదల కోసం దేశంలో ఆరు లేదా ఏడు పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రమే ఉండాలని ప్రభుత్వం భావిస్తున్న విషయం విదితమే. పిఎస్‌బిల కన్సాలిడేషన్ ఇప్పుడే కాదని ప్రభుత్వం గత వారంలో ప్రకటించినప్పటికీ ఆ దిశగా ముందడుగు వేయడం తప్పనిసరి అన్న సంకేతాలు పలువర్గాల నుంచి వెలువడుతున్నాయి. కొద్ది రోజుల క్రితం, స్టేట్ బ్యాంక్ గ్రూప్‌లోని ఐదు అనుబంధ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంకు ఎస్‌బిఐలో విలీనం అయ్యాయి. ఈ విలీనంతో ఎస్‌బిఐ కస్టమర్ల సంఖ్య 37 కోట్లకు, బ్రాంచీల సంఖ్య 24 వేలకు, ఎటిఎంల సంఖ్య 59 వేలకు చేరింది. బ్యాంకు డిపాజిట్లు 26 లక్షల కోట్ల రూపాయలకు, రుణాలు 18.50 లక్షల కోట్ల రూపాయలకు చేరింది. ఆ తరహాలోనే ఇతర పిఎస్‌బిలను కూడా విలీనం చేయాలన్నది ప్రభుత్వ యోచనగా చెబుతున్నారు.

దక్షిణాది మార్కెట్లోకి మహీంద్రా 'జివో'

బెంగళూరు: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) చిన్న ట్రాక్టర్ 'మహీంద్రా జివో'ను దక్షిణాది మార్కెట్లోకి విడుదల చేసింది. అత్యాధునిక టెక్నాలజీతో తెచ్చిన 4డబ్ల్యుడి మోడల్ ట్రాక్టర్ ధర 4 లక్షల రూపాయలు (ఎక్స్‌షోరూమ్, కర్ణాటక). వరుసలుగా సాగు చేసే పంటలకు, ఉద్యాన పంటలకు ఈ ట్రాక్టర్ సరిగ్గా సరిపోతుందని కంపెనీ అధికారులు తెలిపారు. 4డబ్ల్యుడి వెర్షన్ ట్రాక్టర్ 24 హెచ్‌పితో, పిటిఒ శక్తి ట్రాక్టర్ 22 హెచ్‌పితో లభిస్తుందని చెప్పారు. "దక్షిణాది మార్కెట్లోకి తొలిసారిగా ఈ ట్రాక్టర్‌ను విడుదల చేస్తున్నాం. కర్ణాటక మార్కెట్ నుంచి ఈ ట్రాక్టర్‌కు మంచి స్పందన లభిస్తుందని ఆశిస్తున్నాం" అని మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ సెక్టార్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) రవీంద్ర సహానే బుధవారంనాడిక్కడ విలేకరులకు తెలిపారు. జివో విడుదలతో వృద్ధి చెందుతున్న ఉద్యానవన పంటల విభాగంలోకి ప్రవేశించినట్టయిందని ఆయన చెప్పారు. మారిన రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ట్రాక్టర్‌ను రూపొందించామని, ఇది రైతులకు మంచి ఎంపికగా ఉంటుందని పేర్కొన్నారు. 45.8 శాతం వాటాతో ట్రాక్టర్ల మార్కెట్లో మహీంద్రా లీడర్‌గా ఉందని, దేశీయ మార్కెట్లో ఈ ఏడాది ఆరు లక్షల ట్రాక్టర్లు అమ్ముడయ్యే అవకాశం ఉందని సహానే తెలిపారు. జివో ప్లాట్‌ఫామ్‌పై 20 హెచ్‌పి 2డబ్ల్యుడి ట్రాక్టర్‌ను కూడా తెచ్చే యోజనలో ఉన్నామని, దీన్ని ఈ ఏడాది అక్టోబర్-డిసెంబర్‌లో విడుదల చేసే అవకాశం ఉందని ఆయన చెప్పారు.



ధర రూ.4 లక్షలు

లెనోవో నుంచి కె8 నోట్

ధర రూ.12,999



న్యూఢిల్లీ: చైనాకు చెందిన లెనోవో.. కె8 నోట్ స్మార్ట్ ఫోన్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. ఆగస్టు 18 నుంచి ఈ ఫోన్ అమెజాన్‌లో అందుబాటులో ఉంటుంది. 3జిబి రామ్, 32 జిబి ఇంటర్నల్ మెమరీ కలిగిన ఫోన్ ధర 12,999 రూపాయలుండగా.. 4జిబి రామ్, 64 జిబి ఇంటర్నల్ మెమరీ ఉన్న వెర్షన్ ధర 13,999 రూపాయలుగా ఉంది. ఈ ఫోన్‌లో 5.5 అంగుళాల డిస్‌ప్లే, 2.3 గిగాహెట్జ్ 10 కోర్ ప్రాసెసర్, 13 ఎంపి+5 ఎంపి డ్యూయల్ వెనుక కెమెరా, 13 ఎంపి ముందు కెమెరా, 4000 ఎంఎహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్లు ఈ ఫోన్‌లో ఉన్నాయి.

పన్ను వసూళ్లలో 19 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు మాసాల కాలంలో (ఏప్రిల్-జూలై) ప్రత్యక్ష పన్ను వసూళ్లు 19 శాతం పెరిగాయి. గత నవంబర్‌లో అధిక విలువ గల కరెన్సీ నోట్ల రద్దుతో ఎక్కువ మంది పన్ను చెల్లింపుదారుల పరిధిలోకి రావడం పన్ను వసూళ్ల పెరుగుదలకు దోహదపడింది. వ్యక్తిగత, కార్పొరేట్ పన్నులు భాగంగా ఉన్న ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఏప్రిల్-జూలై నెలల మధ్య కాలంలో 1.90 లక్షల కోట్ల రూపాయలని గణాంకాల ద్వారా తెలుస్తోంది. బడ్జెట్ అంచనాల్లో ఇది 19.5 శాతంతో సమానం. కార్పొరేట్ ఆదాయపు పన్ను వసూళ్లు 7.2 శాతం, వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు 17.5 శాతం పెరిగాయి. ఇదే కాలంలో 61,920 కోట్ల రూపాయల మేరకు పన్ను రిఫండ్‌లు నమోదయ్యాయి. ఈ వారం ప్రారంభంలోనే ప్రభుత్వం ప్రకటించిన గణాంకాల ప్రకారం ఇప్పటివరకు దేశంలో 2.83 కోట్ల టాక్స్ రిటర్న్‌లు దాఖలయ్యాయి. గత ఏడాది దాఖలైన రిటర్న్‌లు 2.27 కోట్లతో పోల్చితే ఇది 24.7 శాతం అధికం. డీమానిటైజేషన్ అనంతరం భారీ సంఖ్యలో పన్ను చెల్లింపుదారులు జత అయ్యారని ఈ గణాంకాలు చెబుతున్నట్టు సిబిడిటి పేర్కొంది.

కొరియా నుంచి భారీగా బంగారం దిగుమతులు



న్యూఢిల్లీ : దక్షిణ కొరియా నుంచి బంగారం దిగుమతులు భారీ స్థాయిలో పెరిగిపోతుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ దేశం నుంచి దిగుమతులను కట్టడి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు దక్షిణ కొరియా నుంచి మన దేశంలోకి దిగుమతి అయిన బంగారం విలువ 33.86 కోట్ల డాలర్లకు చేరింది. 2016-17 సంవత్సరంలో పసిడి దిగుమతులు 7.04 కోట్ల డాలర్లు మాత్రమే ఉన్నాయి. పెరుగుతున్న బంగారం దిగుమతులను కట్టడి చేసేందుకు తమ వద్ద తగినగ యంత్రాంగం ఉందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. సేఫ్ గార్డ్ డ్యూటీని వినియోగించి కూడా బంగారం దిగుమతులను తగ్గించే అవకాశం ఉంటుందని, అంతకన్నా ముందు ఎక్కడ లోపాలున్నాయో గుర్తించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. భారత్, దక్షిణ కొరియా మధ్య ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం మేరకు ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని తొలగించారు. జిఎస్‌టి అమలు నేపథ్యంలో 12.5 శాతం కౌంటర్‌వెయిలింగ్ సుంకం లేకుండా పోయింది. ప్రస్తుతం బంగారం దిగుమతులపై కేవలం 3 శాతం ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి అమలవుతోంది. పలు దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలున్న నేపథ్యంలో ఆయా దేశాల నుంచి కూడా బంగారం దిగుమతులు పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం బంగారం దిగుమతులపై 10 శాతం కస్టమ్స్ సుంకం అమల్లో ఉంది. జిఎస్‌టికన్నా ముందు కస్టమ్స్ సుంకం, ఐజిఎస్‌టి ద్వారా జూలైలో 30,000 కోట్ల రూపాయలు వసూలయ్యాయి. బంగారం వినియోగంలో చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉంది. ఆభరణాల పరిశ్రమ నుంచి డిమాండ్ అధికంగా ఉన్న ఫలితంగా బంగారం దిగుమతులు పెరుగుతున్నాయి.

ఎయిర్ ఇండియా అప్పుల్లో కొంతైనా మాఫీ చేయాలి

- అప్పుడే కొనేవాళ్లు ఆసక్తి చూపుతారు
- నీతి ఆయోగ్ చీఫ్ పనగడియా



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించాలంటే ఆ సంస్థకు ఉన్న భారీ అప్పుల్లో కొంతైనా మాఫీ చేయడం తెలివైన పని అని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అరవింద్ పనగడియా సూచించారు. ఈ ఏడాది మార్చి నాటికి ఎయిర్ ఇండియాకు రూ.48,876.81 కోట్ల అప్పులున్నాయి. ఈ అప్పుల మీద కంపెనీ ఏటా దాదాపు రూ.6,000 కోట్ల వడ్డీలు చెల్లిస్తోంది. ఇంత పెద్ద మొత్తంలో అప్పులున్న కంపెనీని కొనేందుకు లేదా కంపెనీలో మెజారిటీ వాటా తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవచ్చని నీతి ఆయోగ్ భావిస్తోంది. దీంతో ఎయిర్ ఇండియాని ప్రైవేటీకరించాలంటే ఈ అప్పుల్లో ఎంతో కొంత ప్రభుత్వం మాఫీ చేయాలని పనగడియా సూచించారు. అయితే అప్పుల్లో ఎంత భాగం మాఫీ చేయాలనే విషయం నిర్ణయించేందుకు ప్రభుత్వం నియమించే సలహాదారులే దీనిపై సలహాదారులే సమర్థులున్నారు. ఎయిర్ ఇండియా ఆస్తులను విడివిడిగా అమ్మాల్సిన అవసరమూ లేదన్నారు. రియల్ ఎస్టేట్ ఆస్తులూ ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణలో భాగమని చెప్పారు. పీకల్లోతు నష్టాలతో అరకొర లాభాలు ఆర్జిస్తున్న ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణకు కేంద్ర కేబినెట్ ఈ సంవత్సరం జూన్ నెలాఖరులో ఆమోదం తెలిపింది. ఇందుకోసం అనుసరించాల్సిన విధి విధానాలు ఖరారు చేసేందుకు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది.

వివిఫై ఇండియా రూ.100 కోట్ల సమీకరణ!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన ఫిన్‌టెక్ స్టార్టప్ కంపెనీ వివిఫై ఇండియా ఫైనాన్స్ 100 కోట్ల రూపాయలను సమీకరించేందుకు సన్నాహాలు చేస్తోంది. బుధవారంనాడిక్కడ ఫ్లెక్స్‌సాలరీని విడుదల చేసిన సందర్భంగా కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనిల్ పినపాల మాట్లాడుతూ..ప్రస్తుతం సొంత వనరులతో సంస్థ కార్యకలాపాలు సాగిస్తుండగా రుణ వితరణ, కార్యకలాపాల విస్తరణ కోసం ఈ మొత్తాలను సమీకరించాలని చూస్తున్నట్లు చెప్పారు. భారత సంస్థాగత రుణ వితరణ వ్యాపారం 72 లక్షల కోట్ల రూపాయలుగా ఉండగా ఇందులో 40 శాతం అసంఘటిత రంగంలో ఉందని ఆయన తెలిపారు. అసంఘటిత రంగం వాటా 34 లక్షల కోట్ల రూపాయలని ఆయన పేర్కొన్నారు. దేశీయ రుణ వితరణ అవసరాలను సాంప్రదాయిక బ్యాంకులు కేవలం 35 శాతం మాత్రమే తీరుస్తున్నాయని చెప్పారు. ఇవి కూడా దీర్ఘకాలిక రుణాలను మాత్రమే ఇస్తాయని దీన్ని దృష్టిలో ఉంచుకుని స్వల్పకాలిక రుణ అవసరాలను తీర్చేందుకు ఫ్లెక్స్‌సాలరీని తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. ఫ్లెక్స్‌సాలరీ కింద 2,000 రూపాయల నుంచి రెండు లక్షల రూపాయల వరకు రుణ సదుపాయాన్ని కల్పించనున్నట్లు చెప్పారు. నెలకు 10 వేల రూపాయల లోపు వేతనం కలిగిన వారికి కూడా రుణాలను అందించనున్నట్లు అనిల్ తెలిపారు. వారం రోజుల కోసం పది వేల రూపాయల రుణం తీసుకుంటే 70 రూపాయల వడ్డీని వసూలు చేయనున్నట్లు చెప్పారు.

తెలంగాణ ఇ-వే బిల్లుపై నోటిఫికేషన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): సరుకుల రవాణాకు సంబంధించి తెలంగాణ జిఎస్‌టి చట్టంలో ఇ-వే బిల్లు వ్యవస్థను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. నిజానికి ఈ వ్యవస్థ వ్యాట్ చట్టం అమల్లో ఉన్నప్పుడూ ఉంది. జిఎస్‌టి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత, ఇ-వే బిల్లు వ్యవస్థను కేంద్రం రూపొందించాల్సి ఉంది. ఈ నెల 5న జరిగిన జిఎస్‌టి మండలి ఇందుకు ఆమోదం కూడా తెలిపింది. అయితే దీనికి సంబంధించి మరింత సమయం పట్టే అవకాశం ఉడడంతో తెలంగాణ జిఎస్‌టి చట్టం కిందే ఇ-వే బిల్లు వ్యవస్థను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టిజిఎస్‌టి కింద రిజిస్టర్ చేసుకున్న ప్రతి వ్యాపారీ తన సరుకులు రవాణా చేసేటప్పుడు ఆన్‌లైన్ ద్వారా ఇ-వే బిల్లును జనరేట్ చేసుకోవాల్సి ఉంటుంది. చట్టంలో మినహాయింపు లేనివీ... రూ.50 వేల విలువ మించిన వస్తువుల రవాణా సమయంలో ఈ వే బిల్లు అవసరం ఉంటుంది.

Q1 ఫలితాలు

నిరాశ పరిచిన టాటా మోటార్స్

న్యూఢిల్లీ: జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో టాటా మోటార్స్ ఆర్థిక ఫలితాలు మార్కెట్‌ను నిరాశ పరిచాయి. అనుబంధ కంపెనీలను కలుపుకుని (కన్సాలిడేటెడ్) కంపెనీ ఈ త్రైమాసికానికి రూ.3,199.93 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదేకాలంతో పోలిస్తే ఇది దాదాపు 42 శాతం ఎక్కువ. కంపెనీ బ్రిటిష్ అనుబంధ సంస్థ అయిన జెఎల్ఆర్ ఉద్యోగుల పెన్షన్ పథకంలో మార్పులు చేయడం ద్వారా మిగిలిన రూ.3,609 కోట్లు ఇందుకు ప్రధాన కారణం. బ్రిటిష్ పౌండ్‌తో రూపాయి మారకం బక్కచిక్కడం కూడా ఇందుకు కలిసొచ్చింది. లేకపోతే కన్సాలిడేటెడ్‌గా చూసినా అత్తెసరు లాభాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చేది. అయినా గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో టాటా మోటార్స్ కన్సాలిడేటెడ్ ఆదాయం 9.59 శాతం తగ్గి రూ.59,818.22 కోట్లకు పడిపోయింది. ఇదే కాలంలో కంపెనీ వాణిజ్య, ప్రయాణికుల వాహనాల ఎగుమతులకూ గండి పడింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఎగుమతులు 11.8 శాతం తగ్గాయి.

దెబ్బతీసిన అంశాలు

పోటీని తట్టుకునేందుకు జెఎల్ఆర్ వాహనాలతో పాటు అన్ని వాహనాల అమ్మకాలపై మరిన్ని ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి రావడం, అలా ఇచ్చినా చైనా మినహా అన్ని మార్కెట్లలో అమ్మకాలు అనుకున్న స్థాయిలో పెరగక పోవడమూ కంపెనీ రాబడులను దెబ్బతీసింది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలోనూ దేశీయ మార్కెట్ టాటా మోటార్స్‌కు పెద్దగా కలిసి రాలేదు. భారీ, మధ్య తరహా వాణిజ్య వాహనాల అమ్మకాలు తగ్గాయి. తేలికపాటి వాణిజ్య వాహనాల అమ్మకాల్లోనూ ఎదుగూ బొదుగు లేదు. ప్రయాణికుల వాహనాల అమ్మకాల్లోనే కొద్దిపాటి వృద్ధి రేటు కనిపించింది.

అనుబంధ కంపెనీలు మినహాయిస్తే నష్టాలు

అనుబంధ కంపెనీల వ్యాపారాలను పక్కన పెట్టి కేవలం టాటా మోటార్స్ ఆర్థిక ఫలితాలను మాత్రమే తీసుకుంటే తొలి త్రైమాసికంలో రూ.467.05 కోట్ల నష్టం వచ్చింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.25.75 కోట్ల లాభాలు ఆర్జించింది. స్థూల ఆదాయమూ రూ.11,434.91 కోట్ల నుంచి రూ.10,375.32 కోట్లకు పడిపోయింది.



'తొలి త్రైమాసికం ఆర్థిక ఫలితాలు మా అంచనాలకు తగ్గట్టు లేవు. వాణిజ్య, ప్రయాణికుల వాహనాల అమ్మకాలు పెంచుకోవడంపై ఇక మరింత దృష్టి పెడతాం.

- గుంటెర్ బుచెక్, ఎండి, సిఇఒ, టాటా మోటార్స్

లాభాల బాటలో బ్యాంక్ ఆఫ్ ఇండియా

- క్యూ1 లాభం రూ.87.71 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.87.71 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో బ్యాంక్ రూ.741.36 కోట్ల భారీ నష్టం ప్రకటించింది. స్థూల, నికర మొండి బకాయిల(ఎన్‌పిఎ) భారం తగ్గడం ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో బ్యాంకుకు బాగా కలిసొచ్చింది. ఇదే కాలంలో బ్యాంక్ స్థూల ఆదాయమూ రూ.10,664.36 కోట్ల నుంచి రూ.11,106.61 కోట్లకు చేరింది. 'బకాయిల వసూళ్లు, ఆధునికీకరణ, బకాయిలు మొండి బకాయిలుకాకుండా తీసుకున్న జాగ్రత్తలు బాగా పని చేశాయి. ఇదే తరహాలో పని చేస్తూ వచ్చే త్రైమాసికాల్లోనూ మంచి ఆర్థిక ఫలితాలు సాధిస్తాం' అని బ్యాంక్ ఎండి, సిఇఒ దీనబంధు మహాపాత్ర విలేకరులతో చెప్పారు. ప్రభుత్వ నుంచి ఈ ఆర్థిక సంవత్సరం రూ.2,500 కోట్ల మూలధన సాయం అందుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు.

11 శాతం తగ్గిన అరబిందో లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నిరుత్సాహకరమైన ఫలితాలను ప్రకటించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 11.38 శాతం తగ్గి 518.33 కోట్ల రూపాయలుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం 584.90 కోట్ల రూపాయలుగా ఉంది. త్రైమాసిక కాలంలో మొత్తం రాబడులు కూడా 2.25 శాతం క్షీణించి 3,766.6 కోట్ల రూపాయల నుంచి 3,678.70 కోట్ల రూపాయలకు పడిపోయాయి. యూరోపియన్ వ్యాపారం వృద్ధి పథంలో ఉన్నప్పటికీ అమెరికాలో జెనరిక్ విక్రయాలు స్తబ్దుగా ఉండటం, ఎపిఐ రాబడులు తగ్గటంతో పాటు యాంట్రీరెట్రోవైరల్ విక్రయాలు తగ్గటం అరబిందో పనితీరుపై ప్రభావం చూపించింది. ఈ కాలంలో యుఎస్ విక్రయాలు 1,703.90 కోట్ల రూపాయల నుంచి 1,694.90 కోట్ల రూపాయలకు తగ్గగా యూరప్‌లో ఫార్ములేషన్ అమ్మకాలు 10.4 శాతం వృద్ధి చెంది 917.60 కోట్ల రూపాయలుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో యాంటీరెట్రోవైరల్ విక్రయాలు 303 కోట్ల రూపాయల నుంచి 244.6 కోట్ల రూపాయలకు పడిపోగా ఎపిఐ అమ్మకాలు 734.50 కోట్ల రూపాయల నుంచి 625 కోట్ల రూపాయలకు పడిపోయాయి.

కంపెనీ ఫార్ములేషన్ వ్యాపారంలో అమెరికా వాటా 46 శాతంగా ఉండగా యూరోపియన్ యూనియన్ వాటా 25 శాతంగా ఉంది. కాగా త్రైమాసిక కాలంలో కంపెనీ మొత్తం వ్యయాలు 3,004 కోట్ల రూపాయలుగా ఉన్నాయి. సమీక్షా కాలంలో పరిశోధన అభివృద్ధి (ఆర్ అండ్ డి) కోసం 162.30 కోట్ల రూపాయలు వెచ్చించినట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. మొత్తం రాబడుల్లో ఇది 4.4 శాతమని కంపెనీ తెలిపింది. కీలక మార్కెట్లలో అవాంతరాలు ఎదురైనప్పటికీ నిలకడైన వృద్ధిని నమోదు చేసుకుంటూ వచ్చినట్లు అరబిందో ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ గోవిందరాజన్ తెలిపారు. ఎప్పటికప్పుడు ఉత్పత్తుల పోర్టుఫోలియోను మార్చుకోవటం ద్వారా వృద్ధిపథంలోకి దూసుకుపోవాలని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత వ్యాపారాలను పటిష్ఠం చేయటంతో పాటు వివిధ రకాల ఔషధాల అభివృద్ధి, స్పెషాలిటీ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావటంపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు గోవిందరాజన్ తెలిపారు. కాగా త్రైమాసిక కాలంలో యుఎస్ ఎఫ్‌డిఎ నుంచి 17 న్యూ అబ్రివేటెడ్ డ్రగ్ అప్లికేషన్స్ (అండా)కు తుది అనుమతులు లభించగా 3 అండాలకు తాత్కాలిక అనుమతులు అందుకున్నట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. అయితే ఈ కాలంలో 3 ఇంజెక్టబుల్ ఔషధాలు సహా మొత్తం 15 ఔషధాలను మార్కెట్లోకి విడుదల చేసినట్లు కంపెనీ తెలిపింది.

ఐషర్ మోటార్స్ లాభం రూ.459 కోట్లు

ప్రముఖ వాణిజ్య వాహనాల తయారీ కంపెనీ ఐషర్ మోటార్స్ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలోనూ మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.2,332.67 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.459.62 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 29.49 శాతం, నికర లాభం 22.14 శాతం పెరిగాయి. ఇదే సమయంలో కంపెనీ ఖర్చులూ 26.89 శాతం పెరిగి రూ.1,680.56 కోట్లకు చేరాయి.

'వస్త్ర' విధ్వంసం!

జీఎస్టీతో టెక్స్‌టైల్స్‌కు చావుదెబ్బ.. కొత్త పన్నుతో దిగుమతులే చౌక

- వెల్లువెత్తనున్న చైనా, శ్రీలంక దుస్తులు
- ఉపాధికి, ఆర్థిక వృద్ధికి తీరని నష్టం
- చారెడు లాభానికి బారెడు పేపర్‌వర్క్

(ఆంధ్రజ్యోతి బిజినెస్ బ్యూరో)

గతంలో తాన్లు, తువ్వాళ్లు, చీరల అమ్మకాలపై పన్ను ఉండేది కాదు. ఇప్పుడు వాటిపై 5% జీఎస్టీ విధించారు. రెడీమేడ్ దుస్తులపై గతంలో 5% వ్యాట్ వసూలు చేసే వారు. ఇప్పుడు వెయ్యిలోపు దుస్తులపై 5%, వెయ్యి దాటితే 12% జీఎస్టీ ఖరారు చేశారు.

ప్రస్తుతం చైనా, బంగ్లాదేశ్, శ్రీలంక నుంచి దేశీయ టెక్స్‌టైల్స్ పరిశ్రమకు ముప్పు పొంచి ఉంది. ఈ దేశాల నుంచి దిగుమతుల ప్రవాహం మొదలైతే లక్షల సంఖ్యలో దేశీయంగా ఉద్యోగాలు గల్లంతయ్యే ప్రమాదం ఉంది. దేశీయ ఆర్థిక రంగానికి, ఉపాధి కల్పనకు కీలకమైన రంగాలను అస్థిరపరచకుండా జీఎస్టీ రేట్లను ప్రభుత్వం ఖరారు చేస్తే బాగుండేదని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి.

.. వస్త్ర వ్యాపారంపై జీఎస్టీ ప్రభావానికి ఈ రెండూ ఉదాహరణలు. ఉపాధి కల్పన, ఆర్థిక వృద్ధికి అత్యంత కీలకమైన పలు రంగాల్లో జీఎస్టీ అమలుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. దేశంలో ఉపాధి కల్పనకు సంబంధించి అతి పెద్ద వాటా ఉన్న రంగాల్లో టెక్స్‌టైల్ ఒకటి. జీఎస్టీ దెబ్బకు టెక్స్‌టైల్ పరిశ్రమలు, ముఖ్యంగా చిన్న సంస్థలు బెంబేలెత్తిపోతున్నాయి. సూరత్ వంటి నగరాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా ప్రభుత్వం పట్టించుకోలేదు.

చిన్న సంస్థలే ఎక్కువ

దేశంలో టెక్స్‌టైల్ రంగంలో 60% వాటా మర మగ్గాలదే. 10-20% మగ్గాలతో చిన్న వ్యాపారులు అవ్యవస్థీకృత రంగంలో విస్తరించి ఉన్నారు. వీరిలో చాలామంది జాబ్ వర్క్ చేస్తుంటారు. మరికొందరు యార్న్ కొనుగోలు చేసి వస్త్రాలు తయారు చేస్తుంటారు. ఇప్పటి వరకు ఈ రంగం పన్ను పరిధిలో లేదు. ఈ రంగంలో బిజినెస్ అత్యధిక శాతం నగదులోనే సాగుతుంది. జీఎస్టీ అమలుతో ఈ రంగంలో మార్పులొచ్చాయి. జీఎస్టీలో నగదు లావాదేవీలు నడవవు. ఇ-వే బిల్స్, సరుకులు, ఇన్వాయిస్ బిల్లుల తనిఖీ.. ట్రేడర్లలో వణుకు పుట్టిస్తున్నాయి. అంతేనా, టెక్స్‌టైల్స్ పరిశ్రమలో ఉత్పత్తి ప్రక్రియ చాలా సంక్లిష్టంగా ఉంటుంది. చిన్న వ్యాపారులంతా యార్న్ కొనుగోలు నుంచి తుది ఉత్పత్తి వరకూ కలబోత, కలనేత, డైయింగ్, వాషింగ్ వంటి అనేక ప్రక్రియలను ఔట్ సోర్స్ చేస్తారు. ప్రతి ప్రాసెస్‌కు బయటకు పంపడం అనివార్యంగా ఉంటుంది. జీఎస్టీ ప్రకారం, సరుకు ఒక చోట నుంచి మరోచోటకు కదిలిన ప్రతిసారీ పేపర్ వర్క్ చేయాలి. లేబర్ చార్జీలపై జీఎస్టీ చెల్లించాలి. ఒక వేళ జాబ్ వర్క్ చేసే యూనిట్ అన్-రిజిస్టర్డ్ యూనిట్ అయితే ఉత్పత్తిదారే రివర్స్ చార్జీలు చెల్లించాలి. పవర్ లూమ్ యజమానులపై ఇది మరో భారం. పైగా ప్రతిసారి పేపర్ వర్క్, ఆపై పన్ను చెల్లింపులు.. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ ఉన్నప్పటికీ నిర్వహణ, పది, ఇరవై మగ్గాలతో బిజినెస్ చేసేవారికి తలకు మించి న భారమే అవుతుంది. పైగా నగదులో జరిగే వ్యాపారాన్ని ఆన్ లైన్‌లోకి తేవడం కూడా చాలామందికి ఇష్టం లేదు.



ఎట్టకేలకు గుర్తించారు

దేశవ్యాప్త ఆందోళన, ప్రతిపక్షాల విమర్శలతో ఎట్టకేలకు సమస్య తీవ్రతను కేంద్రం గుర్తించింది. ఇటీవల జరిగిన జీఎస్టీ మండలి సమావేశంలో పన్నుల రేట్లను సవరించారు. జాబ్‌వర్క్‌పై పన్ను భారాన్ని 18నుంచి 5శాతానికి తగ్గించారు. ఇది కొంత ఊరటే అయినా ఇతర సమస్యలు అలాగే ఉన్నాయి. మ్యాన్ మేడ్ ఫైబర్, సింథటిక్ ఫైబర్‌పై పన్నును 18% నుంచి 12శాతానికి తగ్గించాలన్న డిమాండ్‌ను పట్టించుకోలేదు. కౌంటర్ వేలింగ్ డ్యూటీ (సీవీడీ), స్పెషల్ అడిషనల్ డ్యూటీ (ఎస్‌ఏ డీ) కూడా జీఎస్టీలో కలిసిపోయాయి. దీంతో దేశీయ ఉత్పత్తుల కంటే దిగుమతులే చౌక కావడం పరిశ్రమను తీవ్రంగా కలవరపరుస్తోంది. దిగుమతుల నుంచి దేశీయ పరిశ్రమను రక్షించేందుకు గతంలో సీవీడీ, ఎస్‌ఏడీ సుంకాలను ప్రవేశపెట్టారు. జీఎస్టీ తర్వాత దేశీయ ఉత్పత్తులతో పోలిస్తే దిగుమతులు కనీసం 16% వరకు చౌకగా లభిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి.

తెలంగాణలో రిజిస్ట్రేషన్ సమస్యలు

జీఎస్టీ అమల్లోకి వచ్చి నెల దాటినా ఏపీ, తెలంగాణల్లో వస్త్ర వ్యాపారులు సమస్యలను ఎదుర్కొంటూనే ఉన్నారు. జీఎస్టీ తప్పదని తెలిసిన తెలంగాణ వ్యాపారులు రిజిస్ట్రేషన్‌కు సిద్ధమయ్యారు. దరఖాస్తు చేసి 15 రోజులైనా రిజిస్ట్రేషన్ పూర్తి కావడం లేదని తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.ప్రకాశ్ చెప్పారు. కంప్యూటర్ సిస్టమ్స్ అప్‌గ్రేడ్ కాకపోవడంతోపాటు సాంకేతిక సమస్యలు ఇందుకు ప్రధాన కారణమన్నారు. వ్యాపారుల కోసం మరిన్ని అవగాహన, శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం రిజిస్టర్డ్ రెంటల్ అగ్రిమెంట్ అడగడంపై తెలంగాణ వస్త్ర వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో రాతపూర్వక ఒప్పందాలు చేసుకున్న వ్యాపారులు తిరిగి రిజిస్టర్డ్ ఒప్పందం చేసుకోవాలంటే భవనం యజమానులకు బేరమాడే అవకాశం కల్పించినట్లేనని అంటున్నారు.

జీఎస్టీతో భారమెంతో తేల్చండి..

- వివిధ శాఖలతో సీఎస్ సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను(జీఎస్టీ)తో ప్రభావితమయ్యే ప్రాజెక్టుల వివరాలు అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ.సింగ్ ఆదేశించారు. ఏయే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి... అదనపు భారమెంత వంటి వివరాలు సమగ్రంగా అందించాలని సూచించారు. సచివాలయంలో బుధవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, నీటిపారుదల ప్రాజెక్టులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై ఎంత మేర ప్రభావం పడుతుందో అంచనాలు రూపొందించి, అందించాలన్నారు.

మాఫియా అనకుండా మరేమనాలి?: చాడ

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న వాళ్లను ఇసుక మాఫియా అనకుండా ఇంకేమనాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రశ్నించారు. సాక్ష్యాధారాలతో సహా దాన్ని నిరూపిస్తామని, విచారణకు మంత్రి కేటీఆర్ సిద్ధంగా ఉన్నారా? అని సవాల్ విసిరారు. బుధవారం మఖ్దూం భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టులకు కాలం చెల్లిందని సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు అనాగరికంగా, అహంకారంతో కూడుకున్నవిగా ఉన్నాయని మండిపడ్డారు.

'టీఆర్‌ఎస్' కూలి చట్ట విరుద్ధం: రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): టీఆర్‌ఎస్ పార్టీ బహిరంగ సభ ఖర్చుల కోసం 'గులాబీ కూలీ' పేరిట పలువురు మంత్రులు, ఆ పార్టీ నేతలు చట్టవిరుద్ధంగా బహిరంగంగా అవినీతికి పాల్పడ్డారని టీడీపీ-టీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కోట్ల రూపాయలు వసూలు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని, ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులుగా ప్రకటించాలన్నారు. ఈ మేరకు బుధవారం బుధవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా, నేరెళ్ల బాధితులు తిరగబడతారనే భయంతోనే మంత్రి కేటీఆర్ దొడ్డిదారిన వెళ్లి వారిని పరామర్శించారని టీడీపీ-టీఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మేడిపల్లి సత్యం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్ అన్నారు. కేటీఆర్ బంధువులు పాల్పడుతున్న ఇసుక మాఫియాకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు.

యాదాద్రి ఆలయ ఈవో విధుల నుంచి తప్పుకోవాలి

- ఎమ్మెల్యే సునితా మహేందర్‌రెడ్డి



ఆలేరు, ఆగస్టు 9: వైటీడీఏ కమిటీని సంప్రదించకుండానే ఇష్టారాజ్యంగా దేవస్థానం ఘాట్‌రోడ్డు పనులు జరిపిస్తూ రోడ్డు ప్రమాదానికి కారణమైన ఆలయ ఈవో గీతారెడ్డి విధుల నుంచి వెంటనే తనకు తానుగా తప్పుకోవాలని ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్‌రెడ్డి డిమాండ్‌చేశారు. లేదంటే ప్రభుత్వం తప్పించాల్సి వస్తుందని హెచ్చరించారు. బుధవారం సునీత ఆలేరులో మాట్లాడుతూ ఈవో తప్పిదాల వల్లే ఆలయ ఉద్యోగి హన్మంతు నాయక్ ఘాట్‌రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడని ఆరోపించారు. ఉద్యోగి మృతిపై విచారం తెలుపుతూ ప్రభుత్వం అతడి కుటుంబాన్ని ఆదుకుంటుందని తెలిపారు. ఆర్టీసీ డిపో మేనేజర్ కిషన్‌రావు, ఈవో గీతారెడ్డి ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

నేడు ఢిల్లీకి బీజేపీ రాష్ట్ర నేతలు

- రాష్ట్ర సమస్యలపై కేంద్రానికి వినతి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డితో కూడిన పార్టీ రాష్ట్ర బృందం గురువారం ఢిల్లీ వెళ్లనుంది. రెండు రోజులపాటు ఢిల్లీలో పర్యటించనున్న బీజేపీ నేతలు రాష్ట్రంలో నెలకొన్న రైతు సమస్యలు, సింగరేణి కాలరీస్ ఓపెన్‌కాస్టులతో సమస్య, కాలరీస్ కార్మికుల సమస్యలు, రాష్ట్రంలోని థర్మల్ పవర్ ప్రాజెక్టులకు ఆర్థికసాయం తదితర అంశాలపై కేంద్ర మంత్రులను కలిసి విన్నవించనున్నారు. 11న ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ప్రమాణస్వీకారోత్సవానికి వారు హాజరవుతారు. కాగా, ఇచ్చిన హామీ మేరకు రైతు రుణ విమోచన కమిషన్‌ను ఏర్పాటుచేయాల్సిందేనని సీఎం కేసీఆర్‌ను బీజేపీ జాతీయ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నాంపల్లిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు దాదాపు 3వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తన ఫాంహౌజ్‌కు వెళ్లేదారిలో ఉన్న గ్రామాల్లోనే సభలు నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్.. అంతకంటే ముందు వచ్చే ఆలియాబాద్, లాల్‌గడి మలక్‌పేట, జగ్గన్‌గూడ గ్రామాల్లో ఎందుకు సభలు నిర్వహించటంలేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి ప్రశ్నించారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు శుభలేఖను అందజేస్తున్న మధుసూదనాచారి


చంద్రబాబును కలిసిన తెలంగాణ స్పీకర్

- కుమారుడి వివాహానికి ఆహ్వానం

అమరావతి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి బుధవారం ఇక్కడ సీఎం చంద్రబాబు ను కలిశారు.విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబును కలిసి 11న హైదరాబాద్‌లో జరుగుతున్న తన కుమారుడి వివాహానికి రావాలని ఆయన ఆహ్వానించారు. మధుసూదనాచారి గతంలో తెలుగు దేశం పార్టీలో చురుగ్గా పనిచేశారు. 1994-99 మధ్య ఆయన టీడీపీలో చంద్రబాబుతో కలిసి ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆ సమయంలోనే చంద్రబాబు మొదటిసారి ముఖ్యమంత్రి అయ్యారు. పాత విషయాలు వారి మధ్య ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్ర హౌస్‌ఫెడ్ ఛైర్మన్ నవనీతరావు కూడా ఆయనతో ఉన్నారు.

'చేనేత సంకలనం' అభినందనీయం: కేటీఆర్

హైదరాబాద్: చేనేత వృత్తి నేపథ్యంగా వచ్చిన తెలుగు కథలను సంకలనం చేయడం అభినందనీయమని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. చేనేత నేపథ్యంగా 58 కథలతో సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ మేడికుర్తి ఓబులేషు, వెల్దండి శ్రీధర్ సంయుక్త సంపాదకత్వంలో ప్రచురించిన "పడుగు పేకలు" (చేనేత కథలు) కథా సంకలనాన్ని బుధవారం సచివాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంపాదకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సంగిశెట్టి శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు కేవీ.రమణాచారి, దేశపతి శ్రీనివాస్, మేయర్ బొంతు రామ్మోహన్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా తెలుగు సంపాదకుడు పత్తిపాక మోహన్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో బుధవారం 'పడుగుపేకలు'(చేనేత కథలు) పుస్తకాన్ని అవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

ప్రైవేటు దోపిడీని అరికట్టాలి

- రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ విద్యార్థుల ఆందోళన



నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ : విద్యారంగంలో ప్రైవేటు సంస్థల దోపిడీ అరికట్టాలని రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ ఆందోళన చేపట్టింది. బుధవారం నల్లగొండ, నిర్మల్, వరంగల్, వనపర్తి, నిజామాబాద్ జిల్లాల్లోకలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకుముందు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ప్రసంగిస్తూ విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడంతో మెరుగైన విద్య అందడం లేదని ఆరోపించారు. గురుకులాలు ఏర్పాటు చేసినప్పటికి మౌలిక సదుపాయాల కల్పనలో దృష్టి సారించలేదని పేర్కొన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజుల వసూళ్లలో దోపిడీ విధానం అనుసరిస్తున్నాయని వాటిని కట్టడి చేయాలన్నారు.

ప్రతి ఒక్కరూ దేశ భక్తిని చాటాలి

- మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: సర్వమతాలకు, కులాలకు పుట్టినిల్లుగా ఉన్న దేశంలో ప్రతి ఒక్కరూ దేశ భక్తిని చాటాలని రాష్ట్ర మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 'ఆవో సబ్ మిల్కే జనగణమన గీతాలాపన' కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో నిర్వహించారు. సుమారు 10వేల మంది విద్యార్థులు, యువకులు, వృద్ధులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. మంత్రి జోగు రామన్న, మున్సిపల్ చైర్‌పర్సన్ రంగినేని మనీషాతో కలిసి జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా 10వేల మంది సామూహికంగా జనగణమన గీతాలాపన చేశారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రామన్న



చదువుల తల్లి ఎక్కడ?

బాసర సరస్వతీదేవి ఉత్సవ విగ్రహంపై సందేహాలు

- అధికారులు, పండితుల పొంతన లేని జవాబులు
- ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఆలయ ఈవో
- రికార్డుల్లో 8 విగ్రహాలు.. పోయింది మరో విగ్రహమని వెల్లడి
- నిజామాబాద్‌లో ఆస్పత్రిలో చేరిన ప్రధానార్చకుడు
- అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలింపు?



బాసర, ఆగస్టు 9: బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ దేవస్థానంలో పండితుల ప్రైవేటు అక్షర శ్రీకార పూజా వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. పండితులు అసలు విగ్రహాన్ని తీసుకెళ్లారా? ఒకవేళ తీసుకెళ్తే పూజానంతరం ఆ విగ్రహం ఎక్కడ ఉంచారు? అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఉత్సవ విగ్రహంపై ఆలయ వర్గాల నుంచి పొంతనలేని సమాధానాలు వస్తున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్‌కుమార్ ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుండి తీసుకువెళ్లలేదని చెబుతుంటే.. అధికారులు మాత్రం అది అవాస్తవమని అంటున్నారు. ఉత్సవ విగ్రహం మాయమైందనే ఆరోపణలు జోరుగా వినిపిస్తుంటే.. గుడిలో ఉండాల్సిన ఉత్సవ విగ్రహాలన్ని భద్రంగానే ఉన్నాయని ఆలయ స్థానాచార్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ప్రధాన అర్చకులు సంజీవ్‌కుమార్ గత నెల 28వ తేదీన నల్గొండ జిల్లా దేవరకొండలో ప్రైవేటుగా అక్షర శ్రీకార పూజ నిర్వహించారని ఆలయం నుంచి అనధికారికంగా చిన్న సరస్వతీ విగ్రహాన్ని తీసుకెళ్ళారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పూర్తి విచారణ చేపట్టి ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై నిజానిజాలు తెల్చుకునేందుకు ఆలయంలోని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా.. జూలై 26కు ముందు రికార్డు స్టోరేజీలో లేదు. ప్రధానార్చకుడు సంజీవ్ కుమార్ చివరిసారిగా ఆలయానికి వచ్చింది జూలై 26న. దీంతో అసలేం జరిగిందనేది మిస్టరీగానే మిగిలిపోయింది. నల్గొండ జిల్లా దేవరకొండ పాఠశాలలో జరిగిన పూజా కార్యక్రమ ఫోటోలు పరిశీలిస్తే అందులో సరస్వతీ దేవి ఉత్సవ విగ్రహం ఉన్నట్లు అర్థమవుతోంది. అచ్చం బాసర ఆలయంలోని అక్షర శ్రీకార పూజలు జరిగే మండపంలో ఉన్న విధంగానే ఆ విగ్రహాన్ని అలంకరించారు. అక్కడికి వెళ్ళిన ఇద్దరు పండితులు విగ్రహానికి ఇరువైపులా కూర్చొని పూజలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఆ విగ్రహం ఏమైందో తెలియలేదు. మిగతా విగ్రహాలున్న బీరువాను ఆలయ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. కాగా.. దేవరకొండలోని ఒక ప్రైవేటు పాఠశాలలో పూజలు నిర్వహించినందుకు పాఠశాల యాజమాన్యం బాసర ఆలయ పండితులకు రూ.2 లక్షల భారీ పారితోషికం అందించినట్లు సమాచారం. విగ్రహంపై ఆందోళన ఇలా కొనసాగుతున్న నేపథ్యంలోనే.. ఆరోపణలు ఎదుర్కొంటున్న అర్చకులు సంజీవ్‌కుమార్ అస్వస్థతతో మంగళవారం రాత్రి నిజామాబాద్ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. బుధవారం ఉదయం వరకు చికిత్స పొందిన ఆయన్ను ఆ తర్వాత వైద్యులు హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రధాన అర్చకులు సంజీవ్‌కుమార్ ఎక్కడున్నారో ఎవరికీ తెలియడం లేదు. ఇక.. ప్రైవేటు పూజల్లో ఆయనతో కలిసి పాల్గొన్న రుత్వికుడు ప్రణవ్ కుమార్ దీనిపై స్పందించారు. ఆలయ ప్రధానార్చకులు రమ్మనడంతో కాదనలేక సహాయకుడిగా వెళ్లినట్లు తెలిపారు. తనకు విగ్రహం గురించి తెలియదన్నారు. సంజీవ్‌కుమార్ అమ్మవారి విగ్రహాన్ని తీసుకెళ్లిన మాట నిజమేనని.. రికార్డుల్లో ఉన్న 8 విగ్రహాలు కాకుండా రికార్డుల్లో లేని మరో చిన్న సరస్వతీ విగ్రహాన్ని ఆలయం నుంచి ఆయన వెంట తీసుకెళ్లారని, విచారణలో త్వరలోనే అన్ని విషయాలు బయటకు వస్తాయని ఈవో సుధాకర్ రెడ్డి తెలిపారు.

బాసర ఘటనపై సర్కారు సీరియస్

ప్రధానార్చకుడితోపాటు మరికొందరిపై వేటు.. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల వెల్లడి

నిర్మల్ బాసర ఆలయ ఉత్సవమూర్తి విగ్రహం తరలింపు వ్యవహారాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఆలయ ప్రధానార్చకుడితోపాటు పారాయణదారుపై సస్పెన్షన్ వేటు వేసింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన ఆలయ ప్రధానార్చకుడు పి. సంజీవ్‌కుమార్, స్థపతి పారాయణ్‌దార్ ప్రణవ్ శర్మలను సస్పెండ్ చేయాలంటూ దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వారిని సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం దీనిపై విలేకరులతో మాట్లాడిన మంత్రి.. భక్తుల మనోభావాలను దెబ్బతీస్తే సహించేది లేదన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. ఉత్సవమూర్తి విగ్రహం తరలింపు వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాల్సిందిగా రీజినల్ జాయింట్ కమిషనర్ కృష్ణవేణిని ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

ప్రధానార్చకుడిని కాపాడే యత్నం?

అధికార పార్టీ నేతలను సంప్రదిస్తున్న బాసర మాజీ ఈవో!

దేవరకొండ టౌన్: బాసర ఆలయంలో గతంలో ఈవోగా పనిచేసిన ఒక అధికారి దేవరకొండ వాసి. పలు పార్టీల ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు, వ్యాపారవేత్తలతో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. గత నెల 28న ప్రైవేటు పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమానికి పుజారులు, ఉత్సవ విగ్రహం రావడానికి ఆయన సిఫారసులే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సదరు అధికారి కూడా హాజరైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పుడు బాసర ఆలయ ప్రధానార్చకుడు సంజీవ్ కుమార్‌ను కాపాడేందుకు ఆయనే అధికార పార్టీ నేతల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

నాశనం చేసి మూర్ఖపు మాటలా?

- మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల: పాలమూరు జిల్లాను నాశనం చేసిందికాక, మూర్ఖపు మాటలు మాట్లాడుతారా? అంటూ కాంగ్రెస్ నాయకులపై మంత్రి లక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలమూరు జిల్లా వెనుకబడటానికి కాంగ్రెస్ పార్టీ పాలనే కారణమని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రాజెక్టుల అంశంలో పాలమూరుపై వివక్ష చూపిస్తున్నారంటూ అర్థం, పర్థంలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వెనుకబడిన పాలమూరు జిల్లాకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాధాన్యం ఇస్తున్నారని, మెడికల్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తదితర వాటితో పాటు రోడ్ల నిర్మాణాలకు, మిషన్ కాకతీయ పనులకు నిధులను అధికంగా కేటాయించారన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నల్లగొండ వాసికి చోటు



పొనుగోటి నితిన్

నల్లగొండ విద్య, ఆగస్టు 9: నల్లగొండ కు చెందిన పొనుగోటి నితిన్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. పొనుగోటి లక్ష్మి నర్సింహారావు, రేణుక దంపతుల తనయడు నితిన్ సెయింట్ ఆల్ఫోన్సస్ పాఠశాలలో రెండో తరగతి చదువుతూ అద్భుత జ్ఞాపకశక్తితో ఈ రికార్ట్ సాధించాడు. విషయం తెలుసుకున్న తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు నితిన్‌ను బుధవారం 732 ప్రశ్నలు అడగ్గా ఆరు ని మిషాల్లో టకటకా సమాధానం చెప్పాడు. అత్యధికంగా వేగంతో సమాధానాలు చెప్పడం ద్వారా అతడు ఈ రికార్డు సాధించాడు. ఇం గ్లీష్ ఆల్ఫాబెట్స్, తెలుగు నెలలు, తెలుగు తిథు లు, స్టేట్, సెంట్రల్ క్యాపిటల్స్, ఇన్వెంటర్స్, తెలంగాణ జిల్లాలు, ఖండాలు, కెమికల్ ఎలిమెంట్స్, ఏడు అద్భుతాలు, సముద్రాల పేర్లు, రాష్ట్ర గుర్తులను అలవోకగా అతడు చెప్పగల డు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన కా ర్యక్రమంలో నితిన్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికా ర్డ్స్, సర్టిఫికెట్ ఆఫ్ స్టేట్ రికార్డ్స్, సర్టిఫికెట్ ఆఫ్ ఇండియన్ అచ్యూవ్‌మెంట్, సూపర్‌కిడ్స్ రికా ర్డ్స్ పత్రాలను సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెం కట్‌రెడ్డి, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఈవెంట్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రదానం చేశారు.

భూ కబ్జా కేసులో 22 మందికి మూడేళ్ల జైలు

- ఒక్కొక్కరికి రూ.40 వేల జరిమానా
- 14 సంవత్సరాల పాటు సాగిన కేసు

జగిత్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన 22 మందికి జైలు శిక్ష విధిస్తూ బుధవారం ఫస్ట్ అడిషనల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ సాతిన్ మధు తీర్పు చెప్పారు. 14 ఏళ్లుగా ఈ కేసు నడుస్తుండగా, బుధవారం 22 మందికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.40 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై ఎస్పీ క్యాంప్ ఆఫీస్ సమీపంలోని శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్‌కుచెందిన సర్వే నెం.161లో ఉన్న 6 ఎకరాల 31 గుంటల భూమిని కొందరు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కబ్జా చేశారు. రూ.2 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురి కావడంతో అప్పటి కాడా ఈఈ అనంతరెడ్డిపోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు 35 మందిపై కేసు నమోదు చేశారు. నిందితులుగా ఉన్న 11 మంది మరణించారు. ఇద్దరిని కేసు నుంచి తప్పించారు. 20 మంది జరిమానా చెల్లించి బెయిల్‌పై విడుదలయ్యారు. ఇద్దరు జరిమానా చెల్లించకపోవడంతో జైలుకు తరలించారు.

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
నిజామాబాద్ గురువారం 10 ఆగస్టు 2017

ప్రో కబడ్డీలో నేటి మ్యాచ్‌లు

STAR SPORTS 2	పట్నా పైరేట్స్ X జైపూర్ పింక్ రాత్రి 8.గం
maa movies	బెంగళూరు X తమిళ్ తలైవాస్ రాత్రి 9.గం



కోహ్లీని సచిన్‌తో పోల్చొద్దు!



చెన్నై: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీని దిగ్గజ బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్కర్‌తో పోల్చడం సరికాదని దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు జాంటీ రోడ్స్ అన్నాడు. 'నాకు రికార్డులపై పెద్దగా నమ్మ కం లేదు. భిన్న తరాలకు చెందిన వ్యక్తుల మధ్య పోలిక అంటే నాకు ఇష్టం ఉండదు. తమ మార్గాల్లో వారిద్దరూ గొప్ప ఆటగాళ్లే. టెండూల్కర్.. టెండూల్కరే, విరాట్.. విరాటే. ఎవరి గొప్పతనం వారిదేన'ని రోడ్స్ అన్నాడు. చెన్నైలోని వేలమ్మాళ్ విద్యాలయాన్ని జాంటీ బుధవారం సందర్శించాడు. ఈ సందర్భంగా రోడ్స్‌ను విద్యార్థులు సచిన్ రికార్డులను కోహ్లీ బద్దలు కొడతాడా అని ప్రశ్నించగా.. 'సచిన్ 16 ఏళ్ల చిరు ప్రాయంలోనే అరంగేట్రం చేసి సుమారు 40 ఏళ్ల వరకు ఆడాడు. 24 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో రికార్డులను నెలకొల్పాడు. కోహ్లీ అన్ని సంవత్సరాలు క్రికెట్ ఆడతాడని నేననుకోవడం లేదు. ఆధునిక క్రికెట్‌లో సుదీర్ఘ కెరీర్ సాధ్యపడకపోవచ్చు. అయితే విరాట్ కొన్నేళ్లుగా అద్భుత ప్రదర్శన చేస్తున్నాడ'ని రోడ్స్ చెప్పాడు.

ఆ ఇద్దరి వల్లే ఈ స్థాయికి..



కొలంబో: శ్రీలంకతో రెండో టెస్టులో నెగ్గి సిరీస్ దక్కించుకున్న ఆనందాన్ని రెట్టింపు చేస్తూ రవీంద్ర జడేజా నెంబర్ వన్ ఆల్‌రౌండర్‌గా నిలిచాడు. బౌలర్ల జాబితాలోనూ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. తానిలా టాప్‌లో నిలిచేందుకు కారకులైన భారత తాజా, మాజీ సారథులు విరాట్ కోహ్లీ, మహేంద్ర సింగ్ ధోనీలకు జడేజా కృతజ్ఞతలు తెలి పాడు. జడ్డూ సామర్థ్యం తెలిసిన ధోనీ, కోహ్లీ అతని ఎదుగుదలలో కీలక పాత్ర పోషించారు. నాణ్యమైన బ్యాట్స్‌మన్‌తో పాటు బౌలింగ్ కూడా చేయగల రవీంద్రపై ధోనీ ఎనలేని విశ్వాసం ఉం చాడు. ఇప్పుడు కోహ్లీ.. అతణ్ణి జట్టు తురుపు ముక్కగా మార్చేశాడు. ఈ సందర్భంగా కోహ్లీ, ధోనీలకు థ్యాంక్స్ చెబుతూ ట్వీట్ చేశాడు. 'టెస్టులో నెంబర్ వన్ ఆల్‌రౌండర్‌గా, బౌలర్‌గా ఎదిగిన నా ప్రయాణానికి కారణం ధోనీ, కోహ్లీ. ఇంకా నా అభిమానులు, కుటుంబం, ఐసీసీ, టీమిండియా కూడా' అని పేర్కొన్నాడు.

తొలి రౌండ్‌లో సైనా, సింధుకు బై



- వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత ఏస్ షట్లర్లు సైనా నెహ్వాల్, పీవీ సింధుకు తొలి రౌండ్‌లో బై లభించింది. స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో 21న ప్రారంభం కానున్న ఈ టోర్నీ డ్రాను బుధవారం ప్రకటించారు. సింధు నాలుగో సీడ్‌గా బరిలోకి దిగనుంది. ఇక సైనా 12వ సీడ్‌గా అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. భారత షట్లర్లకు టాప్ సీడ్ అకానె యమగుచి (జపాన్), రచనోక్ ఇంటనాన్ (థాయ్‌లాండ్), సన్ యు (చైనా), కరోలినా మారిన్ (స్పెయిన్), నజోమి ఒకుహర నుంచి గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే క్వార్టర్స్ వరకు సైనా, సింధుకు ఎదురుండకపోవచ్చు. ఇక పురుషుల సింగిల్స్‌లో ఇండోనేసియా, ఆస్ట్రేలియా ఓపెన్ విజేత కిడాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్, అజయ్ జయరామ్, సమీర్ వర్మ బరిలోకి దిగనున్నారు. పురుషుల డబుల్స్‌లో మను అత్రి-సుమిత్ రెడ్డి, సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-సిక్కిరెడ్డి, మిక్స్‌డ్‌లో ప్రణవ్ జెర్రీ చోప్రా-సిక్కిరెడ్డి జోడీలు పోటీపడనున్నాయి.



ఆట ముందు... ఆ తర్వాతే ఉద్యోగం

- 2020 ఒలింపిక్స్‌పై దృష్టి
- బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు

అమరావతి : తనకు ఆటే సర్వస్వమని, ఆ తర్వాతే ఉద్యోగమని బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు పేర్కొంది. డిప్యూటీ కలెక్టర్‌గా అమరావతిలో బుధవారం బాధ్యతలు చేపట్టిన సింధు ఆంధ్రజ్యోతితో మాట్లాడింది. ఆట ఒక స్థాయి వరకు ఆడాక, ఆ తర్వాత ఉద్యోగంపై దృష్టిపెడతానని, ఉద్యోగపరంగా అవసరమైన శిక్షణ కూడా తీసుకుంటానని చెప్పింది. '2020 ఒలింపిక్స్ నా ప్రధాన లక్ష్యం. రియో ఒలింపిక్స్‌లో రజతం సాధించాను. పతకం వస్తుందన్న ఉద్దేశంతో బరిలోకి దిగలేదు. కానీ ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ గెలవాలన్న పట్టుదలతో ఆడా. 2020 ఒలింపిక్స్‌లో మరింత ప్రతిభ చూపాలి. అప్పటివరకు ఆటలే ప్రపంచం. మధ్యలో వచ్చే అన్ని ముఖ్యమైన చాంపియన్‌షిప్‌లలోను పాల్గొంటా' అని పేర్కొంది. కాగా సింధు బుధవారం డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించింది. సీసీఎల్‌ఏ పునీటాకు ఆమె రిపోర్టు చేసింది. అవసరమైన వైద్య ధ్రువీకరణ పత్రాన్ని అందచేసింది.



కోహ్లీ, ధవన్ కంటే పుజారానే బెస్ట్

గౌతమ్ గంభీర్

న్యూఢిల్లీ: భారత టెస్టు స్పెషలిస్ట్ చతేశ్వర్ పుజారాను కెప్టెన్ కోహ్లీ ఇటీవలే జట్టు ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా అభివర్ణిస్తే.. వెటరన్ ఓపెనర్ గౌతమ్ గంభీర్ మరో అడుగు ముందుకేశాడు. పుజారా ఇప్పుడు కోహ్లీ, ఓపెనర్ శిఖర్ ధవన్‌ను మించిన నిలకడతో ఆడుతున్నాడని కొనియాడాడు. 'మనం టెస్టులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఇప్పుడంతా వన్డేలు, టీ-20లపైనే అందరి దృష్టి. కానీ, టెస్టుల విషయానికి వస్తే మాత్రం పుజారా ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్నాడు. కోహ్లీ, ధవన్ కంటే ఎక్కువ నిలకడ అతనిలో ఉంద'ని గౌతీ చెప్పుకొచ్చాడు.

ఆనంద్‌కు మరో డ్రా

సెయింట్ లూయిస్ (యూఎస్): మాజీ ప్రపంచ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్.. సింక్‌ఫీల్డ్ కప్ చెస్ టోర్నీలో మరో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. ఆరో రౌండ్‌లో రష్యా గ్రాండ్ మాస్టర్ సెర్జీ కర్జాకిన్‌తో విషీ పాయింట్ పంచుకున్నాడు. నల్లపావులతో ఆడిన ఆనంద్ 30 ఎత్తుల అనంతరం డ్రాకు అంగీకరించాడు. 3.5 పాయింట్లతో ఆనంద్ సంయుక్తంగా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

కైనన్ జోడీకి కాంస్యం

న్యూఢిల్లీ: కజకిస్థాన్‌లో జరుగుతున్న ఆసియా షాట్‌గన్ చాంపియన్‌షిప్స్ మిక్స్‌డ్ టీమ్ ట్రాప్ ఈవెంట్‌లో కైనన్ చినాయ్ జోడీ కాంస్య పతకం సాధించింది. బ్రాంజ్ మెడల్ పోరులో కైనన్ చినాయ్-శ్రేయాసి సింగ్ జంట 40-38తో లెబనన్ జోడీపై నెగ్గింది. ఫైనల్లో కువైట్ జంట 36-35తో కొరియా ద్వయంపై నెగ్గి స్వర్ణం సాధించింది.

టెస్టులు, వన్డేలు, టీ-20లు..మూడు ఫార్మాట్లకూ అతడే కెప్టెన్..ఒకదాని వెంట ఒక సిరీస్..ఎక్కే విమానం, దిగే విమానం..విరామమేలేని పర్యటనలు..సాధారణ ఆటగాడైతే ఈ తీరికలేని క్రికెట్‌ను తట్టుకోవడం కష్టమే..కానీ ఫిట్‌నెస్‌ను ఆరో ప్రాణంగా భావించే విరాట్ కోహ్లీ సారథ్య బరువు బాధ్యతలు మోస్తూనే అటు 'వరల్డ్ బెస్ట్ బ్యాట్స్‌మన్'గా సత్తా చాటుతున్నాడు..అయితే భవిష్యత్తు దృష్ట్యా విరాట్ కొద్దికాలం విశ్రాంతి తీసుకుంటే ఉత్తమమన్న వాదన వినిపిస్తోంది.

ఇదే మంచి తరుణం !

విరాట్‌కు విరామమేది?



(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఇటీవలి వెస్టిండీస్ నుంచి ప్రస్తుత శ్రీలంక పర్యటన వరకూ గత ఏడాదిగా కెప్టెన్ కోహ్లీ ప్రయాణించిన దూరం 90 వేల కిలోమీటర్లు. భూమి చుట్టుకొలత కంటే కూడా ఈ దూరం ఎక్కువ. ఈ సంవత్సరం అన్ని ఫార్మాట్లలో కలిపి టీమిండియా 43 మ్యాచ్‌లు ఆడితే కోహ్లీ మిస్సయింది ఒకే ఒక్క మ్యాచ్. అదీ భుజం గాయంతో ఆస్ట్రేలియాతో ధర్మశాలలో జరిగిన టెస్ట్‌ను మాత్రమే. అయితే ఎంత వేగంగా అతడు కోలుకున్నాడంటే ధర్మశాల టెస్ట్ ముగిసిన కొద్దిరోజులకే జిమ్‌లో భారీగా బరువులెత్తేంతగా! తర్వాత మండు వేసవిలో జరిగిన ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్‌కు కోహ్లీ సారథిగా వ్యవహరించాడు. ఆపై చాంపియన్స్ ట్రోఫీ.. తదనంతరం వెస్టిండీస్ పర్యటన. ఇప్పుడు శ్రీలంకలో. రాబోయే సిరీస్‌లైతే మరీ కఠినమైనవి. ఈ నేపథ్యంలో కోహ్లీ భుజం గాయం తిరగబెడితే ఎలా ..అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఒక్కసారి తొమ్మిదేళ్లు వెనక్కు వెళ్తే ..తగినంత విశ్రాంతికోసం శ్రీలంక పర్యటన నుంచి తనకు బ్రేక్ ఇవ్వాలని నాటి కెప్టెన్ ధోనీ బోర్డును కోరాడు. అంతకుముందు అతడు సంవత్సరంపాటు నిరంతరాయంగా క్రికెట్ ఆడాడు. తొలుత.. 80 రోజుల ఇంగ్లండ్ టూర్. అనంతరం సౌతాఫ్రికాలో తొలి టీ20 వరల్డ్‌కప్. తర్వాత ఆసీస్, పాకిస్థాన్‌లతో వన్డేలు. ఆపై 3 నెలల సుదీర్ఘ ఆస్ట్రేలియా పర్యటన. తదుపరి దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్. చివరిగా ఐపీఎల్. బాప్‌రే ! బిజీ టూర్లు ఓపక్క..వాణిజ్య లావాదేవీలు మరోపక్క. దాంతో ప్రస్తుతం క్రికెటర్లకు 'ఆఫ్ సీజన్' అనేది లేకుండా పోయింది.

కోహ్లీ గాయపడితే ?

మరో నెల రోజుల్లో మొదలయ్యే స్వదేశీ సీజన్‌లో భారత్ తీరికలేని క్రికెట్ ఆడాల్సి ఉంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంకలతో టెస్ట్‌లు, వన్డేలు, టీ20లు కలిపి మొత్తం 23 మ్యాచ్‌ల్లో తలపడాల్సి ఉంది. ఇవన్నీ అయ్యాక జనవరిలో సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. మరి ఈ సిరీస్‌ల్లో ఒక్కదానిలోనూ కోహ్లీలేని టీమిండియాను ఊహించగలమా ? కచ్చితంగా ఊహించలేము. అలా జరగకుండా ఉండాలంటే. ..లంకతో వన్డే సిరీస్‌కు అతడికి బ్రేక్ ఇవ్వాలి. ఎప్పుడో 2016 ఫిబ్రవరిలో ఆసీస్‌తో సిరీస్ ప్రారంభానికి ముందు మూడు వారాలు విశ్రాంతి తీసుకున్న అనంతరం కోహ్లీ ఆట కొత్త పుంతలు తొక్కింది. టీ-20 వరల్డ్ కప్‌లో 136 సగటు నమోదు చేశాడంటే అతడి బ్యాటింగ్ ఏస్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఇక 2016 ఐపీఎల్‌లో రికార్డు స్థాయిలో 973 పరుగులు అతడి బ్యాట్‌నుంచి జాలువారాయి. అప్పటి నుంచి ఏడాదికిపైగా 28 ఏళ్ల ఈ బ్యాట్స్‌మన్ అదేస్థాయిలో రాణిస్తున్నా..మూడు విభిన్న జట్లకు కెప్టెన్‌గా ఉండే బరువు బాధ్యతలు, ఒత్తిడులను గమనిస్తే కోహ్లీకి ఒకింత రెస్ట్ తప్పదు. ఇందుకు ప్రస్తుతం శ్రీలంకతో జరగబోయే వన్డే సిరీస్‌కంటే మంచి తరుణం కూడా ఉండబోదు. సారథిగా ముంబై ఇండియన్స్‌ను మూడుసార్లు ఐపీఎల్ విజేతగా నిలబెట్టిన రోహిత్ శర్మ..చాంపియన్స్ లీగ్ టైటిల్ కూడా అందించాడు. కోహ్లీకి ప్రత్యామ్నాయంగా అతడు సిద్ధంగా ఉన్నాడు. ఏదేమైనా కోహ్లీ నేతృత్వంలో భారత క్రికెట్ మరింత ఉన్నత శిఖరాలకు చేరాలంటే అతడికి కొద్దికాలం విశ్రాంతి ఇవ్వక తప్పదు.

నీకెర్క్.. ఆన్ టార్గెట్



3000 స్టీపుల్ చేజ్ పోటీ

'భవిష్యత్ బోల్ట్'గా పరిగణిస్తున్న సౌతాఫ్రికన్ వాన్ నీకెర్క్ అంచనాలను అందుకున్నాడు. వరల్డ్ డబుల్ లక్ష్యంగా బరిలోకి దిగి.. మొదటి గోల్డ్‌ను స్ట్రయిక్ చేశాడు. ఒలింపిక్ చాంపియన్ వాన్.. 400మీ. రేస్‌లో పసిడి పట్టాడు. ఇక 200మీ. మిగులుంది. బోల్ట్ కెరీర్‌కు గుడ్‌బై చెప్పడంతో.. ఆ స్థానాన్ని నీకెర్క్ భర్తీ చేస్తాడని కీడ్రా పండితులు విశ్లేషిస్తున్నారు. ట్రాక్‌పైకి వచ్చేటప్పుడు 'తర్వాతి సూపర్ స్టార్' అని అనౌన్సర్లు ప్రకటించడం కొసమెరుపు.



బార్బరా

- 400 మీ.లో స్వర్ణం
- తిరుగులేని బార్బరా
- వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్


లండన్: వరల్డ్ డబుల్‌పై గురిపెట్టిన దక్షిణాఫ్రికా స్టార్ వేడ్ వాన్ నీకెర్క్.. సగం లక్ష్యాన్ని పూర్తి చేశాడు. రియో ఒలింపిక్స్‌లో ప్రపంచ రికార్డుతో స్వర్ణాన్ని సొంతం చేసుకున్న నీకెర్క్.. వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో 400మీ.లో పసిడిని కైవసం చేసుకున్నాడు. స్ప్రింట్ కింగ్ ఉసేన్ బోల్ట్ వారసుడిగా.. నీకెర్క్ ఎదుగుతాడనే భారీ అంచనాలున్నాయి. అందుకే అతడిని 'నెక్స్ట్ బోల్ట్' అని అంటున్నారు. తనతో కలసి ప్రాక్టీస్ చేయాలని బోల్ట్.. నీకెర్క్‌కు స్నేహ హస్తం అందించాడని కూడా వార్తలు వచ్చాయి. 'ఆసక్తిగా గమనించాల్సిన కుర్రాడు' అని చాంపియన్‌షిప్స్ ముందు బోల్ట్ అన్నాడు. ఇదే తరహా నిలకడైన ప్రదర్శన చేస్తే.. ట్రాక్‌ను ఏలుతాడని కూడా చెప్పాడు. ఆ అంచనాలను అందుకుంటూ మొదటి గోల్డ్‌ను తన ఖాతాలో వేసుకున్న వాన్.. ఇక 200మీ. రేస్‌ను టార్గెట్ చేశాడు. ప్రధాన ప్రత్యర్థి ఇసాక్ మక్వాలా (బోట్స్‌వానా)ను రేస్‌కు అనుమతించకపోవడంతో 25 ఏళ్ల నీకెర్క్ డబుల్ స్ట్రయిక్ ఖాయంగా కనిపిస్తోంది. 400 మీ. రేస్‌ను నీకెర్క్ 43.98 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం సాధించాడు. చివరి 15 మీటర్లలో అతడికి పోటీ ఇచ్చే వారే దరిదాపులో లేరు. బహామస్ అథ్లెట్ స్టీవెన్ గార్డ్‌నర్ (44.41 సె) రజతాన్ని, కతార్‌కు చెందిన అబ్దాలీ హారౌన్ (44.48 సె) కాంస్యాన్ని దక్కించుకున్నారు. గత ఏడాది జరిగిన విశ్వక్రీడల్లో త్రుటిలో పతకం చేజార్చుకున్న బ్రిటన్ అథ్లెట్ యాంబ్రోయిస్ బాసే.. ఇప్పుడు 800 మీ. స్వర్ణంతో మెరిశాడు. 1:44.67 సెకన్ల టైమింగ్‌తో బాసే అగ్రస్థానంలో నిలిచాడు. పోలెండ్‌కు చెందిన కస్‌జక్ జోట్(1:44.95సె) రజతం సాధించగా.. కెన్యా అథ్లెట్ బెట్ (1:45.21సె) కాంస్యం దక్కించుకున్నాడు.

స్టీపుల్ చేజ్‌లో కెన్యా జోరు..: పురుషుల 3000 మీటర్ల స్టీపుల్ చేజ్ కెన్యా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. ఒలింపిక్ చాంపియన్ కాన్సెస్లస్ కిప్రుటో స్వర్ణం ఎగరేసుకుపోయాడు. ప్రధాన ప్రత్యర్థి అమెరికాకు చెందిన ఎవన్ జాగర్‌ను ఓడించడంలో కెన్యా అథ్లెట్ పైచేయి సాధించాడు. చివరి హర్డిల్ దూకే ముందు సౌఫియానె ఎల్బక్కలి (మొరాకో)తో గట్టిపోటీ ఎదుర్కొన్న కిప్రుటో.. ఆ తర్వా త మంచి వేగంతో రేస్‌ను సునాయాసంగా పూర్తి చేశాడు. 8 నిమిషాల 14.12 సెకన్ల టైమింగ్‌తో కిప్రుటో అగ్రస్థానంతో పసిడి నెగ్గగా.. ఎల్బక్కలి (8:14.49 సె) రజతం, జాగర్ (8:15.53 సె) కాంస్యం దక్కించుకున్నారు. తన వ్యూహాలను పక్కాగా అమలు చేయడం వల్లే విజేతగా నిలిచానని కిప్రుటో చెప్పాడు.

మెరిసిన బార్బరా..: జావెలిన్ త్రో వరల్డ్ రికార్డు హోల్డర్ బార్బర స్పొటకొవా.. రెండో వరల్డ్ టైటిల్‌తో అదరగొట్టింది. మహిళల జావెలిన్ త్రోలో చెక్ రిపబ్లిక్‌కు చెందిన బార్బరా 66.76 మీటర్లు విసిరి పసిడి పట్టింది. 36 ఏళ్ల లేటు వయసులోనూ బార్బరా తనకు తిరుగులేదని నిరూపించుకుంది. చైనా అథ్లెట్లు 2, 3 స్థానాల్లో నిలిచాడు. లింగ్వి లి 66.25 మీ. దూరం విసిరి రజతం సాధించగా.. హుయి హుయి లు 65.26 మీ. విసిరి కాంస్యం దక్కించుకుంది.

పోల్‌వాల్ట్ చాంప్ సామ్: అమెరికాకు చెందిన సామ్ కెండ్రిక్స్.. పురుషుల పోల్‌వాల్ట్ టైటిల్‌ను సాధించాడు. అయితే వరల్డ్ రికార్డు హోల్డర్, రినాల్డ్ లావెల్లిని (ఫ్రాన్స్) మూడో స్థానానికే పరిమితమయ్యాడు. కెండ్రిక్స్ 5.95 మీటర్లు ఎత్తును దూకి స్వర్ణం సాధించాడు.

'ప్రయోజనం' లేదని సన్నీ ధ్రువీకరించాలి



న్యూఢిల్లీ: బీసీసీఐ ప్యానెల్ వ్యాఖ్యాతల జాబితాలో చోటు దక్కించుకున్న మాజీ కెప్టెన్ గవాస్కర్.. తనకు పరస్పర విరుద్ధ ప్రయోజనాలు లేవని ధ్రువీకరించాల్సి ఉంటుంది. జస్టిస్ లోధా సంస్కరణల ప్రకారం బీసీసీఐ పదవులు లేదా ఇతర కమిటీల్లో నియమితులయ్యే వారంతా ఆ మేరకు అఫిడవిట్ సమర్పించడం తప్పనిసరి. బుధవారం ఇక్కడ సమావేశమైన క్రికెట్ పాలక మండలి (సీవోఏ) ఈమేరకు నిర్ణయం తీసుకుంది. తమ వ్యాఖ్యాతలుగా గవాస్కర్‌తోపాటు, సంజయ్ మంజ్రేకర్, మురళీ కార్తీక్, హర్షా భోగ్లేలను బీసీసీఐ ఎంపిక చేసింది. వ్యాఖ్యాతల పేర్లపై చర్చించామని, తుది నిర్ణయం తీసుకోలేదని సీవోఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ తెలిపారు. పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎవరెవరికి విరుద్ధ ప్రయోజనాలున్నాయో తమకు తెలియదన్నారు.

బెంగాల్‌పై బుల్స్ గెలుపు



నాగ్‌పూర్: బెంగళూరు బుల్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. వరుసగా రెండు పరాజయాలు, ఒక టై అనంతరం ఘన విజయాన్ని ఖాతాలో వేసుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన బెంగళూరు 31-25తో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. అజయ్ కుమార్ 8 రైడ్ పాయింట్లతో సత్తా చాటగా.. కెప్టెన్ రోహిత్ కుమార్ (6), డిఫెండర్ ఆశీష్ కుమార్ (5) రాణించారు. బెంగాల్ జట్టులో జాంగ్ కున్ లీ (8), సుర్జీత్ సింగ్ (4), రణ్ సింగ్ (4) మెరిశారు. కెప్టెన్ రోహిత్ డబుల్ రైడ్ పాయింట్స్‌తో ఖాతా తెరవగా.. ఆరంభంలోనే 5-2తో బుల్స్ ముందంజ వేసింది. కానీ, జాంగ్ కున్ లీ చకచకా పాయింట్లు రాబట్టడంతో వారియర్స్ వెంటనే 5-5తో స్కోరు సమం చేసింది. అదే జోరుతో 8-6తో ఆధిక్యం సాధించింది. ఈ దశలో కోర్టులో ఇద్దరు ప్లేయర్లే మిగలడంతో బుల్స్ ఆలౌటయ్యేలా కనిపించింది. కానీ, కున్‌లీ, మనీందర్ సింగ్‌లను సూపర్ టాకిల్ చేసిన ఆ జట్టు 12-10తో ఫస్టాఫ్‌ను ముగించింది. అయితే, విరామం తర్వాత బెంగాల్ జోరు పెంచింది. కానీ, ఏ మాత్రం వెనకడుగు వేయని బుల్స్ విజృంభించింది. పటిష్ఠ డిఫెన్స్‌తో వారియర్స్‌కు సవాల్ విసిరిన ఆ జట్టు రైడింగ్‌లోనూ జోరు చూపింది. 26వ నిమిషంలో డూ ఆర్ డై రైడ్‌కు వెళ్లిన అజయ్ ఏకంగా నాలుగు టచ్ పాయింట్లు తెచ్చి బుల్స్‌ను 20-16తో ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. ఆపై, కున్‌లీని పట్టేసిన బెంగళూరును ప్రత్యర్థిని ఆలౌట్ చేసి 24-18తో ముందంజ వేసింది. తర్వాత బెంగాల్ పోటీ ఇచ్చే ప్రయత్నం చేసినా ఆధిక్యాన్ని కాపాడుకున్న బుల్స్ ఘన విజయాన్ని సొంతం చేసుకుంది.

మరాఠా తుఫాన్

ముంబై, ఆగస్టు 9: ముంబై నగరాన్ని 'మరాఠా తుఫాన్' ముంచెత్తింది. లక్షలాది మరాఠాలు ఒక్కటై కదంతొక్కారు. విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని బుధవారం మహా మౌన ప్రదర్శన నిర్వహించారు. నేల ఈనిందా అన్నట్లు విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, డబ్బావాలాలు కాషాయ జెండాలు చేతబూని వెల్లువెత్తారు. మరాఠా క్రాంతి మోర్చా ఆధ్వర్యంలో జీజామాతా ఉదయన్ నుంచి ఆరంభమైన ప్రదర్శన సాయంత్రం 5 గంటలకు ఆజాద్ మైదాన్‌కు చేరింది. 10,000మంది పోలీసులు బందోబస్తు నిర్వహించినా.. ముంబైలోని చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. నిరసనకారులు సబ్ అర్బన్ రైళ్లను నిలిపివేశారు. రిజర్వేషన్లతో పాటు మరాఠాలు మరికొన్ని డిమాండ్లు కూడా చేస్తున్నారు. సంచలనం రేకెత్తించిన అహ్మాద్‌నగర్ జిల్లా కొపర్డికి చెందిన 14 ఏళ్ల మరాఠా బాలికపై అత్యాచారం, హత్య కేసులో దోషులను శిక్షించాలని, ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టానికి సవరణ చేయాలన్న డిమాండ్లు వాటిలో ఉన్నాయి. మరాఠా తుఫాన్ పేరిట నిర్వహించిన ఈ ప్రదర్శనతో ప్రభుత్వం దిగి వచ్చింది. ఓబీసీ మాదిరిగానే మరాఠాలకు విద్యా రంగంలో రాయితీలిస్తామని సీఎం ఫడణవిస్ అసెంబ్లీలో ప్రకటించారు.



2022 కి నవభారతం

- దేశాన్ని అవినీతిరహితం చేద్దాం
- క్విట్ ఇండియా స్ఫూర్తితో కదులుదాం
- దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు



న్యూఢిల్లీ, ఆగస్టు 9: అవినీతి, కులతత్వం, మతోన్మాదం నుంచి దేశానికి విముక్తి కలిగించి 2022 నాటికి నవభారతాన్ని ఆవిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమం 75 వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం లోక్‌సభలో ఆయన మాట్లాడారు. '1942లో వలసవాదం నుంచి దేశానికి విముక్తి కోసం ఉద్యమించాం. 75 ఏళ్ల తర్వాత దేశానికి మరోసారి విముక్తి కల్పించాల్సిన అవసరం ఏర్పడింది. అయితే ఈసారి విముక్తి కల్పించాల్సింది వలసవాదం నుంచి కాదు. పేదరికం, ఉగ్రవాదం, అవినీతి, నిరక్షరాస్యత, కులతత్వం, మతోన్మాదం నుంచి దేశానికి విముక్తి కల్పించాలి.' అని ప్రధాని పేర్కొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు. 2022 నాటికి దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తవుతాయని అప్పటికి అన్ని రకాల రుగ్మతల నుంచి దేశానికి విముక్తి కల్పించడమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలన్నారు. ఎంపీలందరూ విభేదాలను పక్కనపెట్టి, పార్టీలకతీతంగా నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని మోదీ పిలుపునిచ్చారు. జీఎస్టీ చట్టాన్ని అమలు చేయడంలో పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన మద్దతు మరువలేనిదని, దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకూ అదే స్ఫూర్తిని ప్రదర్శించాలని ప్రధాని పిలుపునిచ్చారు. సుమారు అరగంటపాటు సాగిన ప్రసంగంలో సుభాష్ చంద్రబోస్, లాల్ బహదూర్ శాస్త్రి, జైప్రకాశ్ నారాయణ్ వంటి స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. 'ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ.. ప్రజల నడుమ ఐకమత్యాన్ని పెంచుతూ.. అవినీతి రహిత దేశాన్ని నిర్మిద్దాం' అంటూ పార్లమెంటు ఉభయసభలు ఏకగ్రీవంగా తీర్మానించాయి. ఈ సందర్భంగా లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ మాట్లాడుతూ.. దేశాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. చర్చ సందర్భంగా.. విపక్షాలు అధికారపక్షంపై విమర్శలు గుప్పించాయి. కాగా, హర్యానాలో బీజేపీ నేత తనయుడు అంశంపైన, రెండు రకాల నోట్లను ముద్రించడంపైనా చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో రాజ్యసభలో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో సభ రెండుసార్లు వాయిదా పడింది.

క్విట్ ఇండియాను వ్యతిరేకించారు!

- ఆరెస్సెస్, సావర్కర్‌పై సోనియా పరోక్ష వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 9: 'దేశానికి స్వాతంత్ర్యం సాధించాలన్న లక్ష్యంతో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమాన్ని కొందరు వ్యక్తులు.. కొన్ని సంస్థలు వ్యతిరేకించాయన్న విషయాన్ని మరువరాదు. స్వాతంత్ర్య పోరాటంలో వారు ఎలాంటి పాత్రనూ పోషించలేదు' అని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ పరోక్షంగా ఆరెస్సెస్, వీరసావర్కార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అదే సమయంలో కాంగ్రెస్ ఘనతను చాటుకొనే ప్రయత్నం చేశారు. క్విట్ ఇండియా 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని లోక్‌సభలో జరిగిన చర్చలో ఆమె పాల్గొన్నారు. దేశంలో చీకటి శక్తులు విజృంభిస్తున్నాయని, ప్రజాస్వామ్య మూలాలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా దేశంపై విభజన, విద్వేష రాజకీయ మేఘాలు కమ్ముకొని ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిరోగమన శక్తులను ఓడించాల్సిందిగా ప్రజలకు సోనియా పిలుపునిచ్చారు. సోనియా ప్రసంగం ఆసాంతం బీజేపీ, ఆరెస్సెస్ లక్ష్యంగా సాగింది. ప్రధాని మోదీ మౌనంగా ఆమె ప్రసంగాన్ని ఆలకించారు. కాగా కాంగ్రెస్ తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో నేరుగా సావర్కర్‌ను లక్ష్యంగా చేసుకొని ట్వీట్లు చేసింది.

'మోదీ-షా'కు... షాక్!

గుజరాత్‌లో అహ్మద్ పటేల్‌దే విజయం

బీజేపీ మూడో అభ్యర్థి ఓటమి.. ఆ 2 ఓట్లు చెల్లినా అదే ఫలితం.. రాజ్యసభ ఎన్నికల్లో హైడ్రామా

అహ్మదాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 9: 'మోదీ-షా' వ్యూహం వికటించింది! అప్రతిహత వ్యూహాలతో దూసుకుపోతున్న ఈ 'కమలాధిపతు'లకు వారి సొంత రాష్ట్రంలోనే శృంగభంగం ఎదురైంది. రాజ్యసభ ఎన్నికల్లో తమది కాని సీటుకోసం పోటీపడిన బీజేపీ దారుణంగా భంగపడింది. ఫిరాయింపులు, క్రాస్‌ఓటింగ్‌లు జరిగినప్పటికీ... అహ్మద్ పటేల్‌నే విజయం వరించింది. మంగళవారం దేశవ్యాప్తంగా హైఓల్టేజ్ టెన్షన్ పుట్టించిన గుజరాత్ రాజ్యసభ ఎన్నిక వివాదం... అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో ముగిసింది. ఈ ఎన్నికల్లో బీజేపీ తరఫున అమిత్‌షా, కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ గెలిచారు. 'చావుతప్పి కన్నులొట్టపోయినప్పటికీ'... మూడో సీటులో అహ్మద్ పటేల్ నెగ్గారు. సరిగ్గా తన గెలుపునకు అవసరమైన 44 ఓట్లు తెచ్చుకుని గట్టెక్కారు. ఆయనకు పోటీగా బీజేపీ నిలబెట్టిన బల్వంత్‌సింగ్ రాజ్‌పుత్‌కు 38 ఓట్లు మాత్రమే వచ్చాయి. వెరసి... ఆ ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లు చెల్లినప్పటికీ, రాజ్‌పుత్ నెగ్గేవారు కాదన్న మాట! ఇంకా చెప్పాలంటే... 44కంటే కొన్ని తక్కువ ఓట్లు వచ్చినా అహ్మద్ పటేల్‌నే గెలుపు వరించేది! ఇక... ఎన్నికల్లో విజయం సాధించిన అమిత్‌షా, స్మృతీ ఇరానీలకు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.



ఇది కఠినమైన ఎన్నిక: అహ్మద్ పటేల్

"ఇది నేను ఎదుర్కొన్న కఠినమైన ఎన్నికల పరీక్ష. పార్టీ అధినాయకత్వం, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు నాకు అండగా నిలిచాయి. ఇది నా గెలుపు మాత్రమే కాదు... ధన రాజకీయాలకు ఓటమి" అని అహ్మద్ పటేల్ తెలిపారు. 'ప్రతిబంధకాలను దాటి గెలిచారు' అంటూ అహ్మద్ పటేల్‌ను జనతాదళ్ (యు) సీనియర్ నేత శరద్ యాదవ్ అభినందించారు. 'బిగ్ ఫైట్... గుడ్ ఫైట్.. గుడ్ విన్' అని తృణమూల్ అధ్యక్షురాలు, బెంగాల్ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. పటేల్ గెలుపు అంత సులువుగా సాధించలేదనే విషయాన్ని విపక్షాలు గుర్తుంచుకోవాలని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. ఇక... అహ్మద్ పటేల్‌ను ఓడించేందుకు బీజేపీ రూ.20 కోట్లకుపైగా ఎర వేసిందని కర్ణాటక సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. అహ్మద్ పటేల్ విజయాన్ని రాజ్యసభలో కాంగ్రెస్ పక్ష నేత గులాంనబీ ఆజాద్ 'క్విట్ ఇండియా' ఉద్యమంతో పోల్చారు. మరోవైపు, క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలపై శంకర్‌సిన్హ్ వఘేలాసహా ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గుజరాత్ కాంగ్రెస్ శాఖ సస్పెండ్ చేసింది.

థాంక్ గాడ్ ఈసీ!

- ఆ ఒక్క సీటు కోసం.. సోనియా పరేషాన్

న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో అహ్మద్ పటేల్‌ను దెబ్బతీయాలన్న బీజేపీ ప్రయత్నాలు విఫలం కావడంతో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఊపిరి పీల్చుకున్నారు. కాంగ్రెస్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితుల్లో అహ్మద్ పటేల్ విజయం సోనియాకు ఎంతో అవసరం. అహ్మద్ పటేల్ ఓడిపోతే దాని ప్రభావం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీపైనే కాకుండా, గుజరాత్‌లో ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపైనా పడే అవకాశాలున్నాయి. అందుకే అహ్మద్ పటేల్ గెలుపు కోసం సోనియా తహతహలాడిపోయారు. 1998లో సోనియా కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టినప్పటినుంచి ఆమె రాజకీయ సలహాదారుడిగా, పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన అహ్మద్ పటేల్‌కు ఈ ఎన్నికలు గట్టి గుణపాఠాన్నే నేర్పుతాయని పరిశీలకుల అంచనా. ఎంపీలు, ఎమ్మెల్యేలను పురుగుల్లా పరిగణించే పటేల్‌కు ఈ ఎన్నికలు మంచి అనుభవాన్ని నేర్పుతాయని.. వారి విలువ ఆయనకు తెలిసి వస్తుందని కాంగ్రెస్ నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేల అత్యుత్సాహం బీజేపీకి శాపంగా మారింది. ఈ ఎన్నికలో గెలుపు కోసం పక్కాగా రచించిన ప్రణాళికను పకడ్బందీగా అమలు చేసిన అమిత్‌షాకు చివరి నిమిషంలో వారివల్ల ఎదురుదెబ్బ తగిలింది. పటేల్‌ను ఓడించి తద్వారా రాబోయే గుజరాత్ ఎన్నికల్లో ఐదోసారి గద్దెనెక్కడానికి మార్గాన్ని సుగమం చేసుకోవాలన్న లక్ష్యంతోనే మోదీ-షా ద్వయం రంగంలోకి దిగింది. గుజరాత్‌లో కాంగ్రెస్‌ను నామరూపాల్లేకుండా చేయాలంటే అహ్మద్‌పటేల్‌ను ఓడించాలని కంకణం కట్టుకున్నారు. అందుకే బద్ధశత్రువైన వాఘేలాకు స్నేహ హస్తం చాపారు. ముందస్తు వ్యూహంలో భాగంగా ఆరుగురు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించడమే కాకుండా మరో ఆరుగురిని తమవైపునకు తిప్పుకున్నారు. ఇంత చేసినా ఉపయోగం లేకపోయింది.




రాజీవ్‌కు పరిణతి లేదు

- రాజకీయ చతురత లేదు
- ఇందిర మరణానికి ముందే అమెరికా సీఐఏ నివేదిక

వాషింగ్టన్, ఆగస్టు 9: భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి పరిణతి, రాజకీయ చతురత లేవని అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థ (సీఐఏ) పేర్కొంది. తన తల్లి ఇందిరాగాంధీలా ప్రజల్ని ఆకర్షించే శక్తి కూడా లేదని తెలిపింది. సాధారణంగా ప్రతి దేశం వివిధ దేశాల్లోని రాజకీయ పరిస్థితులను సమీక్షించి నివేదికలు రూపొందించుకుంటుంది. ఈ క్రమంలోనే సీఐఏ.. ఇందిర మరణానికి దాదాపు రెండేళ్ల ముందుగా 1983 జనవరి 14న భారత్‌లోని రాజకీయ పరిస్థితులపై నివేదిక రూపొందించింది. ఫ్రీడమ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ యాక్ట్ కింద దాఖలైన ఓ పిటిషన్‌కు సమాధానంగా 'ఇండియా ఇన్ ద మిడ్-1980: గోల్స్ అండ్ చాలెంజెస్' పేరిట ఈ నివేదికను గత ఏడాది డిసెంబరులో విడుదల చేసింది. ఇందులో 'ఇందిరాగాంధీ రాజకీయ వారసుడిగా ఆమె కుమారుడు రాజీవ్ గాంధీ రాణించలేరు. ఏవైనా కారణాల వల్ల ఇందిర మరణించి.. కాంగ్రెస్ పార్టీ పగ్గాలను రాజీవ్‌గాంధీ చేపట్టాల్సివస్తే ఆయన విజయవంతం కాలేరు' అని అభిప్రాయపడింది. ఒకవేళ రాజీవ్ ప్రధాని అయితే ప్రభుత్వాన్ని సమర్థంగా నడపలేరని తెలిపింది. ఈ బాధ్యతలను అప్పటి కేంద్ర మంత్రులు ఆర్.వెంకట్రామన్, పీవీ నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీ, ఎన్డీ తివారీలలో ఒకరికి అప్పగించడం మంచిదని అభిప్రాయపడింది.

భారత్-చైనా 'కౌంట్ డౌన్!'

- ఎట్నుంచి వచ్చినా తిప్పికొడతాం: జైట్లీ



న్యూఢిల్లీ, ఆగస్టు 9: 'కాలాపానీ, కశ్మీర్‌లో అడుగుపెడితే ఏం చేస్తారు?'... ఇది చైనా ప్రశ్న! 'తూర్పు, పడమర సరిహద్దులే కాదు... ఎటువైపు నుంచి వచ్చినా తిప్పి కొడతాం' అంటూ భారత్ కౌంటర్! 'సమయం దాటిపోతోంది. భారత్ వెనక్కి తగ్గాలి' అని చైనా పరోక్ష హెచ్చరికలు! 'మా సైన్యం బలంగా ఉంది. దాడులను తిప్పికొడతాం' అని భారత్ స్పష్టీకరణ! వెరసి... డోక్లాం వివాదం నేపథ్యంలో చైనా, భారత్ మధ్య వాదోపవాదాలు జోరందుకుంటున్నాయి. చైనా ప్రభుత్వ మీడియా తన బెదిరింపు స్వరాన్ని మరింత పెంచింది. భారత్-చైనా యుద్ధానికి కౌంట్‌డౌన్ మొదలైందని 'చైనా డైలీ' బుధవారం తన సంపాదకీయంలో హెచ్చరించింది. "డోక్లాం సంక్షోభానికి శాంతియుత పరిష్కారం కనుక్కునే మార్గం మూసుకుపోతోంది. యుద్ధం తప్ప వేరే మార్గం లేదనిపిస్తోంది" అని తెలిపింది. కాగా, డోక్లాంలో ఇప్పటికీ 53 మంది భారత జవాన్లు ఉన్నారని చైనా ఆరోపించింది. చైనా ప్రత్యక్ష, పరోక్ష ఆరోపణలను భారత రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంటు వేదికగా తిప్పికొట్టారు. "తూర్పు, పశ్చిమ సరిహద్దుల నుంచేగాక.. ఏ వైపు నుంచి వచ్చినా తిప్పికొడతాం. భారత సైన్యం శక్తిమంతంగా ఉంది. దానికి తిరుగులేదు" అన్నారు. తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రాజ్యసభలో జరిగిన ప్రత్యేక చర్చను ఆయన ప్రారంభించారు. 1948లో జమ్మూకశ్మీరులోని కొన్ని ప్రాంతాలను (పాక్ ఆక్రమిత కశ్మీరు) కోల్పోయామని, వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నది దేశ ప్రజలందరి ఆకాంక్ష అని జైట్లీ పేర్కొన్నారు. మరోవైపు, ఇరుగుపొరుగు దేశాలైన భారత్, చైనా శాంతియుతంగా కలిసిమెలిసి జీవించాలని టిబెట్ బౌద్ధమత గురువు దలైలామా ఆకాంక్షించారు.

ట్రంప్-కిమ్ యుద్ధారావం



- మీ ద్వీపాన్ని మిస్సైల్‌తో కొట్టేస్తాం: కిమ్
- హెచ్చరికలు ఆపకపోతే విరుచుకుపడతాం: ట్రంప్
- అమెరికా అణ్వాయుధాలు ఎంతో శక్తివంతమని ట్వీట్

సియోల్, ఆగస్టు 9: ఉత్తర కొరియా మళ్లీ అమెరికాకు తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. పసిఫిక్ మహా సముద్రంలో అమెరికా ఆధీనంలో ఉన్న గువామ్ ద్వీపంపై దాడి చేస్తామని ప్రకటించింది. అమెరికా వ్యూహాత్మక సైనిక స్థావరం అయిన గువామ్‌పై బాలిస్టిక్ క్షిపణి హ్వాసంగ్-12ను ప్రయోగించడానికి ప్రణాళికను ఉత్తర కొరియా పరిశీలిస్తున్నట్లు ఆ దేశ అధికార మీడియా- కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ(కేసీఎన్ఏ) వెల్లడించింది. కాగా, ఉత్తర కొరియాను పదే పదే హెచ్చరికలు చేయడం ఆపకపోతే వీరావేశంతో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర హెచ్చరిక చేశారు. ఆ వెంటనే ఉత్తర కొరియా తోక తొక్కిన తాచులా లేచింది. గువామ్‌పై దాడి చేస్తామని హెచ్చరించింది. దీనికి ప్రతిగా ట్విటర్‌లో ట్రంప్ మరో వార్నింగ్ ఇచ్చారు. అమెరికా అణ్వాయుధాలు గతం కంటే మరింత శక్తివంతమైనవన్నారు. కాగా, అమెరికా, ఉత్తర కొరియా సంయమనం పాటించాలని జర్మనీ, చైనా సూచించాయి.



వైవాహిక అత్యాచారం శిక్షార్హమైన నేరం కాదు

18 ఏళ్లలోపు అమ్మాయి సమ్మతితో శృంగారంలో పాల్గొన్న అబ్బాయిలకు ఏడేళ్ల శిక్ష క్రూరం: సుప్రీం

న్యూఢిల్లీ, ఆగస్టు 9: వైవాహిక అత్యాచారం శిక్షార్హమైన నేరం కాదని.. దీనిపై పార్లమెంటులో ఇప్పటికే చర్చ జరిగిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 375లో రెండో క్లాజు ప్రకారం 15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న భార్యతో భర్త జరిపే శృంగారం అత్యాచారం కిందికి రాదు. ఈ క్లాజును సవాల్ చేస్తూ 'ఇండిపెండెంట్ థాట్' అనే స్వచ్ఛంద సంస్థ 2013లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ క్లాజు రాజ్యాంగ విరుద్ధమని.. అది రాజ్యాంగం దేశ పౌరులందరికీ ప్రసాదించిన సమానత్వ, గౌరవంగా జీవించే హక్కులకు విఘాతం కలిగిస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. 18ఏళ్లలోపు మహిళలతో వారి అంగీకారంతో శృంగారంలో పాల్గొన్నా అది రేప్ కిందకే వస్తుందని.. అలాంటిది 'వివాహం' అనే ఒక్క కారణంతో అది రేప్ కాకుండా పోదని ఆ సంస్థ వాదన. వివాహం అయిందా లేదా అనే విషయంతో సంబంధం లేకుండా.. శృంగారానికి సమ్మతి ఇవ్వదగ్గ వయసును 18 ఏళ్లుగా నిర్ధారించాలని, ఆలోపు వయసున్న అమ్మాయిలతో భర్తే శృంగారంలో పాల్గొన్నా రేప్‌గానే పరిగణించాలని ఆ సంస్థ కోరింది. జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాల ధర్మాసనం ముందుకు బుధవారం ఈ కేసు విచారణకు రాగా.. కేంద్రం తరఫున న్యాయవాది బిను టమ్టా వాదనలు వినిపించారు. సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పార్లమెంటు ఈ 15 ఏళ్ల పరిధిని పెట్టిందన్నారు. అయితే, 15-18 ఏళ్లలోపు అమ్మాయిలు శారీరకంగా పూర్తిగా ఎదగరని, పూర్తిస్థాయి విచక్షణతో వారు నిర్ణయం తీసుకోలేరని పిటిషనర్ల తరఫు న్యాయవాది తెలిపారు. దీనికి ధర్మాసనం.. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం 15 ఏళ్లలోపు అమ్మాయిలతో సమ్మతితో శృంగారంలో పాల్గొన్నా అది రేప్ కిందకే వస్తుందని, 15-18 ఏళ్లలోపు వివాహితల సమ్మతితో వారి వారి భర్తలు శృంగారంలో పాల్గొంటే అది అత్యాచారం కిందికి రాదని స్పష్టం చేసింది. "ఈ అంశంపై పార్లమెంటు విస్తృతంగా చర్చించి, అది అత్యాచారం కిందికి రాదని అభిప్రాయపడింది. కాబట్టి, అది క్రిమినల్ అఫెన్స్ కిందికి రాదు" అని తేల్చిచెప్పింది. "18ఏళ్ల లోపుండి కాలేజీకెళ్లే యువతలో చాలా మంది పరస్పర సమ్మతితో శృంగారంలో పాల్గొంటున్నారు. వారిలో కొందరిపై కేసులు నమోదవుతున్నాయి. ఇందులో అబ్బాయిల తప్పు లేదు. వారికి ఏడేళ్ల జైలు శిక్ష విధించడం క్రూరం" అని వ్యాఖ్యానించింది. బాల్యవివాహాల చట్టం కింద గత మూడేళ్లలో ఎంత మంది తల్లిదండ్రులపై/సంరక్షకులపై కేసులు వేసింది.. ఆ చట్టం కింద ఎంతమంది 'చైల్డ్ మారేజ్ ప్రొహిబిషన్ ఆఫీసర్స్(సీఎంపీవో)'ను నియమించిందీ 3 వారాల్లోగా తెలపాలని కేంద్రాన్ని బెంచ్ ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఎన్సీటీఈపై 43 కేసులు

భారత దేశంలో టీచింగ్ శిక్షణ సంస్థలను పర్యవేక్షించే నేషనల్ కౌన్సెల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్సీటీఈ) పదిహేను రోజుల్లోనే ఏకంగా 43 కేసులను ఎదుర్కొంటోంది. టీచింగ్ శిక్షణ ఇచ్చే సంస్థల్లో నాణ్యతను పెంచేందుకు ఎన్సీటీఈ చర్యలు తీసుకున్న నేపథ్యంలో గడచిన పక్షం రోజుల్లో ఈ పరిణామం చోటు చేసుకుంది. మౌలిక సదుపాయాల లేమి, సరైన విద్యా వాతావరణం లేనందున అవన్నీ సరి చేసుకుని తమ ముందుకు రావాలని ఎన్సీటీఈ ఆ సంస్థలను కోరింది. గత నెల 31 వరకు గడువు ఇచ్చింది. సదరు సంస్థలు ఆ పని చేయకపోగా, కొత్త అకడమిక్ సంవత్సరంలో విద్యార్థులను చేర్చుకునేందుకు అనుమతి కోసం అవి కోర్టుకు ఎక్కాయి. ఎనిమిది హైకోర్టుల నుంచి 43 కేసులకు సంబంధించి ఇప్పటికే నోటీసులను అందుకుంది. తాము చేపట్టిన ప్రక్షాళన చర్యను అడ్డుకునేందుకు ఆ సంస్థలు కోర్టు గుమ్మం తొక్కాయంటూ ఎన్సీటీఈ అధికారి ఒకరు అనధికారంగా వాపోయారు. సమస్య కోర్టులో ఉన్నందున వ్యాఖ్యానించేందుకు ఆయన నిరాకరించారు. కాగా పన్నెండు వేల కాలేజీల ప్రిలిమినరీ డేటాను ఇప్పటికే సేకరించినట్టు ఎన్సీఈటీ ఇప్పటికే తెలిపింది. **– ఎడ్యుకేషన్ డెస్క్**

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.